జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | మంగళవారం 04 ఆగస్టు 2026 | సంపుటి: 19 | సంచిక: 150 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , శ్రావణ మాసము , తిథి: తృతీయ - 23:09:45 వరకు నక్షత్రంశతభిష - 20:46:16 వరకు కరణంవణిజ - 10:55:14 వరకు, విష్టి - 23:09:45 వరకు పక్షంకృష్ణ యోగంశోభన - 23:22:39 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## పశ్చిమాసియా ఉద్రిక్తతలు తగ్గడంతో సానుకూలత

**లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు**

**ఒక్క సెషన్‌లోనే 5లక్షల కోట్లు పెరిగిన సంపద**

ముంబై,ఆగస్ట్3(ప్రజాజ్యోతి): దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ తో చర్చలు ఉంటాయని ప్రకటించడంతో పశ్చిమాసియా లో ఉద్రిక్తతలు చల్లారాయి. దాంతో చమురు ధరలు

మిగతా 2లో..

## రోడ్డు ప్రమాదాల నివారణకు ఆధునిక సాంకేతిక

**వీ2వీ సాంకేతికతను అమలు చేసేందుకు కేంద్రం ముసాయిదా**

న్యూఢిల్లీ,ఆగస్ట్3(ప్రజాజ్యోతి): దేశంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వాహనాల మధ్య నేరుగా సమాచార మార్పిడి జరిగే వీ2వీ సాంకేతికతను అమలు చేసేందుకు కేంద్ర రహదారి రవాణా శాఖ

మిగతా 2లో..

## సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెంపు

విపక్ష సభ్యుల ఆందోళన మధ్య చర్చ లేకుండానే ఆమోదం



న్యూఢిల్లీ,ఆగస్ట్3(ప్రజాజ్యోతి): సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను పెంచేందుకు ఉద్దేశించిన బిల్లుకు లోక్‌సభ సోమవారం ఆమోదం తెలిపింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను ప్రధాన న్యాయమూర్తితో కలిపి 34 నుంచి 38కి పెంచుతూ జారీ చేసిన ఆర్డినెన్స్ స్థానంలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. అయితే, నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం, రామమందిర విరాళాల నిధుల దుర్వినియోగం ఆరోపణలపై విపక్ష సభ్యులు నినాదాలు చేస్తుండటంతో

మిగతా 12 లో..

## విద్యార్థులపై నమోదైన కేసులు వెనక్కి

ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు

సుప్రీంకోర్టుకు వివరించిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ,ఆగస్ట్3(ప్రజాజ్యోతి): జంతర్‌మంతర్ వద్ద గత నెలలో విద్యార్థుల ఆందోళనల సందర్భంగా నమోదైన ఎఫ్‌ఐఆర్ ల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీపై సుప్రీంకోర్టు సోమవారం విచారణ చేపట్టింది. విద్యార్థులపై నమోదైన కేసులను ముందుకు తీసుకెళ్లబోమన్న తమ హామీకి కట్టుబడి ఉన్నామని ధర్మాసనానికి కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ హామీని అత్యంత బాధ్యతగా అమలు చేయాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. విచారణ

మిగతా 12 లో..

## సహజీవనం కూడా చట్టబద్ధమైన జీవితమే

భాగస్వామిని వేధింపులకు గురిచేస్తే చట్టప్రకారం శిక్ష

సుప్రీం ధర్మాసనం సంచలన తీర్పు

న్యూఢిల్లీ,ఆగస్ట్3(ప్రజాజ్యోతి): సహజీవనం అంశంపై భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. సహజీవనంలో భాగస్వామిని వేధింపులకు గురి చేస్తే భారతీయ శిక్షాస్మృతి లోని సెక్షన్ 498-ఏ ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చని స్పష్టం చేసింది. పెళ్లి కాలేదనే కారణంతో భర్త స్థానంలో

మిగతా 12 లో..



# వేగంగా ముందుకు తీసుకెళ్లాలి

**సాగునీటి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులే ప్రధానం**

- సుప్రీంకోర్టు తీర్పుతో న్యాయపరమైన స్పష్టత
- రాష్ట్ర ప్రయోజనాలకు అనుగుణంగా సద్వినియోగం చేసుకోవాలి
- పాలమూరు-రంగారెడ్డి, సీతారామ, గౌరవెల్లి ప్రాజెక్టులకు ప్రాధాన్యం
- సాధ్యమైనంతవరకు ఆరు నెలల్లో పక్రియ పూర్తిచేయాలని లక్ష్యం
- 60 రోజుల్లో ప్రధాన పరిపాలనా, దరఖాస్తుల ప్రక్రియ పూర్తి
- గౌరవెల్లి పంప్‌హౌస్‌ను నీటి విడుదలకు సర్వసన్నద్ధంగా ఉంచాలి
- అనుమతులు రాగానే సీతారామ సాగర్ పనులు పునఃప్రారంభించాలి
- రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు అంతర్రాష్ట్ర విభాగాన్ని బలోపేతం చేయాలి
- నీటిపారుదల, పౌరసరఫరాల శాఖమంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్,ఆగస్ట్3(ప్రజాజ్యోతి): రాష్ట్ర సాగునీటి భవిష్యత్తుకు అత్యంత కీలకమైన నాలుగు ప్రధాన ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు సాధించే పక్రియను ఇకపై కాలపరిమితితో కూడిన కార్యాచరణగా ముందుకు తీసుకెళ్లాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, సీతారామ సాగర్, డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులను అత్యున్నత ప్రాధాన్య జాబితాలో ఉంచి, సాధ్యమైనంతవరకు ఆరు నెలల్లో ప్రాజెక్టులవారీగా పర్యావరణ అనుమతులు సాధించేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. పర్యావరణ అనుమతుల పక్రియకు సంబంధించి సుప్రీంకోర్టు ఇటీవల వెలువరించిన తీర్పు న్యాయపరమైన స్పష్టతను కల్పించడంతోపాటు రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టుల అనుమతుల సాధనకు కొత్త అవకాశాల ద్వారాలను తెరిచిందని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకొని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖతోపాటు సంబంధిత చట్టబద్ధ సంస్థల వద్ద పెండింగ్‌లో ఉన్న ప్రతి అర్హమైన ప్రతిపాదనను వేగంగా ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. సాగునీటి ప్రాజెక్టుల పర్యావరణ అనుమతులు, న్యాయపరమైన అంశాలు, పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంపై సోమవారం రోజున రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశానికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మిగతా 2 లో..



# కర్నాటక కాంగ్రెస్‌లో విస్తరణ చిచ్చు

20మంది కొత్త మంత్రుల ప్రమాణం

చోటు దక్కని పలువురు ఎమ్మెల్యేల ఆగ్రహం

అసమ్మతి నేతల ఆందోళనలు.. ధర్నాలు

ఎమ్మెల్యే యశ్వంతరాయ గౌడ పాటిల్ రాజీనామా

బెంగళూరు,ఆగస్టు 3( ప్రజాజ్యోతి): కర్ణాటక ముఖ్యమంత్రి డీ.కే. శివకుమార్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన మంత్రివర్గ విస్తరణ రాష్ట్ర కాంగ్రెస్‌లో చిచ్చు రేపింది. ఆగ్రహావేశాలు, ఆనందోత్సాహాలను చవిచూడాల్సి వచ్చింది. కొందరిలో విపరీతమైన ఆనందోత్సాహానికి, మరికొందరిలో తీవ్ర ఆగ్రహావేశాలకు కారణమైంది. ఏకంగా 20 మంది కొత్త మంత్రుల ప్రమాణస్వీకారంతో ఒకవైపు పండుగ వాతావరణం సంతరించుకోగా, మరోవైపు తీవ్ర అసమ్మతి, ధర్నాలు, ఆందోళనలకు దారితీసింది. కేబినెట్‌లో చోటు దక్కకపోవడంతో అసమ్మతి నేతలు బహిరంగంగానే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి పదవి దక్కకపోవడంపై తీవ్ర మనస్థాపానికి గురైన ఎమ్మెల్యే యశ్వంతరాయ గౌడ పాటిల్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. 'పార్టీ నాయకత్వం నన్ను తీవ్రంగా గాయపరిచింది.

మిగతా 12 లో..

## ఈయేడు కుంభవృష్టి వర్షాలు తప్పవు

వర్షాలతో ప్రాణనష్టం కూడా ఎక్కువే

రంగం భవిష్యవాణిలో మాతంగి వెల్లడి

మహంకాళి ఆలయం వద్ద జోగినిలకు అవమానం

జోగినిలను అడ్డుకోవడంపై ఆలయం ముందు ఆందోళన

ప్రభుత్వ నిర్లక్ష్యంపై మండిపడ్డ జోగిని శ్యామల



హైదరాబాద్,ఆగస్ట్3(ప్రజాజ్యోతి): సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయంలో మాతంగి స్వర్ణలత భవిష్యవాణి(రంగం) వినిపించారు. మీరెవరూ నేను చెప్పింది ఏదీ ఆచరించడం లేదంటూ మాతంగి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడకు నేను సంతోషంగా రాలేదు.. క్రోధంతో వచ్చానని అన్నారు. మీ ప్రశ్నలకు ఎందుకు సమాధానం చెప్పాలని నిలదీశారు. నా విగ్రహం ప్రతిష్ట చేస్తానని మాట ఇచ్చి జరిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ఆపద వచ్చినా.. ప్రమాదం వచ్చినా కాపాడుతున్నానని మాతంగి స్వర్ణలత తెలిపారు. కానీ మీరు చేసే చర్యలే

మిగతా 2 లో..



# నిరుద్యోగులను మోసం చేసిన రేవంత్

- ఉద్యోగాల భర్తీ పేరుతో ఆటలాడుకున్నారు
- నిరుద్యోగ నియామకాలు, భృతి హామీల విస్మరణ
- యువత ఆందోళనలను పట్టించుకోని కాంగ్రెస్
- మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నేత కేటీఆర్

హైదరాబాద్,ఆగస్ట్3(ప్రజాజ్యోతి): రాష్ట్రంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను సిఎం రేవంత్ రెడ్డి పూర్తిగా విస్మరించారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. యూత్ డిక్లరేషన్ పేరిట ప్రచారంతో కాంగ్రెస్ ఊదరగొట్టిందని విమర్శించారు. జాబ్‌లు భర్తీ చేయకపోవడంతో ఓ యువకుడు ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. ఈ మేరకు సోమవారం పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో కెటీఆర్ మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో 20వేల పోలీసు ఉద్యోగాల ఖాళీలు ఉంటే.. 7 వేల పోస్టులకే నోటిఫికేషన్ ఇవ్వడమేంటన్నారు. ఉద్యోగాలు అడిగితే ఎండ్రిన్ తాగి చావాలని.. ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లను క్రిమినల్ వేస్ట్ అని సీఎం అంటున్నారు. ముఖ్యమంత్రి బాధ్యత లేకుండా మాట్లాడు తున్నారని మండిపడ్డారు. సీఎం వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ స్పందించరా..? యూత్ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ 24

## పోలీస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై అసంతృప్తి

**ఇందిరాపార్క్ వద్ద నిరుద్యోగుల మెరుపు ధర్నా**

**19వేల ఖాళీ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్**

హైదరాబాద్,ఆగస్ట్3(ప్రజాజ్యోతి): తెలంగాణలో పోలీస్ ఉద్యోగాల భర్తీ పక్రియపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ నిరుద్యోగ యువత హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ చౌరస్తాలో సోమవారం మెరుపు ధర్నాకు దిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన 7,437 పోలీస్ పోస్టుల నోటిఫికేషన్

మిగతా 12 లో..



## మరింత పటిష్టంగా మీ సేవ కేంద్రాలు

అత్యుత్తమ డిజిటల్ సేవలు అందించాలి

ప్రపంచ బ్యాంక్ ఆసియా పసిఫిక్ ప్రాంతీయ డైరెక్టర్‌తో సిఎస్ భేటీ

హైదరాబాద్,ఆగస్ట్3(ప్రజాజ్యోతి): రాష్ట్రంలో మీ సేవ కేంద్రాలను మరింత పటిష్టపరిచి ప్రజలకు అత్యుత్తమ డిజిటల్ సేవలు అందించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ప్రపంచ బ్యాంక్ గ్రూప్‌కు చెందిన డిజిటల్ ఆసియా పసిఫిక్ ప్రాంతీయ డైరెక్టర్ మహేష్ ఉత్తమ్‌చందానీ

మిగతా 2 లో..

## బీహార్‌లో బీజేపీకి అతిపెద్ద షాక్

**బంకీపూర్ అసెంబ్లీలో ప్రశాంత్ కిశోర్ భారీ విజయం**

**30 ఏళ్ల కంచుకోటను బద్దలు కొట్టిన ప్రశాంత్**

పాట్నా,ఆగస్టు 3( ప్రజాజ్యోతి): బిహార్‌లో సరికొత్త రాజకీయం ఆవిష్కృతం అయ్యింది. అలాగే బిజెపికి అతిపెద్ద షాక్ తగిలింది. బంకీపూర్ శాసనసభ ఉపఎన్నికలో జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిషోర్ సంచలన విజయం సాధించారు. గత 30 ఏళ్లుగా బిజెపికి కంచుకోటగా ఉన్న

మిగతా 2 లో..



# సంపాదకీయం

## హామీలను మోసగిస్తున్న పాలకులు!

తెలంగాణలో రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు కావస్తోంది. ప్రధాన సమస్యలపై ఇప్పటికీ స్పష్టత లేకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. ముఖ్యంగా ధరణి విషయంలో ఎన్నో చెప్పిన రేవంత్ రెడ్డి ఇప్పటికీ దీనిపై స్పష్టత లేదు. ఎన్ని భూములు అన్యాకాంత్రం అయ్యాయో తెలియదు. దీనిపై సమగ్ర విచారణ జరిపి చర్య తీసుకోలేదు. దేవాదాయ భూములు తెలంగాణలో వేల ఎకరాలు అన్యాక్రాంతం అయ్యాయి. కొందరు దౌర్జన్యంగా అవి పట్టాలు చేయించుకుని, రైతుభరోసా కూడా పొందుతున్నారు. ఈ భూములను స్వాధీనం చేసుకోవడంలో గత కెసిఆర్ ప్రభుత్వం, రేవంత్ ప్రభుత్వం కూడా విఫలమయ్యింది. మంత్రి కొండా సురేఖ ఉత్సవ విగ్రహంలా తయారయ్యారన్న విమర్శలు ఉన్నాయి. ఎపిలో కూడా ఇలాంటి భూములపై చంద్రబాబు ఒక్కమాటా మాట్లాడడం లేదు. ఇకపోతే కాళేశ్వరంపై విమర్శలు తప్ప ఉన్న ప్రాజెక్టును ఉపయోగించుకునే ఆలోచన చేయడంలేదు. జర్నలిస్టుల అక్రిడిటేషన్లపై గందరోగళం జరుగు తోంది. దీనిని సజావుగా పరిష్కరించడం లేదు. కోర్టుల్లో కేసులు కూడా దాఖలు అయ్యాయి. జర్నలిస్టులు ఇంటిస్థలాలు, ఆరోగ్య కార్డులు ఊసే లేదు. ఇప్పటికే ఉమ్మడి ఎపిలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి కేటాయించిన 70 ఎకరాల భూమిని కాజేసే కుట్రలు మొదలయ్యాయి. సుప్రీంకోర్టు తీర్పును బూచిగా చూపి, వేలకోట్ల విలువ చేసే భూమిని లాగేసుకుని, జర్నలిస్టులకు మొడిచేయి చూపేందుకు రంగం సిద్దం చేశారు. ఇందులో కొందరు జర్నలిస్టుల పాత్రకూడా ఉంది. జర్నలిస్టులకు అన్యాయం చేయడంలో టిడిపి ప్రభుత్వం, జగన్ ప్రభుత్వం కూడా ఎపిలో ఇదే తరహా పోకడలు సాగించింది. ఇక అన్నింటికన్నా పెద్ద సమస్య నిరుద్యోగ సమస్య. మొన్నటికి మొన్న ఢిల్లీలో కాక్రోచ్ జనతాపార్టీ ఆందోళనలకు మద్దతు తెలిపిన రాహుల్, రేవంత్ రెడ్డిలు తెలంగాణ నిరుద్యోగుల ఆందోళనలకు మాత్రం సమాధానం చెప్పడం లేదు. ఇక్కడా అలాంటి ఉద్యమం వస్తే తప్ప వీరు స్పందించేలా లేరు. క్యాలెండర్లు మారాయి కానీ కొలువులు మాత్రం రావడలేదని ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. తెలంగాణలో ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలిస్తానన్న కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లు దాటినా నిరుద్యోగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదు. ఇటీవలే సిఎం రేవంత్ 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పారు. అంటే ఆయన ఇచ్చిన హామీని ఆయనే నెరవేర్చలేదని చెబుతున్నారు. అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌కు రెండేండ్లు పూర్తయినా.. నోటిఫికేషన్లు విడుదల చేయలేదు. నోటిఫికేషన్లపై మాట తప్పిన సర్కార్ మీద నిరుద్యోగులు ఆగ్రహంగా ఉన్నారు. ఏటా జాబ్ క్యాలెండర్.. రెండు లక్షల ఉద్యోగాల భర్తీ.. నాలుగువేల రూపాయల చొప్పున నిరుద్యోగ భృతి.. ఇదీ కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ. కానీ, అధికారంలోకి వచ్చిన తరువాత నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను విస్మరించింది. జాబ్ క్యాలెండర్ జాడ లేదు. నిరుద్యోగ భృతి ఊసులేదు. 'ఇదిగో మా నిబద్ధత..' అంటూ 2024 ఆగస్టు 2న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్‌ను ప్రవేశపెట్టారు. 15 రకాల నోటిఫికేషన్లు ఇస్తామని చెప్పారు. ఈ క్యాలెండర్ గడువు కూడా ముగిసింది. కానీ, అందులో పేర్కొన్న ఒక్క నోటిఫికేషన్ కూడా విడుదల కాలేదు. 2025 ఆగస్టు 2,శనివారంతో 2026 ఆగస్టు 2 కూడా గడిచిపోయింది.రెండేండ్ల గడువు పూర్తయ్యింది. అసెంబ్లీలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌కు విలువ లేకుండా పోయింది. నిరుద్యోగ యువతను తమవైపు తిప్పుకొనేం దుకు కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు యూత్ డిక్లరేషన్ ప్రకటించింది. దీనిని ఎన్నికల మ్యానిఫెస్టోలో సైతం పొందుపరిచింది. కానీ, డిక్లరేషన్‌లో ప్రకటించిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. ఉద్యోగాలొచ్చే వరకు యువతకు నెలకు రూ. 4వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని కూడా కాంగ్రెస్ నేతలు మరచిపోయారు. అమ్మాయిలకు ఎలక్ట్రిక్ స్కూటీలు ఇస్తామన్న హామీని కూడా నెరవేర్చలేదు. రూ.5 లక్షల విద్యాభరోసా కార్డు, రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తామన్న హామీని పట్టించుకోలేదు. రాష్ట్రవ్యాప్తంగా ఏటా దాదాపు 9వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు రిటైర్ అవుతున్నట్లు అంచనాలు ఉన్నాయి. వీరితోపాటు విద్యుత్తు సంస్థలు, పలు బోర్డులు, విభాగాల్లోనూ పెద్దఎత్తున ఉద్యోగ విరమణ పొందుతున్నారు. తాజా గణాంకాల ప్రకారం పాఠశాల విద్యాశాఖలో 14వేలకుపైగా టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని అంటున్నారు. యూనివర్సిటీల్లో 2వేలకుపైగా బోధన, మరో 2,800 బోధనేతర పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గురుకులాల్లో ఆరువేలు, ఆర్టీసీలో మూడువేలకుపైగా, పోలీసుశాఖలో 17వేలకుపైగా ఖాళీలున్నాయి. ఎక్సైజ్ శాఖలో వెయ్యి, అంగన్‌వాడీల్లో 15వేలకుపైగా, మైనారిటీ సంక్షేమ శాఖలో మూడువేలకుపైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇలా పలు శాఖల్లో పెద్దఎత్తున ఖాళీలున్నా సర్కార్ నోటిఫికేషన్లు విడుదల చేయడంలేదన్న ఆందోళన నిరుద్యోగుల్లో ఉంది. మరోవైపు రాష్ట్రంలో రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉండటం గమనార్హం. మూడు లక్షల మంది రెగ్యులర్ ఉద్యోగులుంటే అంతే స్థాయిలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు. దీనికి గత కెసిఆర్ ప్రభుత్వం ప్రధాన దోషిగా ప్రకటించాలి. ఇంటికో ఉద్యోగం అంటూ మోసం చేసి, అలా అనలేదని బుకాయించారు. లక్షల ఉద్యోగాలు ఇచ్చామని చెట్టుమీద ఆకులతో ఇస్తార్లు కుట్టినట్లు లెక్కలు చెప్పారు. ఏతావాతా ఎవరు అధికారంలోకి వచ్చినా తమ స్వప్రయోజనాలు తప్ప ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదని తేల్చారు. అలు కెసిఆర్, రేవంత్, చంద్రబాబు, జగన్ ఎవరైనా ప్రజలు మాటలతో బురిడీ కొట్టించడంలో ఆరితేరారు.



# నిరుద్యోగులను మోసం చేసిన రేవంత్

మొదటిపేజీ తరువాయి..

హామీలు ఇచ్చి ఒక్కటైనా నెరవేర్చిందా..? అత్యధిక క్రిమినల్ కేసులు ఉన్న రేవంత్‌రెడ్డే క్రిమినల్ వేస్ట్ అంటూ విమర్శలు గుప్పించారుఉ. సీఎం రేవంత్ రెడ్డి ఏం చదివారో కూడా నాకు డౌటే. ఆయన ఎన్నికల నామినేషన్ పత్రం సొంతంగా నింపుకోగలరా?. ఆయన ఒక్క ఇంటర్వ్యూకైనా వెళ్లారా..?' అని కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో యువత తీవ్ర నిరాశలో ఉందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఉద్యోగ హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలోని యువత ఒక రకమైన నిర్వేదంలో ఉందన్నారు. దేశ రాజకీయాలను గమనిస్తున్న ప్రతి ఒక్కరికీ ఈ విషయం అర్థమవుతోందని.. ఎన్నికల సమయంలో యువతను వాడుకోవడం కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు అలవాటుగా మారిందన్నారు. అసెంబ్లీలో ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ ను ప్రస్తావిస్తూ.. రెండేళ్ల క్రితం కూడా ఉద్యోగాల భర్తీపై హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. ప్రచార సభల్లో ఇచ్చిన హామీలకు విలువ లేకపోయినా, కనీసం శాసనసభలో ఇచ్చిన మాటకైనా విలువ ఉండాలని అన్నారు. ఇటీవల ఖమ్మంలో వేణు అనే విద్యార్థి ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటనను ప్రస్తావించిన కేటీఆర్.. అతడు రాసిన సూసైడ్ నోట్‌లో రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు చేరే వరకు షేర్ చేయాలని పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. ఆ లేఖలో తమను కూడా ప్రస్తావించారని, అయితే అది సాధారణ సూసైడ్ నోట్ కాదని, కాంగ్రెస్ ప్రభుత్వంపై రాసిన చార్జ్‌షీట్‌లాంటిదని అన్నారు. అశోక్‌నగర్‌లో రాహుల్ గాంధీ ఇచ్చిన ఉద్యోగ హామీలను గుర్తు చేస్తూ.. ఉద్యోగాలు ఇవ్వకపోతే రాహుల్ గాంధీ ఇప్పుడు తెలంగాణకు ఎందుకు రావడం లేదు.? ఎక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందో అక్కడికి వెళ్లరు.. కానీ తమ ప్రభుత్వం లేని రాష్ట్రాల్లో మాత్రం రాజ్యాంగ పుస్తకం పట్టుకుని తిరుగుతారంటూ విమర్శించారు. చివరగా ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగుల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో మాజీమంత్రి జగదీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# వేగంగా ముందుకు తీసుకెళ్లాలి

మొదటిపేజీ తరువాయి..

అధ్యక్షత వహించారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ బలరాం నాయక్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. సుప్రీంకోర్టు తాజా తీర్పులో పేర్కొన్న అంశాలను ప్రస్తావించిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, గతంలో చట్టబద్ధంగా పర్యావరణ అనుమతులు పొందిన ప్రాజెక్టులకు ఆ రక్షణ కొనసాగుతుందని తెలిపారు. ఇప్పటికే పరిశీలనలో ఉన్న దరఖాస్తులను సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా పరిష్కరించే అవకాశం ఉందన్నారు. గతంలో తిరస్కరణకు గురైన ప్రతిపాదనలను ప్రాజెక్టులవారీగా సమగ్రంగా పరిశీలించి, సాంకేతిక, విధానపరమైన లోపాలను సరిదిద్దిన అనంతరం చట్టపరంగా అవకాశం ఉన్నచోట తిరిగి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాజెక్టుల పర్యావరణ అనుమతులపై సుదూర ప్రభావం చూపగల ఈ తీర్పు వెలువడటం వెనుక తెలంగాణ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు అనుమతులు సాధించేందుకు నిరంతరంగా సాగించిన న్యాయపోరాటం ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఈ తీర్పులోని న్యాయసూత్రాలను లోతుగా అధ్యయనం చేసి, రాష్ట్రంలోని ప్రతి ప్రాజెక్టుకు అవి ఏ విధంగా వర్తిస్తాయో ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. తెలంగాణ సాగునీటి ప్రయోజనాల పరిరక్షణలో అంతర్రాష్ట్ర విభాగం అత్యంత కీలకమని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆ విభాగాన్ని తగిన సాంకేతిక, పర్యావరణ, న్యాయ నిపుణులతో మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం, జాతీయ హరిత ట్రిబ్యునల్?ఎన్‌జీటీ, సుప్రీంకోర్టు, ఇతర న్యాయస్థానాలు, చట్టబద్ధ సంస్థల ముందు తెలంగాణ వాదనను శాస్త్రీయ ఆధారాలు, సమగ్ర పత్రాలతో బలంగా వినిపించే సామర్థ్యాన్ని పెంపొందించాలన్నారు. ÷–రతి ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి చరిత్ర అధికారుల వద్ద అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. అసలు పర్యావరణ అనుమతులు, ఆ తర్వాత ప్రాజెక్టు పరిధిలో చోటుచేసుకున్న మార్పులు, రీడిజైన్, విస్తరణ, ప్రాజెక్టు ప్రాంత మార్పు, పెండింగ్ దరఖాస్తులు, న్యాయస్థానాల్లో కొనసాగుతున్న కేసులు, పాటించాల్సిన నిబంధనలు, జరిమానాలు ఉంటే వాటి వివరాలు?ఇలా ప్రతి అంశాన్ని ఒకే సమగ్ర దస్త్రంలో పొందుపరచాలని ఆదేశించారు. పర్యావరణ అనుమతుల సాధనకు మంత్రి దశలవారీ కార్యాచరణను నిర్దేశిరచారు. ప్రతి ప్రాజెక్టుకు ప్రత్యేక నోడల్ అధికారిని నియమించి, అందుబాటులో ఉన్న పత్రాలు, రికార్డులన్నింటినీ ఏడు రోజుల్లో సమీకరించాలని ఆదేశించారు. నవీకరించిన పర్యావరణ అధ్యయనాలు, నిబంధనల అమలు నివేదికలు, భూ రికార్డులు, న్యాయపరమైన పత్రాలు, ఇతర అవసరమైన దస్త్రాలను 30 రోజుల్లో సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ప్రధాన పరిపాలనా పక్రియతోపాటు దరఖాస్తుల తయారీ, పరిశీలన, సమర్పణకు సంబంధించిన దశలను 60 రోజుల్లో పూర్తిచేయాలని సూచించారు. చట్టబద్ధ విధానాలు, సంబంధిత సంస్థల పరిశీలనకు లోబడి సాధ్యమైన ప్రతి ప్రాజెక్టుకు ఆరు నెలల్లో పర్యావరణ అనుమతులు సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రకటించారు. ప్రాజెక్టుల పురోగతిపై ప్రతి వారం నివేదిక సమర్పించాలని, ప్రతి నెలా ఉన్నతస్థాయిలో సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. నిర్ణీత గడువుల అమలులో అలసత్వం, నిర్లక్ష్యానికి ఏమాత్రం తావులేదని స్పష్టం చేశారు. ర్యావరణ ప్రభావ అధ్యయనాలు, పునరావాస?పునర్నిర్మాణ ప్రణాళికలు, అటవీ అనుమతుల దస్త్రాలు, భూసేకరణ రికార్డులు, న్యాయస్థానాల్లో దాఖలు చేయాల్సిన కౌంటర్ అఫిడవిట్ల తయారీలో ఏ చిన్న లోపం ఉన్నా మొత్తం అనుమతుల పక్రియ ఆలస్యమయ్యే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. అందువల్ల ప్రతి పత్రం సాంకేతికంగా, న్యాయపరంగా లోపరహితంగా ఉండేలా చూడాలని సూచించారు. ప్రాజెక్టు డిజైన్లలో గణనీయమైన మార్పులు చేపట్టే ముందే పర్యావరణ, అటవీ, పునరావాసం, భూసేకరణ, పరిహారం తదితర అంశాలను పరిష్కరించాలని మంత్రి స్పష్టం చేశారు. నిబంధనలను ముందుగానే పాటించడం ద్వారా న్యాయపరమైన వివాదాలను నివారించవచ్చని, అదే సమయంలో రైతులు, భూ యజమానులు, ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాల న్యాయబద్ధమైన ప్రయోజనాలను పరిరక్షించవచ్చని పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ఎంత ముఖ్యమో, వాటి పరిధిలో భూములు, జీవనోపాధి కోల్పోతున్న కుటుంబాలకు న్యాయం చేయడం కూడా అంతే ముఖ్యమని తెలిపారు. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, సామాజిక న్యాయం?ఈ మూడింటి మధ్య సమతుల్యత ఉండేలా ప్రాజెక్టుల కార్యాచరణ కొనసాగాలని సూచించారు. గౌరవెల్లి ప్రాజెక్టును ప్రత్యేకంగా సమీక్షించిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పంప్‌హౌస్‌ను పూర్తిస్థాయిలో నిర్వహణకు సిద్ధంగా ఉంచేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఇంజినీర్లను ఆదేశించారు. పంపులను వినియోగంలోకి తీసుకొచ్చే సమయానికి ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ముందుగానే తనిఖీలు, పరీక్షలు, అవసరమైన మరమ్మతులు పూర్తి చేయాలని సూచించారు. నిర్దేశిత ప్రామాణిక నిర్వహణ విధానాలను?ఎస్‌ఓపీలను?కచ్చితంగా అమలు చేయాలన్నారు. ప్రాజెక్టు ఎడమ, కుడి కాలువ వ్యవస్థలను ఇంజినీరింగ్ బృందాలు సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు. నీటి స్వేచ్ఛాయుత ప్రవాహానికి అడ్డుగా ఉన్న అవరోధాలను గుర్తించి, అత్యవసర పనులకు అంచనాలు సిద్ధం చేయాలని చెప్పారు. అసంపూర్తిగా ఉన్న కాలువ తవ్వకాలు, గట్ల తొలగింపు లేదా కోత అవసరాలు, నీటి విడుదల కేంద్రాలు, గ్రామాల మధ్య అనుసంధానం, రహదారి క్రాసింగ్‌లు, ప్రజల రాకపోకలకు అవసరమైన వంతెనలు తదితర అంశాలన్నింటినీ ఈ తనిఖీల పరిధిలోకి తీసుకురావాలని సూచించారు. ప్రస్తుతం ప్రధాన ప్రాధాన్యం అత్యంత కీలకమైన అవరోధాలను తొలగించి, సాధ్యమైనంత త్వరగా నీటిని తరలించగల సామర్థ్యంతో ప్రధాన కాలువల వ్యవస్థను సిద్ధం చేయడమేనని మంత్రి స్పష్టం చేశారు. సీతారామ సాగర్ ప్రాజెక్టుకు అవసరమైన అధ్యయనాలు, పర్యావరణ పత్రాలను ఏమాత్రం ఆలస్యం లేకుండా నవీకరించాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. సంబంధిత అనుమతి లేదా న్యాయపరమైన ఆమోదం లభించిన వెంటనే పనులను పునఃప్రారంభించేందుకు వీలుగా చేపట్టాల్సిన ప్యాకేజీలకు సంబంధించిన ఇంజినీరింగ్ ప్రణాళికలు, అంచనాలు, టెండర్ పత్రాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని చెప్పారు. అనుమతులు వచ్చిన తర్వాత మళ్లీ సన్నాహాల పేరుతో సమయం వృథా కాకూడదని స్పష్టం చేశారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, డిండి ప్రాజెక్టుల పర్యావరణ అనుమతుల విషయంలోనూ ఇదే స్థాయి అత్యవసరతతో వ్యవహరించాలని సూచించారు. ప్రతి ప్రాజెక్టుకు ప్రత్యేక అధికారుల బృందం ఉండాలని, ఆ బృందం పత్రాల తయారీ, కేంద్ర ప్రభుత్వ విభాగాలతో సమన్వయం, దరఖాస్తుల పురోగతి, పెండింగ్ న్యాయ వ్యవహారాలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన ఎన్‌జీటీ, సుప్రీంకోర్టు కేసుల విషయంలో రాష్ట్ర న్యాయ సలహాదారులు, అదనపు అడ్వకేట్ జనరల్, సీనియర్ న్యాయవాదులతో శాఖాధికారులు సన్నిహిత సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ప్రతి పర్యావరణ కేసును విడివిడిగా సమీక్షించి, నిబంధనల అమలు నివేదికలు, సాంకేతిక రికార్డులు, పర్యావరణ అధ్యయనాలు, కౌంటర్ అఫిడవిట్లను ముందుగానే సిద్ధం చేయాలన్నారు. న్యాయస్థానంలో కేసు విచారణకు వచ్చిన తర్వాత హడావుడిగా సమాచారం సేకరించే పరిస్థితి ఉండకూడదని స్పష్టం చేశారు. పర్యావరణ అనుమతుల సాధన కోసం రాష్ట్ర బృందానికి నాయకత్వం వహిస్తున్న న్యాయవాది శ్రవణ్‌కుమార్ ఈ సందర్భంగా వివిధ కేసుల ప్రస్తుత స్థితి, సుప్రీంకోర్టు తాజా తీర్పు వల్ల ఏర్పడనున్న న్యాయపరమైన పరిణామాలను సమావేశానికి వివరించారు. సుప్రీంకోర్టు నిర్దేశించిన సూత్రాలు, అనంతరం కేంద్ర ప్రభుత్వం జారీచేసే మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రాజెక్టులవారీ కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి న్యాయబృందం, శాఖాధికారులను ఆదేశించారు.

# బీహార్‌లో బీజేపీకి అతిపెద్ద షాక్

మొదటిపేజీ తరువాయి..

ఈ నియోజకవర్గంలో పీకే గెలుపు జెండా ఎగరేశారు. ప్రశాంత్ కిశోర్ తన సమీప బీజేపీ అభ్యర్థి నీరజ్ సిన్హాపై 18,953 ఓట్ల భారీ తేడాతో ఘన విజయం సాధించారు. ఉదయం కౌంటింగ్ మొదలైనప్పటి నుంచీ బీజేపీ నేత నీరజ్ కుమార్ కంటే ముందంజలో ఉన్న ప్రశాంత్ కిశోర్ ఒక్కో రౌండ్ ముగిసేసరికి తన ఆధిక్యాన్ని అంతకంతకూ పెంచుకున్నారు. పీకేకు 63,203 పోలయ్యాయి. అలానే రెండో స్థానంలో నిలిచిన బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్ కు 44,250, మూడో స్థానంలో నిలిచిన ఆర్జేడీ అభ్యర్థి రేఖ కుమారి 14,085 ఓట్లు సాధించారు. ఈ చరిత్రాత్మక విజయం అనంతరం ప్రశాంత్ కిశోర్ మాట్లాడుతూ.. తన గెలుపు బీజేపీ హైకమాండ్‌కు ఒక బలమైన సందేశమని వ్యాఖ్యానించారు. నేర చరిత్ర కలిగిన వ్యక్తిని బిహార్ ముఖ్యమంత్రిగా చేశారని తీవ్రస్థాయిలో మండిపడిన ఆయన, సామ్రాట్ చౌదరిని వెంటనే సీఎం పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ ఉపఎన్నిక ఫలితం బిహార్ రాజకీయాల్లో సరికొత్త మార్పునకు సంకేతమని ఆయన పేర్కొన్నారు. రాజ్యసభకు ఎన్నికైన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్.. బంకీపూర్ ఎమ్మెల్యేగా రాజీనామా చేశారు. దీంతో ఆ నియోజకవర్గానికి ఉప ఎన్నిక నిర్వహించారు. బీజేపీ కంచుకోటగా పేరున్న ఈ నియోజకవర్గంలో.. 1995 నుంచి బీజేపీ అభ్యర్థులే విజయం సాధిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రశాంత్ కిశోర్ అసాధారణ విజయం సాధించడం, బీజేపీ కంచుకోటలో జేఎస్‌పీ జెండా ఎగురవేయడం యావత్ దేశం దృష్టిని ఆకర్షించింది. ప్రశాంత్ విజయంతో.. జేఎస్పీ శ్రేణులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నాయి.

# మరింత పటిష్టంగా మీ సేవ కేంద్రాలు

మొదటిపేజీ తరువాయి..

నేతృత్వంలోని ప్రతినిధుల బృందంతో ప్రధాన కార్యదర్శి సమావేశమయ్యారు. సమావేశంలో డిజిటల్ ఇండియా వికసిత్ భారత్?2047 లక్ష్యాల సాధనలో భాగంగా రాష్ట్రంలో మీ సేవ కేంద్రాల ఆధునీకరణ, భారత్ ఫ్యూచర్ సిటీలో కొత్త డేటా సెంటర్ల ఏర్పాటు కోసం మౌలిక సదుపాయాల కల్పన, కృత్రిమ మేధస్సు, సైబర్ భద్రత, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, యువతకు ఐటీ ఆధారిత ఉపాధి అవకాశాల విస్తరణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ గవర్నెన్స్ రంగంలో అమలు చేస్తున్న సంస్కరణలను ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు అభినందించారు. రాష్ట్రంలో డిజిటల్ సామర్థ్యాల పెంపు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాల వినియోగం, ప్రజా సేవల నాణ్యత మెరుగుదల, డేటా గవర్నెన్స్ వంటి రంగాల్లో ప్రపంచ బ్యాంక్ అందించగల సాంకేతిక సహకారం, జ్ఞాన భాగస్వామ్యం, అంతర్జాతీయ ఉత్తమ విధానాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. దేశంలో డిజిటల్ రంగంలో పెట్టుబడులకు హర్యానా, తెలంగాణ రాష్ట్రాలు అనుకూలంగా ఉన్నాయని పేర్కొన్న ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు, సుమారు రూ.2,000 కోట్ల పెట్టుబడుల కోసం సమగ్ర ప్రాజెక్టు నివేదికలు సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. అనంతరం టి–÷బైర్ ప్రాజెక్టు పురోగతిపై ప్రధాన కార్యదర్శి ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో



బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ విస్తరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, సేవల విస్తరణ తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. టి–ఫైబర్ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు నాణ్యమైన డిజిటల్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల మధ్య సమన్వయంతో ప్రాజెక్టు అమలులో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించి, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దూరిశెట్టి, ప్రపంచ బ్యాంక్ డిజిటల్?ఆసియా పసిఫిక్ ప్రాంతీయ డైరెక్టర్ మహేష్ ఉత్తమ్‌చందానీ, టి–ఫైబర్ ఎం.డి., సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు ఆధునిక సాంకేతిక

మొదటిపేజీ తరువాయి..

కొత్త ముసాయిదాను విడుదల చేసింది. ఈ సాంకేతికత ద్వారా వాహనాలు ఒకదానితో ఒకటి సమాచారం పంచుకుంటాయి. రోడ్డుపై ఎదురుగా ప్రమాదం, అకస్మాత్తుగా బ్రేక్ వేయడం, వాహనం వేగం తగ్గడం వంటి పరిస్థితులపై ముందుగానే హెచ్చరికలు అందుతాయి. దీంతో డ్రైవర్లు అప్రమత్తమై ప్రమాదాలను నివారించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం కొన్ని వాహనాల్లో ఉన్న అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్ కెమెరాలు, సెన్సార్ల ఆధారంగా పనిచేస్తుంది. అయితే కొత్తగా తీసుకురానున్న సీ–వీ2ఎక్స్ సాంకేతికత వాహనాలు, రోడ్డు మౌలిక సదుపాయాలు, ఇతర వాహనాలతో నేరుగా కమ్యూనికేట్ చేసేలా రూపొందించనుంది. దీంతో డ్రైవర్‌కు కనిపించని ప్రమాదాలను కూడా ముందుగానే గుర్తించి హెచ్చరికలు అందించే అవకాశం ఉంటుంది. ఈ సాంకేతికత కోసం 5.875 ఉఊళి నుంచి 5.925 ఉఊళి వరకు ఫ్రీక్వెన్సీ బ్యాండ్‌ను లైసెన్స్ రహితంగా కేటాయించాలని కేంద్రం ప్రతిపాదించింది. దీనివల్ల వాహనాల మధ్య వేగవంతమైన సమాచార మార్పిడి సాధ్యమవుతుంది. ఈ కొత్త వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం 2027 అక్టోబర్ నుంచి దశలవారీగా అమల్లోకి తీసుకురానుంది.

## పశ్చిమాసియా ఉద్రిక్తతలు తగ్గడంతో సానుకూలత


మొదటిపేజీ తరువాయి..

మరోసారి దిగొచ్చాయి. విదేశీ మదుపర్ల పెట్టుబడులు కలిసొచ్చాయి. దాంతో సూచీలు వరుసగా నాలుగో సెషన్‌లోనూ లాభాల్లో ముగిశాయి. మదుపర్ల సంపద ఒక్క సెషన్‌లోనే రూ.5 లక్షల కోట్ల మేర పెరిగింది. సోమవారం ఉదయం సెన్సెక్స్ 78,883.34 పాయింట్ల వద్ద క్రితం ముగింపు 78,094.64 లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 78,895.10 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి సెన్సెక్స్ 544.39 పాయింట్లు లాభపడి 78,639.03 వద్ద ముగిసింది. నిఫ్టీ 390.70 పాయింట్లు పెరిగి 24,774.30 వద్ద స్థిరపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.31 వద్ద ఉంది. సెన్సెక్స్ 30లో ఇండిగో, టీసీఎస్, ఇన్ఫోసిస్, ఎటర్నల్, ఐటీసీ, యాక్సిస్ బ్యాంక్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. సన్‌ఫార్మా, భారతీ ఎయిర్‌టెల్, మారుతీ, టాటాస్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్ షేర్లు నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 83.83 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,054.64 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## ఈయేడు కుంభవృష్టి వర్షాలు తప్పవు

మొదటిపేజీ తరువాయి..

నాకు ఆగ్రహం తెప్పిస్తుందని అన్నారు. వావివరసలు లేకుండా ఘోరాలు జరుగుతున్నాయని.. అలాంటి వారిని వదిలిపెట్టనని అన్నారు. వారిని పాదాల కింద నలిపేస్తానని అన్నారు. ఈ ఏడాది ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాతంగి భవిష్యవాణిలో చెప్పారు.ఈ ఏడాది కుంభవర్షాలు ఉన్నాయని తెలిపారు. అగ్నిప్రమాదాలు కూడా పొంచి ఉన్నాయని చెప్పారు. ఈ ఏడాది ప్రాణనష్టం భారీగా జరుగుతుందని అన్నారు. కాబట్టి జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కొంతమంది కళ్లు నెత్తికెక్కి ప్రవర్తిస్తున్నారని మాతంగి స్వర్ణలత ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి ప్రవర్తన తనకు సంతోషం కలిగించడం లేదని తెలిపారు. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర చివరి ఘట్టానికి చేరుకుంది. ఈ ఉత్సవాల్లో భాగంగా రంగం భవిష్యవాణిని మాతంగి స్వర్ణలత వినిపించారు. తాను సంతోషంగా లేనని.. క్రోధంతో వచ్చానని భవిష్యవాణిలో చెప్పారు. ఈ ఏడాది కుంభవృష్టి ఉంది. వర్షాల్లో ప్రజలు కొట్టుకుపోయే పరిస్థితి ఉంది. రంగం భవిష్యవాణితో ఈ బోనాల జాతర ముగియనుంది. ఈ నేపథ్యంలో భక్తులు భారీ సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. రంగం అనంతరం అమ్మవారిని అంబారీపై ఊరేగించనున్నారు. ఉజ్జయిని మహంకాళి ఆలయంలో అధికారుల నిర్లక్ష్యంపై జోగిని శ్యామల ఆగ్రహం వ్యక్తం చేశారు. అవసరం వచ్చినప్పుడే జోగినిలను



ప్రభుత్వం గుర్తు చేసుకుంటుందని ధ్వజమెత్తారు. బోనాల సందర్భంగా జోగినిలకు కనీస ఏర్పాట్లు కూడా ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఆలయ సిబ్బంది జోగినిలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసుల అత్యుత్సాహం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని జోగిని శ్యామల ఆగ్రహించారు. ఉదయం నుంచే గేట్ల వద్ద పోలీసులు జోగినిలను ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. సంప్రదాయాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా జోగినిలను అవమానించారని దుయ్యబట్టారు. ఆలయ కమిటీ జోగినిలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసులు కనీసం జోగినిలని అని కూడా చూడకుండా బయటకు ఎందుకు నెట్టేశారని ప్రశ్నించారు. జోగినిలకు గౌరవం, ప్రత్యేక ఏర్పాట్లు కల్పించాలని ప్రభుత్వాన్ని జోగిని శ్యామల కోరారు. ఈ క్రమంలో ఉజ్జయిని మహంకాళి ఆలయం ముందు జోగినిలు సోమవారం ధర్నా చేపట్టారు. ఆదివారం బోనాల వేడుకల్లో జోగినిలను అవమానపరిచారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే జోగిని శ్యామలను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులకు జోగినిలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. బ్యారికేడ్లు తొలగించుకుని మహంకాళి ఆలయంలోకి జోగినిలు ప్రవేశించారు. మహంకాళి ఆలయం ముందు జోగినిల ఆందోళనతో ఆలస్యంగా రంగం కార్యక్రమం ప్రారంభమైంది. జోగినిల ఆందోళనతో అమ్మవారి ఆలయం ముందు గందరగోళ వాతావరణం నెలకొంది. జోగినిలను చర్చలకు పిలిచి మంత్రి పొన్నం ప్రభాకర్, ఎండోమెంట్ ఉన్నతాధికారులు మాట్లాడారు. ఆందోళనను విరమించాలని జోగినిలను మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

## ఆదివాసి యువకులపై దాడి చేసిన అటవీ అధికారులపై చర్యలు తీసుకోవాలి

**– పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు**
**– ఆదివాసి సంఘ నాయకుల డిమాండ్**



**జన్నారం, ఆగస్ట్ 3 (ప్రజాజ్యోతి) :** ఆదివాసి యువకులు పై దాడి చేసిన అటవీ అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలంటూ పలువురు ఆదివాసి సంఘ నాయకులు కోరారు. జన్నారం మండలం ఇందనపల్లి గ్రామంలో చేపలు పట్టడానికి వెల్లిన ఆదివాసి యువకులపై అటవీ అధికారులు దాడి చేసి బంధించారని ఆరోపిస్తూ ఆదివాసి సంఘ నాయకులు సోమవారం జన్నారం పోలీస్ స్టేషన్ ముందు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం ఇందన్‌పల్లి రేంజ్ పరిధిలోని చెరువులో చేపలు పట్టేందుకు వెల్లిన ఆరుగురు యువకులపై ఎఫ్ఆర్ఓ లక్ష్మీనారాయణ కర్రతో దాడి చేసి బంధించారని ఆరోపించారు. ఆదివాసీలకు అడవిపై సర్వహక్కులు ఉన్నప్పటికీ ప్రభుత్వ కట్టుబాట్లకు లోబడి జీవిస్తున్నామని, అలాంటి వారిపై ఇలా దాడులు చేయడం తగదని మండిపడ్డారు. ఎఫ్ఆర్ఓ లక్ష్మీనారాయణను సర్వీస్ నుంచి తొలగించాలని, డిఆర్ఓ విజయ్ కుమార్ పై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేరకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎస్ఐ ఉదయ్ కిరణ్ కు ఫిర్యాదు అందజేసి దాడి చేసిన అటవీ అధికారులపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయక్‌పోడ్ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంజి రాజన్న, కార్యదర్శి తట్ర భీమ్రావు, యువజన సంఘం జిల్లా అధ్యక్షులు తట్ర అర్జున్, తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి జైక శేఖర్, తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోయం జంగు, పివిటీజీ ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు కుడిమెత తిరుపతి, రాష్ట్ర నాయకులు కొమ్ముల బాపు, తదితర 9 తెగల ఆదివాసి సంఘ నాయకులు పాల్గొన్నారు.

## మొక్కల పెంపకమే పర్యావరణ పరిరక్షణకు శాశ్వత పరిష్కారం

**– ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు**




**మంచిర్యాల, 3 ఆగస్టు (ప్రజాజ్యోతి) :** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, మొక్కలను నాటి వాటిని సంరక్షించడం ద్వారానే భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించగలమని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. మంచిర్యాల నియోజకవర్గంలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 52వ డివిజన్ రాముని చెరువు వద్ద మున్సిపల్ కమిషనర్ అన్వేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పచ్చదనం పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి, దానిని చెట్టుగా పెంచాలని పిలుపునిచ్చారు. చెట్ల వల్ల వర్షపాతం పెరగడంతో పాటు కాలుష్యం తగ్గి ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణం లభిస్తుందన్నారు. వన మహోత్సవం వంటి కార్యక్రమాలు సమాజంలో పర్యావరణంపై అవగాహన పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, పచ్చదనం పెంపు ప్రతి పౌరుడి బాధ్యత అని, ప్రభుత్వ శాఖలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు సమన్వయంతో మొక్కల సంరక్షణకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య--మహేష్, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, కార్పొరేటర్ తూముల నరేష్, కార్పొరేటర్లు, మహిళా సంఘాల సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 450 బెడ్ల ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలి

**– ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి**
**– బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్**




**మంచిర్యాల, 3 ఆగస్టు (ప్రజాజ్యోతి) :** 450 బెడ్ల ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని, ప్రజలకు అందుబాటు లోకి తీసుకురావాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ డిమాండ్ చేశారు . మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరై నిర్మాణంలో ఉన్న 450 బెడ్ల ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌ను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆనాటి ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు ప్రత్యేక చొరవతో మంచిర్యాల జిల్లా కేంద్రానికి సుమారు రూ.500 కోట్ల వ్యయంతో మెడికల్ కాలేజీతో పాటు 450 బెడ్ల ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ మంజూరైందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మాణ పనులు వేగంగా సాగాయని, గత అసెంబ్లీ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మంచిర్యాల ఎమ్మెల్యేగా ప్రేమ్ సాగర్ రావు ఎన్నికైన తర్వాత హాస్పిటల్ నిర్మాణం పూర్తిగా మందగించిందని ఆరోపించారు. హాస్పిటల్ నిర్మాణం పూర్తయితే దివాకర్ రావుకు ప్రజల్లో మంచి పేరు వస్తుందనే ఉద్దేశంతోనే పనులను ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తున్నారని, కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకొచ్చి నిర్మాణాన్ని పూర్తి చేయకుండా చేస్తున్నారని విజిత్ కుమార్ ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మెడికల్ కాలేజీ, హాస్పిటల్ నిర్మాణ పనులు వేగంగా సాగేందుకు అక్కడే కార్మికులు నివసించేలా షెడ్లు ఏర్పాటు చేశారని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ షెడ్లలో ఉన్న కార్మికులను ఖాళీ చేయించడం వల్ల నిర్మాణ పనులు మరింత ఆలస్యమయ్యాయని అన్నారు. అదేవిధంగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పూర్తయిన మెడికల్ కాలేజీని ఎలాంటి ఆర్భాటం లేకుండా ప్రారంభించారని తెలిపారు. ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుకు దివాకర్ రావు లేదా తనపై రాజకీయ విభేదాలు ఉంటే రాజకీయంగా ఎదుర్కోవాలని, కానీ ప్రజలకు అవసరమైన హాస్పిటల్ నిర్మాణాన్ని నిలిపివేసి పేద ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. మంచిర్యాల ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని 450 బెడ్ల ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, టీబీజీకేఎస్ నాయకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# బాసరలో కార్డన్ సెర్చ్

**– 70 ద్విచక్ర వాహనాలు, ఆరు ఆటోలు, ఒక లారీ స్వాధీనం – ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్పీ సూచన**






**బాసర, ఆగస్టు 3 (ప్రజాజ్యోతి) :** ప్రజల భద్రత కోసమే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని భైంసా ఏఎస్పీ సాయికిరణ్ తెలిపారు. సోమవారం బాసరలోని ఆర్టీసీ బస్టాండ్ సమీప ప్రాంతంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు ఇంటింటికీ వెళ్లి తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు లేని 70 ద్విచక్ర వాహనాలు, ఆరు ఆటోలు, ఒక లారీతో పాటు నంబర్ ప్లేట్ లేని నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏఎస్పీ సాయికిరణ్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ముధోల్, బాసర సీఐలు రవీందర్ నాయక్, దీపక్, ఎస్సైలు బిట్ల పెర్సీస్, ప్రదీప్, జుబేర్, సర్పంచ్ వెంకటేష్ గౌడ్, పోలీసు సిబ్బంది, హోం గార్డులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరిస్తూ ఉండాలి

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**




**నిర్మల్ జిల్లా ప్రతినిధి, అగస్టు 3, (ప్రజాజ్యోతి) :** ప్రజావాణి దరఖాస్తులను తమవెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తు లను కలెక్టర్‌కు సమర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఉద్యోగులందరూ తప్పనిసరిగా ప్రతి రోజూ ముఖ గుర్తింపు హాజరు నమోదు చేయాలని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులంతా తప్పనిసరిగా ప్రభుత్వ విద్యాసంస్థలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ ఉండా లని చెప్పారు. తనిఖీ వివరాల నివేదికలు సంబంధిత యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఈ ప్రజా వాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి.వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

## నిర్మల్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

**– పోలీస్ స్టేషన్ రికార్డులు, కేసుల పురోగతి, సిబ్బంది పనితీరుపై సమీక్ష**
**– ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన పోలీసింగ్ అందించాలని అధికారులకు ఆదేశం**




**నిర్మల్ జిల్లా ప్రతినిధి, అగస్టు 3, (ప్రజాజ్యోతి) :** నిర్మల్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను సోమవారం జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, రిసెప్షన్, రికార్డు రూమ్‌తో పాటు స్టేషన్ నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం స్టేషన్‌లో నిర్వహిస్తున్న వివిధ రికార్డులు, రిజిస్టర్లను తనిఖీ చేసి, నమోదైన కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదుల పరిష్కార తీరును సమీక్షించారు.

పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, దర్యాప్తును నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యలను ఓపికగా విని చట్టపరంగా తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్మల్ పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, నేరాల నివారణకు పెట్రోలింగ్‌ను మరింత పటిష్టం చేయాలని తెలిపారు. మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణ, నేరాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజలకు పోలీసులపై మరింత నమ్మకం పెరిగేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజా మిత్ర పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, నిర్మల్ టౌన్ సీఐ సమ్మయ్య, ఎస్ఐలు మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజావాణి కార్యక్రమం

**– ప్రజావాణి ద్వారా ప్రజా సమస్యలకు పారదర్శకంగా, సత్వర పరిష్కారం**
**– జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల**



**నిర్మల్ జిల్లా ప్రతినిధి, అగస్టు 3, (ప్రజాజ్యోతి) :** నిర్మల్ జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వయంగా స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుదారులు తెలిపిన సమస్యలను క్షుణ్ణంగా విన్న జిల్లా ఎస్పీ, వారి సమక్షంలోనే సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని ఆదేశించారు. ప్రతి సమస్యను చట్టపరంగా పరిశీలించి బాధితులకు అందాల్సిన సహాయం, న్యాయం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతు ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయడంతో పాటు వారి సమస్యలకు సత్వర పరిష్కారం చూపడమే ప్రజావాణి కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి వినతులు, ఫిర్యాదులను ఓపికగా విని స్వీకరించాలని సూచించారు. అవసరమైన సందర్భాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి, చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు.

ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదును నమోదు చేసి, వాటి పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించడం జరుగుతుందని తెలిపారు. సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేయడంతో పాటు, ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను నిరంతరం పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీసు శాఖ దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. సమస్యల పరిష్కారంలో అనవసర జాప్యం లేకుండా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. బాధితులకు సత్వర న్యాయం అందించడంతో పాటు ప్రజలకు పోలీసు శాఖపై భరోసా, నమ్మకం మరింత పెరిగేలా పారదర్శకంగా, బాధ్యతాయుతంగా సేవలందించడమే తమ ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్ పేర్కొన్నారు.

## చేపల వేటకు వెళ్లిన ఆదివాసీలపై అటవీ అధికారుల దాడి

**– అదుపులో ఉన్న తమవారిని విడిచిపెట్టాలని భారీ రాస్తారోకో – 24 గంటల్లో అధికారిపై చర్యలు తీసుకోవాలి.ఎమ్మెల్యే బొజ్జు పటేల్**





**జన్నారం, ఆగస్టు 3 (ప్రజాజ్యోతి) :** జన్నారం డివిజన్ ఇంధనపెల్లి రేంజ్ లోని అటవి ప్రాంతంలోకి ఆదివారం చేపల వేటకు వెళ్లిన నాయకపు గూడ కు చెందిన ఆరుగురు ఆదివాసీలపై అటవీ శాఖ అధికారులు దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. అందులో నుండి ఒక్కరు తప్పించుకొని వచ్చి గూడపు వాసులకు తెలియజేయడంతో ఆదివాసీలంతా కలిసి అటవీ శాఖ కార్యాలయంలో కుర్చీలు విరగొట్టి, రికార్డులను చిందరవందర చేశారు. అనంతరం అడవి శాఖ అధికారుల అదుపులో ఉన్న తమ ఆదివాసీలను విడిచి పెట్టాలని కోరుతూ రాత్రి 8 గంటల నుండి 11:30 గంటల వరకు దాదాపు మూడు గంటల పైగా భారీ రాస్తారోకా నిర్వహించడంతో ఇరువైపులా వాహనాలు స్తంభించి రాకపోకలు నిలిచిపోయాయి. అటవీ శాఖ అధికారుల అదుపులో ఉన్న తమ ఆదివాసీలని వెంటనే విడిచి పెట్టాలని, వారిపై చేయి చేసుకున్న రేంజ్ అధికారి లక్ష్మీనారాయణ వెంటనే సస్పెండ్ చేయాలని నినాదాలు చేస్తూ బైఠాయించారు. ఈ విషయం తెలుసుకున్న మంచిర్యాల జిల్లా ఏసీపీ ప్రకాష్, లక్షెట్టిపేట సిఐ రమణమూర్తి, జన్నారం, దండేపల్లి ఎస్.ఐలు ఉదయ్ కిరణ్, రాజా వర్ధన్‌లు సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్, ఉట్నూర్ ఐటిడిఎ పీవో మందా మకరందం, జిసిసి ఛైర్మెన్ కొత్నాక తిరుపతిలు అక్కడికి చేరుకొని వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఐటీడీఏ పీవో మందా మకరందం ఎమ్మెల్యే బొజ్జు పటేల్ లు డిఎఫ్ఓ మరియు ఎఫ్డిపిటి తో ఫోన్లో మాట్లాడారు. ఎమ్మెల్యే బొజ్జు పటేల్ మాట్లాడుతూ చేపల వేటకు వెళ్లిన ఆదివాసీలపై దాడి చేసిన రేంజ్ అధికారి లక్ష్మీనారాయణ ను వెంటనే సస్పెండ్ చేయాలని వారి అదుపులో ఉన్న ఐదుగురుని వెంటనే విడిచి పెట్టాలని కోరగా అదుపులో ఉన్న ఐదుగురిని వెంటనే విడిచిపెడతామని, ఘటనపై విచారణ జరిపి 24 గంటల్లో ఎఫ్ఆర్వో పై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అటవీశాఖ అధికారుల అదుపులో ఉన్న ఐదుగురిని అటవీశాఖ వారు విడిచిపెట్టడంతో వారు అక్కడికి చేరుకొని ఎమ్మెల్యే కి వివరించారు. ఎమ్మెల్యే బొజ్జు పటేల్ మాట్లాడుతూ అడవి శాఖ అధికారులు ఆగడాలు రోజురోజుకు మరింత పెరుగుతున్నయని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, సిసి రోడ్ల నిర్మాణం కోసం ఇసుక తీసుక వస్తే అక్రమంగా వారిపై జరిమానాలు విధించడం కాకుండా కేసులు నమోదు చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. వాగుల నుండి, గోదావరి నుండి ఇసుక తీసుకురాకపోతే ఇళ్ల నిర్మాణం ఎలా చేపడుతారని సిసి రోడ్ల నిర్మాణం ఎలా పూర్తవుతాయని ప్రశ్నించారు. 24 గంటల్లో ఆ అధికారిపై చర్యలు తీసుకుంటామని అటవీ శాఖ ఉన్నత అధికారులు హామీ ఇచ్చారని, నాయకపు గూడపు వాసులకు ఎమ్మెల్యే తెలియజేయడంతో వారు రాస్తారోకో విరమింపజేశారు.

## ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలి

**– డిజిటలైజేషన్ ప్రక్రియ మొత్తాన్ని పారదర్శకంగా పూర్తి చేయాలి**
**– రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి**



**నిర్మల్ జిల్లా ప్రతినిధి, అగస్టు 3, (ప్రజాజ్యోతి) :** రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారముల డిజిటలైజేషన్ ప్రక్రియపై అన్ని జిల్లాల కలెక్టర్లతో హైదరాబాదు నుంచి సోమవారం సాయంత్రం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలన్నారు. డిజిటలైజేషన్ ప్రక్రియ మొత్తాన్ని పారదర్శకంగా పూర్తి చేయాలన్నారు. ఎటువంటి తప్పులు దొర్లకుండా డిజిటలైజేషన్ చేపట్టాలన్నారు. ఎస్ఐఆర్ డిజిటలైజేషన్, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ (హేతుబద్ధీకరణ) ప్రక్రియలపై జిల్లాల వారిగా సమీక్షించారు. ఒకే కుటుంబానికి చెందిన కుటుంబ సభ్యులు వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో ఓటు ఉంటే, వారిని ఒకే పోలింగ్ కేంద్రం కిందకు వచ్చేలా రేషనలైజేషన్ (హేతుబద్ధీకరణ) ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని అన్నారు. ఒక కుటుంబానికి చెందిన ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరం నుంచి ఈ వీసీలో కలెక్టర్ భవేశ్ మిశ్రా, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## గో సంరక్షణ ఉద్యమానికి మద్దతుగా ఢిల్లీకి తెలంగాణ ప్రతినిధుల పయనం



**మందమర్రి, ఆగస్టు 03 (ప్రజాజ్యోతి) :** గో సంరక్షణ, గోవధ నిర్మూలనకు చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా కొనసాగుతున్న 'జై గోమాత--గో సమ్మాన్ ఆహ్వాన్ అభియాన్' ఉద్యమంలో భాగంగా ఈ నెల 5, 6 తేదీల్లో ఢిల్లీలో నిర్వహించే భారతదేశ సమ్మేళనానికి తెలంగాణ రాష్ట్రం నుంచి శ్రీ కామాఖ్య దేవాలయ ప్రతినిధులు హాజరవుతున్నట్లు మంథని సతీష్ భవాని తెలిపారు. సోమవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో జరుగుతున్న గోవధ, కబేళాల నిర్మూలన, గోవును జాతీయ ప్రాణిగా గుర్తించడం వంటి అంశాలను ఢిల్లీలో జరిగే సమ్మేళనంలో కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. రాష్ట్ర ప్రజల తరఫున గో సంరక్షణకు సంబంధించిన డిమాండ్లను జాతీయ వేదికపై వినిపించనున్నట్లు పేర్కొన్నారు. గత నెల 27న మంచిర్యాల జిల్లా కలెక్టర్ ద్వారా రాష్ట్రపతి, ప్రధానమంత్రి, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రికి 90 వేల సంతకాలతో కూడిన వినతిపత్రాలను పంపించినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా 40 కోట్ల సంతకాల సేకరణ లక్ష్యంగా ఉద్యమం కొనసాగుతుండగా, తొలి దశలో 22 కోట్ల సంతకాలు సమర్పించామని, రెండో దశలో అక్టోబర్ 27 వరకు తెలంగాణ వ్యాప్తంగా సంతకాల సేకరణ చేపడతామని వెల్లడించారు. గో సంరక్షణ ఉద్యమానికి రాష్ట్ర ప్రజలు, యువత, దేవాలయ కమిటీలు సహకరించాలని మంథని సతీష్ భవాని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో గో సంరక్షణ సేన సభ్యులు రాజా శాక్తేయ, మనోజ్ శర్మ, సోమన్న, బోరిగం ముఖేష్, డోలే సురేష్, సబ్బని లక్ష్మీనారాయణ, డోలే హరికృష్ణ, కుమ్మరి ప్రతాప్, గంగాధరి రాజకుమార్ పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణ బాధితులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలి

**బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్**





**మంచిర్యాల, 3, ఆగస్టు (ప్రజాజ్యోతి) :** చెన్నూరు పట్టణ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో చెన్నూరు పట్టణంలోని పాత బస్టాండ్ నుండి రావిచెట్టు వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ, నూతన రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ తదితర అభివృద్ధి పనులను బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ, చెన్నూరు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి నియోజకవర్గంలో అందుబాటులో ఉన్నప్పటికీ ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. రోడ్డు విస్తరణ పేరుతో అనేక మంది చిన్న వ్యాపారుల దుకాణాలను తొలగించినప్పటికీ, ఇప్పటివరకు వారికి ఎలాంటి నష్టపరిహారం అందించలేదని పేర్కొన్నారు. దీంతో అనేక కుటుంబాలు జీవనోపాధిని కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు కూడా ఆశించిన వేగంతో సాగకపోవడంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ చెన్నూరు అభివృద్ధిపై తగిన దృష్టి సారించడం లేదని విమర్శించారు. రోడ్డు విస్తరణ కారణంగా నష్టపోయిన బాధితులకు వెంటనే తగిన నష్టపరిహారం చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రైనేజీ పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చెన్నూరు పట్టణ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ప్రజల సమస్య లను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు, బీజేపీ సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు మరియు పలువురు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలకు ప్రాధాన్యం

## సీఎం ప్రజావాణి ఫిర్యాదులూ సత్వరమే పరిష్కరించాలి
## అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

వనపర్తి, ఆగస్టు 3 (ప్రజాజ్యోతి): జిల్లా ప్రజావాణితో పాటు సీఎం ప్రజావాణి నుంచి వచ్చే అర్జీలను అత్యంత ప్రాధాన్యంతో పరిష్కరించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించి, ఆ



వివరాలను ఫిర్యాదుదారులకు తెలియజేయడంతో పాటు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్‌తో కలిసి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ, తమ శాఖ పరిధిలోకి రాని అర్జీలను సంబంధిత శాఖలకు వెంటనే పంపించాలని, పరిష్కరించలేని అంశాలపై కారణాలను స్పష్టంగా తెలియజేయాలని అన్నారు. ఏ దరఖాస్తునూ పెండింగ్‌లో ఉంచకుండా సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లా ప్రజావాణితో పాటు సీఎం, జిల్లా మంత్రి కార్యాలయాల నుంచి వచ్చే ప్రజావాణి దరఖాస్తులను కూడా ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా ప్రజావాణిలో మొత్తం 50 దరఖాస్తులు, ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 2 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో యాదయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎన్. తిరుపతయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలే పోలీసుల తొలి ప్రాధాన్యం

## సమస్యలపై ఫిర్యాదు చేస్తే.. వేగంగా పరిష్కారం
## ప్రజావాణిలో 22 ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ సునితారెడ్డి

వనపర్తి, ఆగస్టు 3 (ప్రజాజ్యోతి): ప్రజల సమస్యలను నేరుగా విని, చట్టబద్ధంగా వేగవంతంగా పరిష్కరించడం పోలీసు శాఖ ప్రధాన బాధ్యత అని జిల్లా ఎస్పీ సునితారెడ్డి తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే




ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి మొత్తం 22 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమం ప్రజలకు తమ సమస్యలను నిర్భయంగా వినిపించే విశ్వసనీయ వేదికగా మారిందన్నారు. ప్రతి ఫిర్యాదును సున్నితంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని చట్టబద్ధంగా, వేగవంతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. బాధితులకు న్యాయం జరిగేలా పోలీసు శాఖ అంకితభావంతో పనిచేస్తోందన్నారు. ప్రజలు పోలీసు శాఖపై విశ్వాసం ఉంచి ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజావాణిలో 15 భూ తగాదాలు, 5 పరస్పర గొడవలు,2 భార్యాభర్తల వివాదాలు సంబంధించిన ఫిర్యాదులు అందాయని తెలిపారు.

# వీధి కుక్కల దాడులపై మున్సిపల్ అధికారులకు బిజెపి నేతలు వినతి పత్రం

## వీధి కుక్కల సమస్యను పరిష్కరించకపోతే నిరసనలు చేపడతాం: బిజెపి

మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, ఆగస్టు 03 (ప్రజా జ్యోతి): మఖ్తల్ పట్టణంలో రోజురోజుకు తీవ్రమవుతున్న వీధి కుక్కల దాడులపై బిజెపి మఖ్తల్ శాఖ సభ్యులు సంబంధిత మున్సిపల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మానసతో పాటు అధికారులకు వినతి పత్రం అందజేశారు. సోమవారం నారాయణపేట జిల్లా మఖ్తల్ మున్సిపాలిటీలో గత వారం రోజుల నుండి తరచూ ఇప్పటివరకు పదిమందికి పైగా వీధి కుక్కల





దాడికి గురయ్యారని, అట్టి వీడియోలు, ఫొటోస్ సోషల్ మీడియా పరంగా వైరల్ అవుతున్న పలు పత్రికలలో కుక్కల దాడి పై వార్తలు వచ్చినా కూడా ఇప్పటివరకు వీధి కుక్కల సమస్యను పరిష్కరించేందుకు అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. గత నెల 29వ తేదీన పదిమందికి పైగా ప్రజలు వీధి కుక్కల దాడికి గురయ్యారు. వారిలో కొందరు నారాయణపేట జిల్లా ఆసుపత్రిలో, మరికొందరు మహబూబ్‌నగర్ ఆసుపత్రిలో, ఒకరు రాయచూర్ ఆసుపత్రిలో చికిత్స పొందగా,మరికొందరు స్థానికంగా చికిత్స చేయించుకుని ఇంటికి వెళ్లారు. ఈ ఘటన జరిగిన రోజే మున్సిపల్ కమిషనర్ కు ఫోన్ ద్వారా సమాచారం అందించగా, కౌన్సిల్ సమావేశంలో ఈ అంశాన్ని చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. మరుసటి రోజు ప్రత్యక్షంగా కలిసి విద్యార్థులపై కూడా వీధి కుక్కలు దాడి చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించి, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్నారు. ప్రతిరోజూ ప్రజలు, మహిళలు, చిన్నారులు, విద్యార్థులు వీధి కుక్కల బారిన పడుతున్నారని, కౌన్సిల్ సమావేశం పేరుతో సమస్యను వాయిదా వేయడం వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఉదయం పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లనున్న నేపథ్యంలో ఎలాంటి ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు.
వీలైనంత త్వరగా వీధి కుక్కలను సురక్షిత ప్రదేశాలకు తరలించి, వాటికి అవసరమైన వైద్య చికిత్స అందించి, ప్రజలకు భరోసా కల్పించేలా తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో ప్రజల తరపున బీజేపీ మఖ్తల్ శాఖ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రాజశేఖర్ రెడ్డి, పీకే నరసింహ,టప్ప కృష్ణ,బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బి.భరత్, బ్యాటరీ రాజు, కే.నరేందర్,మహేష్ సాగర్,శ్రీకాంత్, మంజునాథ్,ఆంజనేయులు,నవీన్,జావిద్, అశోక్, గోవిందు,భీమేష్,పాపిరెడ్డి పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో నిర్లక్ష్యం సహించం

## - శ్రీరంగాపురం పాఠశాలల్లో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆకస్మిక తనిఖీ
## - తాగునీరు, మరుగుదొడ్లు, ఫ్యాన్లు, మధ్యాహ్న భోజనంపై అసంతృప్తి.. అధికారులకు వార్నింగ్

వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 3 (ప్రజాజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, మౌలిక వసతుల విషయంలో



ఎలాంటి నిర్లక్ష్యాన్నీ సహించబోమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హెచ్చరించారు. సోమవారం శ్రీరంగాపురం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులను పరిశీలించిన ఎమ్మెల్యే విద్యార్థులతో నేరుగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సౌకర్యం లేకపోవడం, మరుగుదొడ్లు అధ్వాన్నంగా ఉండడం, తరగతి గదుల్లో ఫ్యాన్లు పనిచేయకపోవడం, ఇతర మౌలిక వసతుల లోపాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే వంటగది పరిశుభ్రత, కూరగాయల నాణ్యత, వంట సామగ్రిని తనిఖీ చేసి, ప్రతి విద్యార్థికి పరిశుభ్రమైన, నాణ్యమైన, పోషకాహార భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. పాఠశాల ఆవరణలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్న సమాచారం అందిందని పేర్కొంటూ, విద్యాలయ



ప్రాంగణం విద్యా కేంద్రంగా ఉండాలని, ఇటువంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తుతో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీలో మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు ప్రమోదిని రెడ్డి, ఉపాధ్యక్షుడు విజయవర్ధన్ రెడ్డి, సర్పంచ్ మద్దిలేటి, కాంగ్రెస్ నాయకులు శ్రీహరి రాజు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం నిధులు మంజూరు

## మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రి వాకిటి శ్రీహరికి కృతజ్ఞతలు
## నారాయణపేట జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షులు ఏ. కాంత్ కుమార్

మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, ఆగస్టు 03 (ప్రజా జ్యోతి): సోమవారం రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణలో మత్స్యకారుల సంక్షేమం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమే లక్ష్యంగా ఉచిత చేప పిల్లలు మరియు రొయ్య పిల్లల పంపిణీ పథకానికి రూ.116 కోట్లను మంజూరు చేసింది. దీంతో తెలంగాణ రాష్ట్రంలో ఉన్న మత్స్యకారుల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వంతో చర్చలు జరిపి చేపల పంపిణీకి నిధులు మంజూరు చేసిన మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరికి నారాయణపేట జిల్లా మత్స్యకారుల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షులు ఏ.కాంత కుమార్ ముదిరాజ్ ఓ పత్రిక ప్రకటనలో అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న లక్షలాదిమంది మత్స్యకారుల సమస్యలను వారి జీవన ఉపాధి అవసరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి సహకారంతో మత్స్యకారుల అభివృద్ధి కోసం ఉచిత చేప పిల్లల,రొయ్య పిల్లల పంపిణీ కోసం 2026-2027 ఏడాదికి




గాను రూ.116 కోట్లు మంజూరు చేయించడంలో రాష్ట్ర పశుసంవర్ధక మత్స్య క్రీడల యువజన శాఖ మంత్రి వాకిటి కీలకంగా కృషి చేశారని ఆయన అన్నారు. ఉచిత చేప పిల్లల రొయ్యల పంపిణీకై విడుదల చేసినటువంటి నిదులతో నారాయణపేట జిల్లాలోని జలాశయాలు, చెరువులకు ఉచిత చేప పిల్లల పంపిణీతో చేపల ఉత్పత్తి పెరగడంతో వేలాదిమంది మత్స్యకారులకు స్థిరమైన ఉపాధితో పాటు ఆదాయం కలుగుతుందన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి కృషితో ప్రజా ప్రభుత్వం తమ సంక్షేమానికి కృషి చేస్తున్నందుకు సంతోషిస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న మత్స్యకారులకు శుభవార్త అందించాలన్న ఉద్దేశంతో మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవ తీసుకొని రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించడంతో ఈరోజు మత్స్యకారుల అభివృద్ధి కోసం రూ.116 కోట్లు మంజూరు చేసినటువంటి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క తో పాటు మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరికి నారాయణపేట జిల్లా మత్స్య సహకార సంఘం,మత్స్యకారుల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామని జిల్లా అధ్యక్షులు కాంత్ కుమార్ అన్నారు.

# ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో ఉంచొద్దు:జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల ఆగస్టు 3(ప్రజా జ్యోతి ప్రతినిధి): ప్రజావాణికి వచ్చే అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించా




లని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు.ముఖ్యంగా రెవెన్యూ సంబంధిత దరఖాస్తులను మండల స్థాయిలోనే పరిష్కరించి ప్రజలు జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్,నర్సింగరావు,ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి,రాజ్ కుమార్‌లతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు.ఈ సందర్భంగా మొత్తం 70 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు.గత కొద్ది వారాలతో పోలిస్తే ప్రజావాణి అర్జీల పరిష్కారంలో పురోగతి కనిపిస్తున్నప్పటికీ,ఇంకా పూర్తిస్థాయిలో పరిష్కారం సాధించాల్సిన అవసరం ఉందన్నారు.జిల్లా ప్రజావాణితో పాటు సీఎం ప్రజావాణికి వచ్చే అర్జీలను కూడా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా భూ సంబంధిత సమస్యలపై వచ్చే ఫిర్యాదులను ఆయా మండలాల రెవెన్యూ అధికారులు స్థానికంగానే




పరిష్కరిస్తే ప్రజలు జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం ఉండదన్నారు. గతంలో ఇచ్చిన ఫిర్యాదులు పరిష్కారం కాకపోవడంతో అదే సమస్యలపై పలువురు మళ్లీ ప్రజావాణికి వస్తున్నారని,ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు.ప్రతి బుధవారం శాఖల వారీగా అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి,తమ శాఖలకు సంబంధించిన ప్రజావాణి అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఓటర్ల డిజిటలైజేషన్‌ను నాణ్యతతో పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల ఆగస్టు 3(ప్రజా జ్యోతి ప్రతినిధి): స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)లో



భాగంగా ఓటర్ల వివరాల డిజిటలైజేషన్‌ను పూర్తి ఖచ్చితత్వంతో చేపట్టి, తప్పులు లేని పారదర్శక ఓటరు జాబితాను రూపొందించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు.సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుంచి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,బీఎల్‌వో యాప్‌లో ప్రతి ఓటరు వివరాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని సూచించారు.యాప్‌లో నమోదైన వివరాలే ముసాయిదా ఓటరు జాబితాలో ప్రతిబింబిస్తాయని,ప్రతి నమోదును సూపర్‌వైజర్లు క్షుణ్ణంగా పరిశీలించి లోపాలు ఉంటే




వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు.2002 ఓటరు జాబితాతో మ్యాపింగ్ కాని ఓటర్ల వివరాలను ధృవీకరించి,మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.ప్రతి ఓటరికి సంబంధించిన ఫొటోను జాగ్రత్తగా పరిశీలించి ఫొటో మిస్‌మ్యాచ్‌లు లేకుండా నమోదు చేయాలని తెలిపారు.అలాగే గైర్హాజరు,వలస వెళ్లిన, మృతి చెందిన ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా ధృవీకరించాలని ఆదేశించారు.బీఎల్‌వో,ఈఆర్‌వో స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశాల వివరాలను పోర్టల్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని సూచించారు.ఓటర్ల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ చేపట్టాలని,ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్ నుంచి మండలాల తహసీల్దార్లు, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్,ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా,నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు.జిల్లాలో డిజిటలైజేషన్‌ను నిర్దేశిత గడువులోగా 100 శాతం పూర్తి చేయాలని,బీఎల్‌వో యాప్‌లో ప్రతి ఓటరు వివరాలు,ఫొటోలను ఖచ్చితత్వంతో నమోదు చేయాలని సూచించారు.2002 ఓటరు జాబితాతో మ్యాపింగ్ కాని వివరాలు, గైర్హాజరు,వలస వెళ్లిన,మృతి చెందిన ఓటర్ల వివరాలను పూర్తిస్థాయిలో ధృవీకరించాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్,ఆర్డీవో శ్రీనివాసరావు,ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి,రాజ్ కుమార్,ఎన్నికల విభాగం అధికారి మంజుల, వివిధ మండలాల తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రిజర్వాయర్లు నింపడం కాదు రైతులకు నీరు అందించాలి

## రైతులకు సాగునీరు విడుదల చేయడంలో అధికారుల నిర్లక్ష్యం
## తక్షణమే రైతులకు సాగునీరు విడుదల చేయాలి
## బిజెపి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు వెంకట్రాములు డిమాండ్

మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, ఆగస్టు 03 (ప్రజా జ్యోతి): మఖ్తల్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల చెరువులు, కుంటలతో పాటు రైతులకు సాగునీరు అందే కాలువలకు సంగంబండ రిజర్వాయర్ నుంచి తక్షణమే నీటిని విడుదల చేసి రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా చూడాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు వెంకట్రాములు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మన ప్రాంతంలో ఇప్పటికే వర్షాలు లేక




ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న సందర్భంలో ఎగువ కర్ణాటక మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణానదిలో వరద తిరగడంతో అట్టి కృష్ణానది నుంచి భూత్పూర్,సంగంబండ రిజర్వాయర్లకు నీటిని పంపించేస్తున్న రైతులకు ప్రయోజనం లేకపోతుందన్నారు. కావున సంబంధిత అధికారులు తక్షణమే భూత్పూర్,సంగంబండ రిజర్వాయర్ల నుండి మఖ్తల్ మండలంతో పాటు రుద్రసముద్రం, గోలపల్లి,కాట్రేవుపల్లి,దండు,మంథన్‌గోడ్, మగనూరు,నర్వ మండలాల చెరువులకు కాలువల ద్వారా విడుదల చేయాలని కోరారు. ప్రస్తుతం కృష్ణానదిలో నీటి ప్రవాహం సమృద్ధిగా ఉన్నప్పటికీ, రిజర్వాయర్ల నుంచి చెరువులకు నీటిని విడుదల చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కృష్ణా నదిలో నీరు ఉన్నప్పుడే నీటిని ఒడిసిపట్టి నియోజకవర్గంలోని అన్ని చెరువులు, కుంటలను పిల్ల కాలువల ద్వారా నింపి రైతులకు సాగునీరు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోకపోతే మఖ్తల్ లో భారీ రైతు ధర్నా నిర్వహించాల్సి వస్తుందని వెంకట్రాములు హెచ్చరించారు.

# విబి-జి రామ్ జి ఉద్యోగులకు చిన్నారెడ్డి భరోసా

## పే స్కేల్‌పై సీఎం దృష్టికి.. సమస్యల పరిష్కారానికి హామీ

వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 3 (ప్రజాజ్యోతి): విక్షిత్ భారత్-రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) గ్యారంటీ (విబి-జి రామ్ జి) ఉద్యోగుల పెండింగ్ సమస్యలను ప్రజా ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరిస్తుందని తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి తెలిపారు. సోమవారం వనపర్తిలో జిల్లాలోని



అన్ని మండలాలకు చెందిన విబి-జి రామ్ జి ఉద్యోగులు తమ సమస్యలపై ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చిన్నారెడ్డి రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ దివ్యతో పాటు సీఎంఓ అధికారి శ్రీధర్‌తో ఫోన్‌లో మాట్లాడి ఉద్యోగుల సమస్యలను వివరించారు. పెండింగ్ వేతనాల తక్షణ విడుదల, క్యాడర్ స్ట్రెంత్ ఖరారు, పదోన్నతులు, బదిలీలు, కెరీర్ అడ్వాన్స్‌మెంట్ పాలసీ వంటి అంశాల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని అధికారులు తెలిపినట్లు ఆయన వెల్లడించారు. ఒక్క పే స్కేల్ అమలు అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చిన్నారెడ్డి హామీ ఇచ్చారు. రూరల్ డెవలప్‌మెంట్‌లో ఐకేపీ, విబి-జి రామ్ జి ఉద్యోగులు రెండు కళ్లలాగా పనిచేస్తున్నారని, ఐకేపీ ఉద్యోగులకు పే స్కేల్ అమలు చేసి వీరికి ఇవ్వకపోవడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఉద్యోగుల డిమాండ్ల సాధనకు తన పూర్తి మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా జేఏసీ కన్వీనర్ బాలయ్య, కో-కన్వీనర్ కోళ్ల సత్తన్న, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, ఉద్యోగులు భాస్కర్, రామస్వామి, ముఖీద్‌తో పాటు జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన ఏపీఓలు, ఈసీఎస్‌లు, టీఏలు, బీఎఫ్‌టీలూ, సీఓలు పాల్గొన్నారు.

# ప్రజల ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవాలి: జిల్లా ఎస్పీ జానకి

## ప్రజావాణిలో వినతులు స్వీకరించి అధికారులకు ఆదేశాలు

మహబూబ్‌నగర్, ఆగస్టు 3 ( ప్రజా జ్యోతి బ్యూరో ): ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులపై వెంటనే స్పందించి చట్టబద్ధంగా పరిష్కరించాలని జిల్లా ఎస్పీ దరావత్ జానకి సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎస్పీ ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించి వారి సమస్యలను శ్రద్ధగా ఆలకించారు. అనంతరం సంబంధిత పోలీస్



స్టేషన్ సీఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి ఫిర్యాదులపై వెంటనే విచారణ చేపట్టి చట్టప్రకారం త్వరితగతిన పరిష్కరించేలా ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలు ఎలాంటి పైరవీలు లేదా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని సూచించారు. ప్రతి ఫిర్యాదును నిష్పాక్షికంగా పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా పోలీసు శాఖ కట్టుబడి ఉందని తెలిపారు. ప్రజలకు మరింత చేరువగా ఉండి శాంతిభద్రతలను పరిరక్షించడం పోలీసుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్న ఆమె, ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని సంబంధిత అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరిస్తున్నామని చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు శాఖ ప్రజలకు సత్వర, పారదర్శక, నాణ్యమైన సేవలు అందించేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తుందని జిల్లా ఎస్పీ జానకి తెలిపారు.

## రాష్ట్రీయ హిందూ పరిషత్ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా నాంపెల్లి రవీందర్ నియామకం

**- హిందూ సమాజ సేవకు అంకితభావంతో పనిచేస్తా- నాంపెల్లి రవీందర్**



**వరంగల్ సిటీ, ఆగస్టు 3(ప్రజాజ్యోతి) :** రాష్ట్రీయ హిందూ పరిషత్ (ఆర్‌హెచ్‌పీ) వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా నాంపెల్లి రవీందర్ ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నాంపెల్లి రవీందర్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన రాష్ట్రీయ హిందూ పరిషత్ రాష్ట్ర నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ సిద్ధాంతాలకు అనుగుణంగా సనాతన ధర్మ పరిరక్షణ, హిందూ సమాజ ఐక్యత, సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణకు పూర్తి అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. జిల్లాలో హిందూ సమాజాన్ని సంఘటితం చేయడంతో పాటు యువత, మహిళలు, మేధావులు, ధార్మిక, సామాజిక సంస్థలతో సమన్వయం సాధిస్తూ సంస్థ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. హిందూ ధర్మంపై అవగాహన కల్పించే కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తానని చెప్పారు. రాష్ట్ర నాయకత్వం తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ సంస్థ అభివృద్ధికి, సమాజ సేవకు నిరంతరం శ్రమిస్తానని రవీందర్ స్పష్టం చేశారు.


## తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం




**ఆత్మకూరు, ఆగస్టు 03 (ప్రజాజ్యోతి) :** తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని నీరుకుళ్ళ సర్పంచ్ తడక నీరజ, కటాక్షపూర్ సర్పంచ్ ఎండి షబానా, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ రంజిత్ అన్నారు. సోమవారం ఆత్మకూరు మండలం నీరుకుళ్ళ, కటాక్షపూర్, తిరుమలగిరి గ్రామాల్లో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచులు, రంజిత్, మాట్లాడుతూ అప్పుడే పుట్టిన శిశువుకు ఆరునెలల వరకు కచ్చితంగా తల్లపాలు పట్టించాలని అన్నారు. అంగన్వాడి కేంద్రాల్లో గర్భిణీలకు, బాలింతలకు, పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సూచించారు. అంగన్వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తిరుపతి, పంచాయతీ కార్యదర్శి సాయిప్రియ, అంగన్వాడీ టీచర్లు షమీమా, పద్మ, మణెమ్మ, బుజ్జమ్మ, అరుణ, రమాదేవి, అనిత, తదితరులు పాల్గొన్నారు.

## అయ్యా పీవో గారు.. ఆదివాసీల గోడు ఆలకించరా?

- ఆర్వోఎఫ్ఆర్ పట్టాలపై పంట రుణాలకు బ్యాంకు నిరాకరణ
- రుణాల మంజూరులో శీతకన్ను.. ఐటీడీఏ పీవోకు గిరిజన రైతుల వినతి



**కన్నాయిగూడెం, ఆగస్టు 3 ప్రజాజ్యోతి :** దేవుడు వరమిచ్చినా పూజారి కనికరించలేదన్న చందంగా కన్నాయిగూడెం మండలంలోని గిరిజన రైతుల పరిస్థితి మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆర్ఓఎఫ్ఆర్ (అడవి హక్కుల గుర్తింపు చట్టం) కింద మంజూరు చేసిన పట్టాల ఆధారంగా గత ఏడాది పంజాబ్ నేషనల్ బ్యాంక్ నుంచి పంట రుణాలు తీసుకున్న గిరిజన రైతులు, పంట కోత అనంతరం తీసుకున్న రుణాలను అణా పైసలతో సహా పూర్తిగా చెల్లించారు. అయితే ఈ ఏడాది మళ్లీ పంట రుణాల కోసం అదే బ్యాంకును ఆశ్రయించగా, ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలపై రుణాలు మంజూరు చేయడం సాధ్యం కాదని బ్యాంకు అధికారులు స్పష్టం చేయడంతో రైతులు తీవ్ర నిరాశకు గురయ్యారు. గతంలో అదే పట్టాలపై రుణాలు మంజూరు చేసిన అధికారులు ఇప్పుడు నిరాకరించడం వెనుక కారణమేంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. రుణాలను సకాలంలో చెల్లించడమే తమ తప్పా అని గిరిజన రైతులు వాపోతున్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైన ఈ సమయంలో రుణాలు లేక పంట సాగు ఎలా చేయాలంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఎటునాగారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సమగ్ర విచారణ జరిపి, గిరిజన రైతులకు న్యాయం చేయాలని కోరుతూ రైతులు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కొప్పుల రవి, గుండ్ల పాపారావు, మోకాళ్ల వెంకటేష్, పొదెం శోభన్, ప్రశాంత్ తదితర గిరిజన రైతులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు సర్పంచ్ తక్షణ సాయం



**పర్వతగిరి, ఆగస్టు 03 (ప్రజాజ్యోతి) :** మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన వరికుప్పల రజిత (భర్త: దయాకర్) అనారోగ్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఏఎన్ఎం సంపూర్ణ గ్రామ సర్పంచ్ తక్కలపల్లి శ్రీనివాస్‌కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన సర్పంచ్ తక్కలపల్లి శ్రీనివాస్ అత్యవసర అంబులెన్స్ ద్వారా బాధితురాలిని స్వయంగా దగ్గరుండి చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. సమయానికి స్పందించి అవసరమైన వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకున్న సర్పంచ్‌ను గ్రామస్థులు అభినందించారు.

# పర్వతగిరి పోలీస్ స్టేషన్‌లో ఏమి జరుగుతోంది?

- ఫిర్యాదులు ఇచ్చి నెలలు గడుస్తున్నా చర్యలు లేవని బాధితుల ఆరోపణలు
- పై అధికారులకు వరుస వినతులు, జాప్యంపై సమగ్ర విచారణ కోరుతున్న ప్రజలు



**పర్వతగిరి, ఆగస్టు 03 (ప్రజా జ్యోతి) :** ప్రజలకు న్యాయం చేయాల్సిన పోలీస్ స్టేషన్ గడప తొక్కిన బాధితులే ఇప్పుడు అదే స్టేషన్ చుట్టూ నెలల తరబడి తిరుగుతున్నారని వరంగల్ జిల్లా పర్వతగిరి ప్రాంతంలో తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఫిర్యాదు ఇచ్చిన తర్వాత చట్టపరమైన ప్రక్రియ వేగంగా సాగుతుందని ఆశించిన బాధితులకు, పదేపదే స్టేషన్‌కు రావాలని చెప్పడం తప్ప స్పష్టమైన పురోగతి కనిపించడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదు నమోదు చేసిన రోజు నుంచి ప్రారంభమయ్యే నిరీక్షణ రోజులతో ముగియడం లేదని, వారాలు, నెలలు గడిచినా కేసు నమోదు లేదా తదుపరి చర్యలపై స్పష్టత లేదని పలువురు వాపోతున్నారు. కొందరి కథనం ప్రకారం, ఇరు పక్షాల వాంగ్మూలాలు తీసుకున్న తర్వాత కూడా ఫైళ్లు ముందుకు కదలడం లేదని, నిర్ణయాలు నిరవధికంగా వాయిదా పడుతున్నాయని చెబుతున్నారు. దీంతో బాధితులు ఒక ప్రశ్నను బహిరంగంగానే అడుగుతున్నారు చట్టం అందరికీ ఒకటే అయితే, ఒకే తరహా ఫిర్యాదుల్లో కొన్నింటిపై వెంటనే చర్యలు తీసుకుని, మరికొన్నింటిని నెలల తరబడి ఎందుకు పెండింగ్‌లో ఉంచుతున్నారు? స్థానిక స్థాయిలో స్పందన రాకపోవడంతో చాలామంది సీఐ, ఏసీపీ, వరంగల్ సీపీ కార్యాల యాలను ఆశ్రయిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, అక్కడ ఫిర్యాదు చేసిన తర్వాత కూడా పరిస్థితిలో పెద్దగా మార్పు కనిపించడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. పై అధికా రుల ఆదేశాల తర్వాత కూడా చర్యలు ఆలస్యం అవుతున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలో ప్రజల్లో అనుమానాలు మరింత పెరుగుతున్నాయి. ఎవరి మాట వింటేనే కేసు నమోదు అవుతుంది?, సాధారణ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుకు విలువ లేదా?, న్యాయం కోసం బాధితుడే ఎందుకు పదేపదే అధికారుల వెంట తిరగాలి? వంటి ప్రశ్నలు స్థానికంగా చర్చనీయాంశమ య్యాయి. పోలీస్ స్టేషన్ అనేది బాధితుడికి చివరి ఆశ్రయం. అలాంటి చోట ఫిర్యాదు ఇచ్చిన వ్యక్తే పదేపదే తన ఫిర్యాదును గుర్తు చేయాల్సిన పరిస్థితి ఏర్పడితే, అది ప్రజల్లో పోలీసు వ్యవస్థపై విశ్వాసాన్ని దెబ్బతీసే అంశమని న్యాయవాదులు, ప్రజాసంఘాల ప్రతినిధులు అభిప్రాయపడుతున్నారు. పర్వతగిరి పోలీస్ స్టేషన్‌లో పెండింగ్ ఫిర్యాదుల సంఖ్య ఎంత? వాటిలో ఎన్ని ప్రాథమిక విచారణలో ఉన్నాయి? ఎన్ని కేసులుగా నమోదయ్యాయి? జాప్యానికి కారణాలేమిటి? అనే అంశాలపై ఉన్నతాధికారులు సమగ్ర సమీక్ష నిర్వహించి, వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.

## బీజేపీ వరంగల్ జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శిగా కర్నె రవీందర్

**- ఘనంగా సన్మానించిన ఎర్రబెల్లి ప్రదీప్ రావు**




**వరంగల్ సిటీ, ఆగస్టు 3(ప్రజాజ్యోతి):** భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శిగా కర్నె రవీందర్‌ను నియమించిన సందర్భంగా సోమవారం బీజేపీ రాష్ట్ర నాయకులు, అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు క్యాంపు కార్యాలయంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి ప్రదీప్‌రావు రవీందర్‌కు పూలగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కర్నె రవీందర్ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి వరంగల్ జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీ, రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు, జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలను, అన్ని కులాలను సమన్వయం చేసుకుంటూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. పార్టీ బలోపేతంతో పాటు ప్రజాసేవను లక్ష్యంగా చేసుకుని పూర్తి స్థాయిలో కృషి చేస్తానని పేర్కొన్నారు. తనకు ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి మరోసారి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు బైరి నాగరాజు, కరీమాబాద్ మండల అధ్యక్షుడు బోరిగం నాగరాజు, దేశాయిపేట మండల అధ్యక్షుడు ఇప్ప సుధాకర్, ఖిలా వరంగల్ మండల ప్రధాన కార్యదర్శి కర్నె వాసుదేవ్, జిల్లా నాయకుడు శేర్ల అనిల్‌కుమార్, కార్యకర్తలు సాంబరాజు గోపి, రాజు, శివతో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వర్ధన్నపేట గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్



- 25 మంది విద్యార్థినులు అస్వస్థత
- విద్యార్థులను పరామర్శించిన ఎమ్మెల్యే నాగరాజు



**వర్ధన్నపేట, ఆగస్టు 3,ప్రజా జ్యోతి :** వరంగల్ జిల్లా, వర్ధన్నపేట మండల కేంద్రంలోని ఎస్టీ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారం తినడంతో సోమవారం 25 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, వికారం వంటి లక్షణాలతో బాధపడిన విద్యార్థినులను వెంటనే వర్ధన్నపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. వైద్యుల పర్యవేక్షణలో విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. సంఘటన విషయం తెలుసుకున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ఆస్పత్రికి చేరుకుని చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, విద్యార్థినులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, పూర్తిగా కోలుకునే వరకు



నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆస్పత్రి వైద్యాధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థినులు అస్వస్థతకు గురికావడం బాధాకరమన్నారు. కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులతో మాట్లాడి ఘటనకు గల కారణాలను గుర్తించి, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. త్వరలో హాస్టల్‌ను సందర్శించి అక్కడి వసతులను పరిశీలించి అవసరమైన చర్యలు చేపడతామని చెప్పారు. వైద్యుల సమాచారం ప్రకారం విద్యార్థినులందరూ కోలుకుంటున్నారని, ఎవరికీ ప్రాణాపాయం లేదని ఎమ్మెల్యే తెలిపారు. విద్యార్థినుల తల్లిదండ్రులతో కూడా మాట్లాడి వారికి ధైర్యం చెప్పినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట వరంగల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ ఆయుబ్, మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, సొసైటీ చైర్మన్ రాజేష్ ఖన్నా, మండల అధ్యక్షుడు పోశాల వెంకన్న, పట్టణ అధ్యక్షుడు ఈగ దామోదర్, మాజీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి నాయకులు, కౌన్సిలర్లు, సర్పంచులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పిట్టలగూడెంలో రేషన్ బియ్యం పంపిణీ ప్రారంభం గ్రామ ప్రజల ఆనందం



**రఘునాథపల్లి, ఆగస్టు 3 (ప్రజాజ్యోతి) :** రఘునాథపల్లి మండలం: పిట్టలగూడెం గ్రామ ప్రజలు ఇంతకాలంగా రేషన్ బియ్యం కోసం సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న బాంజీపేట గ్రామానికి వెళ్లాల్సి వచ్చేది. దీంతో ప్రతి నెలా రేషన్ బియ్యం తీసుకురావడంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను పిట్టలగూడెం సర్పంచ్ గైని శ్రీనివాస్, గ్రామ పాలకవర్గ సభ్యులతో కలిసి ఎమ్మార్వో మరియు ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. సమస్యపై అధికారులు వెంటనే సానుకూలంగా స్పందించి, పిట్టలగూడెంలోనే రేషన్ బియ్యం పంపిణీ నిర్వహించేందుకు అనుమతి మంజూరు చేశారు. దీంతో ఈరోజు పిట్టలగూడెం గ్రామంలో అధికారికంగా రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గైని శ్రీనివాస్, ఉపసర్పంచ్ బొట్ల శ్రీనివాస్, వార్డు సభ్యురాలు పగిడిపల్లి ఇంద్ర, కొంతం మహేందర్, గోపాల్, గ్రామ పాలన అధికారి రవీందర్, రేషన్ డీలర్ శివరాత్రి రామచంద్రం, అలాగే గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామ ప్రజల చిరకాల సమస్యను పరిష్కరించి, పిట్టలగూడెంలోనే రేషన్ పంపిణీకి అనుమతి కల్పించిన ఎమ్మార్వో మరియు ఆర్డీవోలకు గ్రామస్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## జర్నలిస్టుల భవన నిధుల 'స్వాహా'..?సంగెం ప్రెస్ క్లబ్ పై తిరుగుబాటు..!

**సంగెం,ఆగస్టు03(ప్రజాజ్యోతి) :** సంగెం మండల కేంద్రంలో జర్నలిస్టుల భవన నిర్మాణం కోసం గత బీఆరెస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధుల లెక్కలను వెంటనే బహిర్గతం చేయాలని, ఏళ్ల తరబడి నిర్మాణం ఎందుకు పూర్తికాలేదో సమాధానం చెప్పాలని మండల పాత్రికేయులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో సీనియర్ పాత్రికేయులు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గతంలో జర్నలిస్టుల భవన నిర్మాణం కోసం ప్రభుత్వం రూ. 5 లక్షల నిధులను మంజూరు చేసిందని, అలాగే పలువురు ప్రజాప్రతి నిధులు, అధికారులు కూడా విరాళాలు అందించారని గుర్తుచేశారు. నిధులు మంజూరై ఇన్ని రోజులవుతున్నా నేటికీ భవన నిర్మాణం అసంపూర్తిగానే ఉండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ఇప్పటివరకు వచ్చిన నిధులెన్ని, చేసిన ఖర్చు ఎంత అనే అంశాలపై సమగ్రమైన లెక్కలు చెప్పాలని స్పష్టం చేశారు.

**ఏకపక్ష కమిటీని తిరస్కరిస్తున్నాం :**

గత 15 ఏళ్లుగా పాత్రికేయ వృత్తిలో ఉంటూ, జిల్లా స్థాయిలో ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేసిన సీనియర్ విలేకరులను పూర్తిగా పక్కనపెట్టి, నలుగురైదుగురు కలిసికట్టుగా ఏకపక్షంగా ప్రెస్ క్లబ్ కమిటీని ప్రకటించుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. మండలంలో ఎక్కడా లేని విధంగా రాత్రికి రాత్రే కమిటీలను వేసుకోవడం చెల్లదని, దీనికి ఎలాంటి గుర్తింపు ఉండదని హెచ్చరించారు.

ప్రెస్ క్లబ్ అనేది అందరి జర్నలిస్టుల ఉమ్మడి వేదిక అని, కొద్దిమంది స్వప్రయోజనాల కోసం దీనిని వాడుకోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా గతంలో వచ్చిన నిధుల లెక్కలను విలేకరులందరి ముందూ ఉంచి పారదర్శకత నిరూపించుకోవాలని, సీనియర్లతో సహా అందరినీ కలుపుకొని ప్రజాస్వామ్య పద్ధతిలో నూతన కమిటీని ఎన్నుకోవాలని డిమాండ్ చేశారు. లెక్కలు తేల్చకుండా వేసుకున్న అనధికారిక కమిటీని తాము గుర్తించేది లేదని తేల్చి చెప్పారు.

- ఐదేళ్లయినా పూర్తికాని భవనం.. ప్రజాప్రతినిధుల విరాళాల నిధులు ఎవరి జేబుల్లోకి వెళ్లాయి..?
- పారదర్శకత లేకుండా కొద్దిమంది ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటే తీవ్ర పరిణామాలు తప్పవు..!
- నలుగురైదుగురు కలిసి నిర్ణయాలు తీసుకుంటే చెల్లవు..సంగెంలో ప్రెస్ మీట్ పెట్టి హెచ్చరించిన సీనియర్ పాత్రికేయులు



ఈ ప్రెస్ మీట్‌లో సంగెం మండల పాత్రికేయులు, మచ్చిక వెంకటేశేశ్వర్లు(ఆంధ్రప్రభ), గాయపు రాజిరెడ్డి(నవ తెలంగాణ), వేల్పుల అనిల్ యాదవ్(ప్రజాజ్యోతి), సధిరం కుమారస్వామి(తరంగాలు), మచ్చిక విరస్వామీ(సూర్య), బాషిపాక రాములు(మనం ప్రజలు), సిద్ద నాగరాజు(నిఘా), మండ వేణు(ప్రజాపక్షం), మందపురి బలరాం(తెలంగాణ గళం), హరి(ఎబి న్యూస్), ఏలీయా(ప్రభంజనపదం),పాల్గొన్నారు

## నెక్కొండలో పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహ ఏర్పాటుకు వినతి

**సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్‌కు బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం సమర్పణ**



**నెక్కొండ, ఆగస్టు 03 (ప్రజా జ్యోతి) :** ఇటీవల అకాల మరణం చెందిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని నెక్కొండ పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసేందుకు అనుమతి మంజూరు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు స్థానిక సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి పెద్ది సుదర్శన్ రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సంగని సూరయ్య, మండల ప్రధాన కార్యదర్శి తాటిపల్లి శివకుమార్, నాయకులు కారింగుల సురేష్ గౌడ్, దాసరి శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ దేవానబోయిన వీరభద్రం, ఈదునూరి వెంకన్న, మాతంగి రాజు, సిరిపోతుల సురేష్, వద్దే మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



**పర్వతగిరి, ఆగస్టు 03 (ప్రజాజ్యోతి) :** పర్వతగిరి మండలంలోని చింతనెక్కొండ గ్రామానికి చెందిన లాక ఆగమ్మ వైద్య చికిత్స కోసం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం మంజూరైంది. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఆగమ్మ కుమారులు లాక రామస్వామి, వెంకన్నలకు కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు ఇస్లావత్ సావిత్రి, గ్రామ సర్పంచ్ గాడుదుల రమేష్ యాదవ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి శ్రీనివాస్, నాయకురాలు సుల్తానా, పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**జనగామ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 03 (ప్రజాజ్యోతి) :** జిల్లాలో వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. సోమవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్‌షాలోంతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను అధికారులు త్వరగా పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. పెండింగ్ లో గల ఆర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఈ ప్రజావాణిలో మొత్తం 326 దరఖాస్తులను కలెక్టర్ స్వీకరించారు. ఈ ప్రజావాణిలో డీఆర్డీఓ భాస్కర్, గృహ నిర్మాణ శాఖ పీడీ మాతృ నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బుద్ధ పూలమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించిన వెంకటేశ్వర యూత్ సభ్యులు



**రాయపర్తి ఆగస్టు 3 ప్రజా జ్యోతి :** వరంగల్ జిల్లా రాయపట్నం మండలం వెంకటేశ్వర పల్లి గ్రామానికి చెందిన బుద్ధ.పూలమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబాన్ని సోమవారం పరామర్శించి, 50 కేజీల బియ్యం, 2లీ,, ఆయిల్ క్యాన్ అందించిన వెంకటేశ్వర పల్లి యూత్ అసోసియేషన్ సభ్యులు. ఈ కార్యక్రమం యూత్ అసోసియేషన్ సభ్యులు, కుటుంబ సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## తల్లి పాల వారోత్సవాల్లో పాల్గొన్న కౌన్సిలర్ తాహెర

భువనగిరి,ఆగస్ట్ 3(ప్రజాజ్యోతి): భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని,8వ వార్డు లో,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రం లో నిర్వహించిన తల్లి పాల వారోత్సవాల్లో పాల్గొన్న వార్డు కౌన్సిలర్




శేక్ తాహేర బబ్లు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,తల్లి పాలు బిడ్డ కు ఆరోగ్యాన్ని ఇస్తుందని క్రమం తప్పకుండ తల్లి పాలను బిడ్డకు అందించాలని అన్నారు.అదే విధంగా అంగన్వాడీ లో గుడ్లు పాలు సక్రమంగా వస్తున్నాయా లేదా అని పరిశీలించి క్రమం తప్పకుండ బాలింతలకు గుడ్లు పాలు ఇతర పదార్థాలు అందించాలని కోరారు. కార్యక్రమం లో ఏ డబ్ల్యూ టీ నాగమణి,ఏ,ఎన్,ఎం హేమలత ఆశ వర్కర్ ఇందిరా మరియు బాలింతలు తల్లులు పాల్గొన్నారు.

## నల్లగొండలో క్లాసిక్ సెలూన్ అండ్ బ్యూటీ పార్లర్ ప్రారంభం..

**ఆధునిక సేవలతో వినియోగదారులకు మెరుగైన అనుభవం అందించాలి..**

**నల్లగొండలో క్లాసిక్ సెలూన్ అండ్ బ్యూటీ పార్లర్..**

**నూతన వ్యాపార సంస్థలే పట్టణలకు అభివృద్ధి..**

**మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి**

నల్లగొండ టౌన్ ఆగస్టు 3, (ప్రజా జ్యోతి ) : నల్లగొండ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన క్లాసిక్ సెలూన్ అండ్ బ్యూటీ పార్లర్ ను నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి సోమవారం ఘనంగా ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన అనంతరం వారు సెలూన్‌లోని ఆధునిక



సౌకర్యాలను పరిశీలించి నిర్వాహకులను అభినందించారు.ఈ సందర్భంగా మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, యువత స్వయం ఉపాధి దిశగా అడుగులు వేస్తూ ఆధునిక వ్యాపార సంస్థలను ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందిస్తూ వ్యాపారాన్ని విజయవంతంగా అభివృద్ధి చేసుకోవాలని ఆకాంక్షించారు. ఇలాంటి నూతన వ్యాపార సంస్థలు స్థానికంగా ఉపాధి అవకాశాలను పెంపొందించడంతో పాటు పట్టణ అభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గుమ్ముల మోహన్ రెడ్డి, 35వ డివిజన్ కార్పొరేటర్ ఇటికాల మంగమ్మ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కత్తుల కోటి, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమ వీరుడు పెద్ది సుదర్శన్ రెడ్డికి ఘన నివాళి

**పెద్ది అకాల మరణం బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటు: తాటికొండ సీతయ్య**

తుంగతుర్తి, ఆగస్టు 3,(ప్రజా జ్యోతి): తెలంగాణ ఉద్యమ వీరుడు, నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి అకాల మరణం బీఆర్ఎస్ పార్టీకి, తెలంగాణ ఉద్యమానికి తీరని లోటని బీఆర్ఎస్ మండల



అధ్యక్షులు, మాజీ ఎంపీపీ తాటికొండ సీతయ్య అన్నారు. తుంగతుర్తి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తాటికొండ సీతయ్య మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పెద్ది సుదర్శన్ రెడ్డి చేసిన ఉద్యమ పోరాటం, ప్రజాసేవ చిరస్మరణీయమని అన్నారు. ఆయన ఆశయాలు, ఉద్యమ స్ఫూర్తిని భావితరాలకు చాటి చెప్పడం ప్రతి కార్యకర్త బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గుండగాని రాములు గౌడ్, దొంగరి శ్రీనివాస్, కొత్తగూడెం సర్పంచ్ మేడుదుల రమేష్, గానుగబండ సర్పంచ్ వెంకటమ్మ కరుణాకర్, వెంకటేష్, వెంకన్న, సాయికిరణ్, ప్రవీణ్ తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆగస్టు 5న వర్కింగ్ జర్నలిస్టుల సమావేశం

నాంపల్లి,ఆగస్టు,03(ప్రజా జ్యోతి): మునుగోడు నియోజకవర్గంలో వివిధ మండలాల నుండి వర్కింగ్ జర్నలిస్టులుగా విధులు నిర్వహిస్తున్న ప్రింట్ మీడియా మరియు ఎలక్ట్రానిక్ మీడియాకు ఆగస్టు 5న మండలంలోని తుంగపాటి గౌరారం చలీదోన శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో



వర్కింగ్ జర్నలిస్టుల సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గాలెంక గురుపాదం పేర్కొన్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర మీడియా అకాడమీ మాజీ చైర్మన్ రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ, తెలంగాణ రాష్ట్ర టీయూడబ్ల్యూజే -143 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీ సాగర్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే -143, రాష్ట్ర కోశాధికారి పి యోగానంద,టియుడబ్ల్యూజే -143, ఐజేయు జాతీయ కార్యవర్గ సభ్యులు అవ్వారి భాస్కర్, నల్లగొండ జిల్లా టియుడబ్ల్యూజే -143 అధ్యక్షులు గుండెలోని జయశంకర్ గౌడ్,టి యు డబ్ల్యూ జే-143 నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరస్వామి,జిల్లా ప్రధాన కార్యదర్శి శివ ప్రసాద్ సమావేశానికి హాజరవుతున్నారు. నల్లగొండ జిల్లా టియుడబ్ల్యూజే -143 ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, మునుగోడు నియోజకవర్గం టి యు డబ్ల్యూ జే -143 అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, మన నల్లగొండ జిల్లా పరిధిలోని ఆరు నియోజకవర్గాలకు చెందిన యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు, సమావేశానికి హాజరు కానున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ఉపాధ్యక్షులు కామిశెట్టి యాదయ్య, మండల అధ్యక్షులు గడ్డం వెంకటేశ్వర్లు ఉన్నారు.

## న్యాయవాది మల్లయ్య హత్యను ఖండిస్తూ మిర్యాలగూడ లో లాయర్ల ఆందోళన

మిర్యాలగూడ,ఆగస్టు 03,(ప్రజాజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లాలో ఆర్‌ఎంపీ వైద్యుడిగా, న్యాయవాదిగా సేవలందిస్తున్న అడ్వకేట్ మల్లయ్య ని అత్యంత దారుణంగా హత్య చేసిన ఘటనను ఖండిస్తూమిర్యాలగూడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ ఘటనకు నిరసనగా అధ్యక్షుడు గౌరు వెంకటేశ్వర్లు అధ్యక్షతన సోమవారం బార్ అసోసియేషన్ హాల్‌లో అత్యవసర జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న న్యాయవాదులు మల్లయ్య హత్యను తీవ్రంగా ఖండిస్తూ, నిందితులను వెంటనే అరెస్టు చేసి చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.న్యాయవాదుల భద్రతకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని,రాష్ట్రం లోని న్యాయవాదులం దరికీ సమగ్ర రక్షణ కల్పించేలా ప్రత్యేక భద్రతా చర్యలు అమలు చేయాలని సమావేశంలో తీర్మానించారు. మల్లయ్య హత్యకు బాధ్యులైననిందితులకు తగిన శిక్ష పడే వరకు, అలాగే న్యాయవాదుల భద్రతకు స్పష్టమైన హామీ లభించే వరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టే ఆందోళనకార్యక్రమాలకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు.ఈ సందర్భంగామిర్యాలగూడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయ వాదులు తమవిధులను



పూర్తిగా బహిష్కరించి, పట్టణంలో రాస్తా రోకో నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. న్యాయ వాదుల ప్రాణ రక్షణ విషయంలోప్రభుత్వాలు, సంబంధిత యంత్రాంగం నిర్లక్ష్య వైఖరినిఅవలం బించడం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఈసరం కరుణాకర్,ప్రధాన కార్యదర్శి జంగిలి ఎల్లయ్య, సంయుక్త కార్యదర్శి రాయారపు భాస్కర్, కోశాధికారి రెడ్డిపల్లి సైదులు, మహిళా ప్రతినిధి బి. జ్యోతి, గంగాభవాని, ఆస్మా,పర్వీన్,స్వరాజ్యం, స్వర్ణలత,పవన్ కుమార్,కర్ణలింగయ్య, కళ్యాణ్ బాబు,మంద సైదులు, వీరేంద్ర నాయుడు, లింగంపల్లి అంజయ్య, చంద్రశేఖర్ రెడ్డి, ఎండి ఇబ్రహీం, ధూపాటి మట్టయ్య,డి రాజశేఖర్ నాయక్ మరియు మిర్యాలగూడ బార్ అసోసియేషన్‌కు చెందిన సీనియర్, జూనియర్ మరియు మహిళాన్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపారు.

## నసర్లపల్లి గ్రామసర్పంచి భర్తపై కలెక్టర్ కి పిర్యాదు

చింతపల్లి ఆగస్టు 05(ప్రజాజ్యోతి): చింతపల్లి మండలం నసర్లపల్లి గ్రామ సర్పంచి పంబలి మాలతి భర్త అయిన పంబలి వెంకటయ్య(డీలర్)పై చర్యలు తీసుకోవాలని గ్రామ ఉప సర్పంచి,మరికొందరు వార్డు సబ్యులు కలిసి సోమవారం జిల్లా కలెక్టర్ కి పిర్యాదు చేశారు. నసర్లపల్లి



గ్రామంలోని సర్పంచి మహిళ అయినప్పటికీ పంచాయతీ వ్యవహారాల్లో ఆమె భర్త పంబలి వెంకటయ్యదే ప్రధానపాత్ర ఉంటుందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారిక హోదా లేకపోయినా గ్రామ పాలనలో సర్పంచి భర్త పెత్తనం కొనసాగుతుందని వారు విమర్శించారు.పంచాయితీలో చేపట్టే అభివృద్ధి పనులు, ప్రభుత్వ కార్యక్రమలు,అధికారులతో సమావేశాలు ఇతరతర వ్యవహారాల్లో ఆయనే ప్రధానపాత్ర పోషిస్తున్నడని ప్రజలు ఆరోపిస్తు పిర్యాదు చేసారు.పంచాయతీ తీర్మానాలు తనకు అనుకూలంగా లేకపోతే తమ వార్డు సభ్యులను రాజీనామా చేయించి తమకు పదవి లేకుండా చేయిస్తానని బెదిరించినట్లు పిర్యాదులో పేర్కొన్నారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం పంచాయతీ వర్కర్లు పని చేస్తుంటే నేను చెప్పినట్టు పనిచేయాలని లేనిపక్షంలో మిమ్మల్ని ఉద్యోగాల నుండి తొలగిస్తామని బెదిరించినట్లు తెలిపారు.తనకు నచ్చినవారికే పనులు ఇప్పించడం అర్హత ఉన్నవారిని పనుల నుండి తొలగిస్తు ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నడని తెలిపారు.సమావేశాలకు సర్పంచి మాలతి భర్త వెంకటయ్య పాల్గొని వార్డు సబ్యులను బెదిరించడంతో పాలకవర్గం సరైన నిర్ణయాలు తీసుకోలేక పోతున్నట్లు పిర్యాదులో పొందుపరిచారు.పిర్యాదుపై జిల్లా అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.అదేవిధంగా బెదిరింపులకు పాల్పడిన సర్పంచి భర్తకు నోటీసులు జారీ చేయాలన్నారు.మరోసారి ప్రభుత్వ కార్యక్రమల్లో గాని,సభల సమావేశల్లో పాల్గొంటే సర్పంచిపై అనర్హత వేటు వేయాలని కోరుతున్నారు.పిర్యాదు చేసినవారు ఉప సర్పంచి వడ్లకొండ నర్సింహ,వార్డు సబ్యులు రాశిక శివకృష్ణ,బొడ్డుపల్లి వెంకటయ్య,కర్నాటి నాగార్జున్,పల్లె నర్సింహ,గడిగంటి సంధ్య,గ్రామస్తులు ఉన్నారు. సర్పంచి వివరణ:తమపై వస్తున్న ఆరోపణలు,అభివృద్ధి ఓర్వలేక మేము గిట్టనివారు చేస్తున్న రాజకీయ కుట్ర అని సర్పంచి పంబలి మాలతి ఖండించారు.

## గుడిపల్లి గ్రామ పంచాయతీలో ఘనంగా మహిళా గ్రామసభ సర్పంచ్ కూన్‌రెడ్డి రాజశేఖర్ రెడ్డి

దేవరకొండ,గుడిపల్లి,ఆగస్టు 03,(ప్రజాజ్యోతి): గుడిపల్లి మండల పరిధిలోని గుడిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఈరోజు సాధారణ మహిళా గ్రామసభను అత్యంత విజయవంతంగా నిర్వహించారు. ఈ సభకు గ్రామ సర్పంచ్ కూన్‌రెడ్డి రాజశేఖర్ రెడ్డి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. రాబోయే 2026-2027 ఆర్థిక సంవత్సరానికి గాను గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికలపై జిపిడిపి వార్డు సభ్యులు, ప్రజలతో కలిసి విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. సమాజంలో మహిళల ప్రాముఖ్యత, చట్టాలపై వారికి ఉండాల్సిన హక్కులపై ప్రత్యేక అవగాహన కల్పించామని పేర్కొన్నారు. మహిళలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నామని, వాటి పరిష్కారానికి పాలకవర్గం ఎల్లప్పుడూ ముందుంటుందని హామీ ఇచ్చారు.దీంతో పాటు గ్రామంలో ప్రకృతి వనరుల రక్షణ కోసం జీవవైవిధ్య యాజమాన్య కమిటీఏర్పాటుపై సభలో సుదీర్ఘంగా చర్చించి, పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు సర్పంచ్ వివరించారు.ఈ ప్రత్యేక గ్రామసభలో గ్రామ పంచాయతీ కార్యదర్శి విజయ రెడ్డి, ఉప సర్పంచ్ అరవపల్లి సీనయ్య, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, మహిళా సమాఖ్య



ప్రతినిధులు, అంగన్‌వాడీ టీచర్లు, ఫీల్డ్ అసిస్టెంట్, ఏఎన్ఎంలు మరియు గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పేదలకు పెన్షన్లు - రైతులకు నీళ్లు.. ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన బీఆర్ఎస్

తుంగతుర్తి, ఆగస్టు 3,(ప్రజా జ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ నూతన సామాజిక భద్రతా పెన్షన్లు మంజూరు చేయాలని, గోదావరి జలాలను కన్నెపల్లి మోటార్ల



ద్వారా తుంగతుర్తి, సూర్యాపేట ప్రాంతాలకు విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు, మాజీ ఎంపీపీ తాటికొండ సీతయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి వితంతువులు, ఒంటరి మహిళలు, మరణించిన వికలాంగుల కుటుంబ సభ్యులకు పెన్షన్లు అందజేస్తామని ప్రకటించినప్పటికీ, ఇప్పటివరకు సంబంధిత అధికారులకు దరఖాస్తులు స్వీకరించాలనే స్పష్టమైన ఆదేశాలు జారీ చేయలేదన్నారు. దీంతో అర్హులైన లబ్ధిదారులు మీ సేవ కేంద్రాలు, మండల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా సరైన సమాచారం లేక నిరాశతో వెనుదిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి పెన్షన్లు మంజూరు చేస్తుందా, లేక కొత్త దరఖాస్తులను స్వీకరిస్తుందా అనే విషయంపై వెంటనే స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ఎల్‌నినో ప్రభావంతో తుంగతుర్తి, సూర్యాపేట ప్రాంతాల్లో రైతులు సాగు చేసిన వరి నాట్లు ఎండిపోతుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. మరోవైపు లక్షల క్యూసెక్కుల గోదావరి జలాలు ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా సముద్రంలో కలిసిపోతున్నాయని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కన్నెపల్లి మోటార్ల ద్వారా గోదావరి జలాలను విడుదల చేసి రైతుల పంటలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండగాని రాములుగౌడ్, మండల నాయకులు దొంగరి శ్రీనివాస్, సర్పంచులు మేడుదుల రమేష్, మాతంగి వెంకటమ్మ కర్ణాకర్,నల్లబెల్లి వెంకటేష్, బొజ్జ సాయికిరణ్, బల్లెం ప్రవీణ్, గోపగాని వెంకన్న, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయ పని వేళలు పొడిగించాలి...

**ఆర్డీవో కు వినతిపత్రం అందచేసిన నిరుద్యోగ యువత**

హుజూర్ నగర్, ఆగస్టు 3 (ప్రజా జ్యోతి): ప్రభుత్వ ఉద్యోగాల సాధన కోసం సిద్ధమవుతున్న నిరుద్యోగ అభ్యర్థుల సౌకర్యార్థం హుజూర్ నగర్ ప్రభుత్వ గ్రంథాలయ పని వేళలను ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పొడిగించాలని విద్యార్థులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ)కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బి ఆర్ ఎస్ వి రాష్ట్ర నాయకులు జనిగ సందీప్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం వరుసగా ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేస్తున్న నేపథ్యంలో స్థానిక నిరుద్యోగ యువత ఉద్యోగాల సాధన కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారని తెలిపారు. అయితే, వీరిలో ఎక్కువ మంది పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారు కావడంతో



హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లి కోచింగ్ తీసుకునే అవకాశం లేకపోతోందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో హుజూర్ నగర్ ప్రభుత్వ గ్రంథాలయమే వారికి ప్రధాన ఆధారంగా మారిందని పేర్కొన్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న గ్రంథాలయ పని వేళలు అభ్యర్థుల అవసరాలకు అనుగుణంగా లేకపోవడంతో చదువుకు ఆటంకం కలుగుతోందని తెలిపారు. అలాగే సెలవు దినాల్లో కూడా గ్రంథాలయాన్ని మూసివేయకుండా నిరంతరాయంగా అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు సానుకూలంగా స్పందించి గ్రంథాలయ పని వేళలను పొడిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజేష్, జయ నరసింహ, వినోద్, మనోజ్, నాగరాజు, నరసింహ, సాయి చరణ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీల అభివృద్ధి,సర్పంచ్‌ల సమస్యల పరిష్కారం సమిష్టిగా కృషి చేస్తా

**సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలుగా శేషరాజు సంధ్య శ్రీనివాస్**

నిడమనూరు,ఆగష్టు 03(ప్రజాజ్యోతి): గ్రామపంచాయతీల అభివృద్ధి,సర్పంచ్‌ల సమస్యల పరిష్కారం కోసం సమిష్టిగా కృషి చేస్తామని మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలుగా శేషరాజు సంధ్య శ్రీనివాస్ అన్నారు.సోమవారం నిడమనూరు



మండలంలోని తుమ్మడం గ్రామంలో ఏర్పాటు చేసిన సర్పంచ్‌ల సమావేశంలో నిడమనూరు మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలుగా శేషరాజు సంధ్య శ్రీనివాస్ ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అదేవిధంగా ఫోరం నూతన కార్యవర్గాన్ని కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. -నూతన సర్పంచ్ ల ఫోరంకార్యవర్గం: అధ్యక్షురాలు: శ్రీమతి శేషరాజు సంధ్య శ్రీనివాస్ కన్వీనర్: బుర్రి వెంకటేశ్వర్లు ఉపాధ్యక్షులు: ధర్మారపు వెంకన్న,ధనావత్ గుణ నాయక్, ప్రధాన కార్యదర్శి: సింగం రామలింగయ్య, కోశాధికారి: గుడి గోపురం సునీత లోహిత్ రెడ్డి, కార్యదర్శులుగా:రూపాని పుష్పలత కృష్ణయ్య, చెరక సంధ్య శ్రీనివాస్,పాక లింగయ్యలను నూతనంగా ఎన్నికైన సర్పంచుల ఫోరం అధ్యక్షురాలు శేషరాజు సంధ్య శ్రీనివాస్ తో పాటు నూతన కార్యవర్గ సభ్యులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు పలువురు తెలియజేశారు. మండలంలోని గ్రామపంచాయతీల అభివృద్ధి,సర్పంచ్‌ల సమస్యల పరిష్కారం కోసం సమిష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఎడవెల్లి వల్లభ్ రెడ్డి ,మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం , నిడమనూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింగ్ విజయకుమార్ గౌడ్ , ముంగి శివ మారయ్యతో పాటు మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఎర్రబెల్లిలో గడ్డి వాము దగ్ధం..

**బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే రూ.20 వేల ఆర్థిక సాయం అందజేత**

నిడమనూరు,ఆగష్టు 03(ప్రజాజ్యోతి): మండలంలోని ఎర్రబెల్లి గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో ధర్మారపు వెంకన్న-సైదమ్మ గడ్డివాము పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి సోమవారం రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఎర్రబెల్లి సర్పంచ్ అయితగోని మధు గౌడ్, స్థానిక నాయకులు ఘటన వివరాలను ఎమ్మెల్యే దృష్టికి





తీసుకెళ్లగా, ఆయన ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింగ్ విజయకుమార్ గౌడ్ ద్వారా బాధిత కుటుంబానికి రూ.20 వేల సాయాన్ని అందించారు. అలాగే ఎమ్మార్వోతో మాట్లాడి ప్రభుత్వం తరఫున కూడా తగిన నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.అనంతరం ఎర్రబెల్లి సర్పంచ్ నర్సింగ్ విజయకుమార్ గౌడ్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి ప్రజల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో ముందుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కందుకూరి నవీన్, ములక శ్రీనివాస్ రెడ్డి, పగడాల మధు, సిద్ధునూరి వెంకటేశ్వర్లు, వార్డ్ మెంబర్ బొంగరాల జానయ్య, ముడి పవన్, ఆలేటి వెంకన్న, విజయ కుమార్ రెడ్డి, దూసరి మహేష్, మల్లికంటి కోటేష్, పాల్వాయి వెంకన్న, అయితగోని వెంకన్న, మేకల శంకర్, బంటువారి గూడెం,సోమవారి గూడెం సర్పంచ్లు సలహాదారులు గుండెబోయిన రాజు, చెరక శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ వంతెన నిర్మాణాలకు నోటీసులు జారీ

- ప్రజాజ్యోతి కథనానికి అధికారుల స్పందన
- ఇరిగేషన్, రెవెన్యూ శాఖల సంయుక్త చర్యలు
- అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు


ప్రజాజ్యోతి

వాగులపై అక్రమ నిర్మాణాలపై అధికారుల నిర్లక్ష్యం ఎందుకు?



**కొండాపూర్ ప్రజాజ్యోతి** ప్రజాజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన "వాగులపై అక్రమ నిర్మాణాలపై అధికారుల నిర్లక్ష్యం ఎందుకు?" అనే కథనానికి ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులు స్పందించారు. మండలంలోని మన్నాన్పల్లి వాగులో అనుమతులు లేకుండా నిర్మించిన వంతెనలు, ఇతర నిర్మాణాలపై విచారణ చేపట్టి సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ప్రభుత్వ అనుమతులు లేకుండా వాగులు, సహజ నీటి ప్రవాహ మార్గాల్లో నిర్మాణాలు చేపట్టడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. ఇటువంటి నిర్మాణాలు వరదల సమయంలో నీటి ప్రవాహానికి ఆటంకం కలిగించి ప్రజలు, రైతులకు నష్టం కలిగించే అవకాశం ఉందన్నారు. అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిని గుర్తించి ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. నోటీసులకు సంతృప్తికరమైన వివరణ ఇవ్వకపోతే నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే అక్రమ నిర్మాణాలను తొలగించే చర్యలు కూడా చేపడతామని హెచ్చరించారు. ప్రజాజ్యోతి కథనం వెలుగులోకి రావడంతో అధికారులు స్పందించి నోటీసులు జారీ చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### బీరప్ప కుటుంబాన్ని పరామర్శించిన

# మండల కాంగ్రెస్ అధ్యక్షులు వజనాల విశ్వాస్

**అందోల్, ఆగస్టు 3 (ప్రజాజ్యోతి):** వట్‌పల్లి మండలంలోని దరకాస్తుపల్లి గ్రామానికి చెందిన ఇటీవల మృతి చెందిన బీరప్ప కుటుంబ సభ్యులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వజనాల విశ్వాస్ సోమవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో తాను, కాంగ్రెస్ పార్టీ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా వజనాల విశ్వాస్ మాట్లాడుతూ.. బీరప్ప మృతి కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, అవసరమైన ప్రతి విషయంలో తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. కుటుంబానికి ప్రభుత్వం నుంచి అందాల్సిన సంక్షేమ పథకాలు, ఇతర సహాయాలు అందేలా కృషి చేస్తానని తెలిపారు. బీరప్ప కుటుంబ సభ్యుల ఆవేదనను తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు వారికి ధైర్యం చెప్పారు. గ్రామ ప్రజలు కూడా కుటుంబానికి అండగా నిలవాలని విశ్వాస్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దరకాస్తుపల్లి గ్రామ సీనియర్ నాయకులు సత్యనారాయణ గౌడ్, బాబన్న నరసింహ, మండల నాయకులు ఎన్ఎస్‌యూఐ రుక్మొద్దీన్, ఖదీర్, సుధాకర్ తదితరులు పాల్గొని బీరప్ప కుటుంబ సభ్యులను పరామర్శించారు.



# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- అన్ని శాఖల సమన్వయంతో వేడుకలను ఘనంగా నిర్వహిద్దాం
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ఆగస్టు 03:-** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జాతీయ స్ఫూర్తిని ప్రతిబింబించేలా, పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఆగస్టు 15న పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే జిల్లా స్థాయి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేయాలని సూచించారు. వేదిక, అతిథుల సీటింగ్, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, తదితర అంశాల్లో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించేలా సమగ్ర జిల్లా ప్రగతి నివేదికను సిద్ధం చేయాలని జిల్లా ప్రణాళికాధికారి కి కలెక్టర్ ఆదేశించారు. ప్రోటోకాల్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ ప్రజాప్రతినిధులు, విశిష్ట అతిథులకు ఆహ్వానాలు పంపాలని సూచించారు. జాతీయ భావనను పెంపొందించేలా విద్యార్థులతో దేశభక్తిని చాటే సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని విద్యాశాఖ,సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రశంసా పత్రాల బహూకరణ కోసం శాఖల వారీగా ఉత్తమ ఉద్యోగుల వివరాలతో కూడిన ప్రతిపాదనలను నిర్ణీత గడువులోగా సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ వేడుకలను విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.






### ప్రజావాణి ఫిర్యాదుల

# సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

- కలెక్టరేట్ ప్రజావాణిలో 48 వినతులు స్వీకరణ
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ఆగస్టు 03:--** ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదు, వినతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్దిష్ట రిమార్కులతో సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు సంగీత, పాండుతో కలిసి ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో అందిన ప్రతి వినతిని వాస్తవ పరిస్థితుల ఆధారంగా క్షుణ్ణంగా పరిశీలించి, స్పష్టమైన నివేదికలు, నిర్దిష్ట రిమార్కులతో నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి, వాటిని త్వరితగతిన పరిష్కరించాలన్నారు. నేటి ప్రజావాణిలో జిల్లావ్యాప్తంగా మొత్తం 67 ఫిర్యాదులు, వినతులు అందాయని తెలిపారు. వీటిలో కలెక్టరేట్‌లో 48, సంగారెడ్డి డివిజన్‌లో 8, జహీరాబాద్ డివిజన్‌లో 7, నారాయణఖేడ్ డివిజన్‌లో 4 వినతులు అందగా, అందోల్ డివిజన్‌లో ఎలాంటి ఫిర్యాదులు నమోదు కాలేదని పేర్కొన్నారు. అందిన వినతులు ప్రధానంగా రెవెన్యూ, హౌసింగ్, పెన్షన్లు, ఈఈ (పంచాయతీరాజ్), పంచాయతీరాజ్, నీటిపారుదల, కాలుష్య నియంత్రణ మండలి , కార్మిక, విద్య, ఆర్టీసీ, ఉపాధి కల్పన, మహిళా మరియు శిశు సంక్షేమం, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖలకు సంబంధించినవని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంగారెడ్డి ఆర్డీఓ, కలెక్టరేట్ రెవెన్యూ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.







### విజేత హైస్కూల్లో ఘనంగా

# స్నేహితుల దినోత్సవ వేడుకలు



**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 3:** స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నారాయణఖేడ్ పట్టణంలోని విజేత హైస్కూల్లో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఒకరికి ఒకరు ఫ్రెండ్షిప్ బ్యాండ్లు కట్టుకుని స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ ఆనందోత్సాహాలతో వేడుకల్లో పాల్గొన్నారు. స్నేహం యొక్క విలువను తెలియజేస్తూ విద్యార్థులు పరస్పరం ఆప్యాయతను పంచుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ..స్నేహం అనేది జీవితంలో ఎంతో విలువైన బంధం. మంచి స్నేహితులు మన వ్యక్తిత్వ వికాసానికి, క్రమశిక్షణకు, మంచి భవిష్యత్తు నిర్మాణానికి తోడ్పడతారు. విద్యార్థులు ఎల్లప్పుడూ మంచి స్నేహితులను ఎంచుకుని పరస్పరం సహకారం, గౌరవం, ప్రేమాభిమానాలతో ముందుకు సాగాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని స్నేహితుల దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు.



# ఇందల్వాయి తండాలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

**ఇందల్వాయి, ప్రజా జ్యోతి ఆగస్టు 3** ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని ఇందల్వాయి తండాలో సర్పంచ్ సుదర్శన్ నాయక్ అధ్యక్షతన తల్లిపాల వారోత్సవ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ పరిధిలోని గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, పసిపిల్లలకు తల్లిపాలు అమృతంతో సమానమని, పుట్టిన వెంటనే బిడ్డకు ఇచ్చే ముర్రుపాలు బిడ్డ ఆరోగ్యాన్ని, రోగనిరోధక శక్తిని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఆరు నెలల వరకు బిడ్డకు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టాలని అంగన్‌వాడీ సిబ్బంది వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి జాన్సన్,స్థానిక ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయా ఆశా కార్యకర్తలు, గ్రామ మహిళలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.



### ఇందల్వాయి జెడ్పీహెచ్ ఎస్ పాఠశాలలో

# తాగునీటి మినీ ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ

**ఇందల్వాయి, ఆగస్టు 03, ప్రజా జ్యోతి ):** ఇందల్వాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల తాగునీటి ఎద్దడిని తీర్చేందుకు గ్రామ యంగ్ స్టార్ యూత్ సభ్యులు గొప్ప ఉదారతను చాటుకున్నారు. పాఠశాలలో సుమారు 65,000 అంచనా వ్యయంతో మినీ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ రోజు పాఠశాల ప్రాంగణంలో యంగ్ స్టార్ యూత్ సభ్యులతో కలిసి గ్రామ సర్పంచ్ లోకాని గంగమణి, గంగారం భూమి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సంక్షేమం కోసం ముందుకు వచ్చిన యూత్ సభ్యులను ఈ సందర్భంగా సర్పంచ్ మరియు ఉపాధ్యాయ బృందం అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరామిరెడ్డి, యంగ్ స్టార్ యూత్ వ్యవస్థాపకులు ఇట్టెడి ప్రశాంత్ రెడ్డి, యూత్ అధ్యక్షులు ఉప్పల్వాయ్ తరుణ్, యూత్ ఉపాధ్యక్షులు బైరి మదన్ మోహన్, యంగ్ స్టార్స్ యూత్ సభ్యులు, ఉపాధ్యాయులు మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి సోమవారం మండల, డివిజన్ స్థాయిలో ప్రజావాణి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**రామారెడ్డి ఆగస్టు 03 (ప్రజా జ్యోతి)** జిల్లా ప్రజల సౌకర్యార్థం ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా ప్రజావాణి కార్యక్రమం జిల్లా కేంద్రంతో పాటు ప్రతి సోమవారం జిల్లాలోని డివిజన్, మండల స్థాయిలో సమర్పించుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు, వచ్చే వారం నుంచి ప్రజావాణి ఫిర్యాదులు కామారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని అన్ని మండల, డివిజన్ స్థాయిలోనే సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఇక నుండి అన్ని మండల కేంద్రాలలో ప్రజావాణి నిర్వహించడం జరుగుతుందని, సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, జిల్లాలో కొనసాగుతున్న వర్షాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వచ్చే వారం నుంచి ప్రజావాణి వినతులు, ఫిర్యాదులను మండల, డివిజన్ స్థాయిలోనే సమర్పించాలని ప్రజలను కోరారు. ప్రజలు జిల్లా కేంద్రానికి అనవసరంగా ప్రయాణించి ఇబ్బందులు పడకుండా, తమకు సమీపంలోని మండల, డివిజన్ ప్రజావాణి కార్యక్రమాల్లోనే వినతులు సమర్పించాలని సూచించారు. అక్కడ అందిన ప్రతి వినతిని సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించి, నిర్దేశిత గడువులో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



# తిమ్మక్‌పల్లిలో పారిశుద్ధ్యానికి పెద్దపీట

- చెత్త వేరు చేసే కార్యక్రమానికి గ్రామస్తుల విశేష స్పందన
- సర్పంచ్ గుర్రాల లక్ష్మి ఆధ్వర్యంలో స్వచ్ఛ గ్రామం దిశగా ముందడుగు
- సీజనల్ వ్యాధుల నివారణకు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సర్వే చేసిన ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు
- పరిశుభ్రమైన గ్రామమే ఆరోగ్యకరమైన గ్రామమని ప్రజలకు అవగాహన

**కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 3 (ప్రజాజ్యోతి)** కామారెడ్డి మండలంలోని తిమ్మక్‌పల్లి గ్రామంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టిన పారిశుద్ధ్య కార్యక్రమాలు గ్రామ ప్రజల ప్రశంసలు అందుకుంటున్నాయి. గ్రామాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంతో, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో సర్పంచ్ గుర్రాల లక్ష్మి నాయకత్వంలో చెత్తను తడి చెత్త, పొడి చెత్తగా వేరు చేసే కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విశేష సహకారం అందించడంతో గ్రామమంతా పరిశుభ్రత వైపు అడుగులు వేస్తోంది. గ్రామంలో ప్రతి ఇంటి నుంచి వచ్చే చెత్తను శాస్త్రీయ పద్ధతిలో వేరు చేయడం వల్ల పర్యావరణ కాలుష్యం తగ్గడంతో పాటు వ్యర్థాల నిర్వహణ సులభమవుతుందని గ్రామపంచాయతీ అధికారులు ప్రజలకు వివరించారు. తడి చెత్తను కంపోస్ట్ తయారీకి, పొడి చెత్తను రీసైక్లింగ్‌కు వినియోగించడం ద్వారా గ్రామం మరింత పరిశుభ్రంగా ఉండటమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పాటుగా ఉంటుందని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా గ్రామపంచాయతీ సూచించిన విధంగా మాత్రమే అందించాలని గ్రామస్తులను కోరారు. వర్షాకాలం నేపథ్యంలో డెంగ్యూ, చికున్‌గున్యా, మలేరియా, వైరల్ జ్వరాలు, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరిస్థితులను పరిశీలించారు. జ్వరం, దగ్గు, జలుబు వంటి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి తగిన వైద్య సేవలు పొందాలని సూచించారు. దోమలు వృద్ధి చెందకుండా ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండనీయకుండా చూడాలని, నీటి ట్యాంకులను మూతపెట్టాలని, పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. గ్రామ సర్పంచ్ గుర్రాల లక్ష్మి మాట్లాడుతూ, గ్రామ ప్రజల సహకారంతో తిమ్మక్‌పల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని తెలిపారు. పారిశుద్ధ్యం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రతి కుటుంబం చెత్తను తప్పనిసరిగా వేరు చేసి గ్రామపంచాయతీకి అందించాలని కోరారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ, దోమల నివారణ, వ్యాధుల నియంత్రణ వంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని, ప్రజల ఆరోగ్య రక్షణకు గ్రామపంచాయతీ కట్టుబడి ఉందన్నారు. ఉపసర్పంచ్ గొర్రె పరమేశ్వర్ మాట్లాడుతూ, గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని అన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛతను జీవన విధానంగా మార్చుకోవాలని సూచించారు. గ్రామపంచాయతీ సెక్రటరీ శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛ గ్రామాల లక్ష్య సాధనలో భాగంగా గ్రామంలో చెత్త నిర్వహణను మరింత సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. గ్రామ ప్రజలు అందరూ సహకరించడం వల్ల కార్యక్రమం విజయవంతమైందని చెప్పారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు మాట్లాడుతూ, వర్షాకాలంలో ఆరోగ్య పరిరక్షణపై ప్రజలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, చిన్నపాటి అనారోగ్య లక్షణాలు కనిపించినా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా సమానంగా ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుర్రాల లక్ష్మి, ఉపసర్పంచ్ గొర్రె పరమేశ్వర్, గ్రామపంచాయతీ సెక్రటరీ శ్రీనివాస్, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, పారిశుద్ధ్య కార్మికులు, మహిళా సంఘాల సభ్యులు, యువకులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. "పరిశుభ్రమైన గ్రామం -- ఆరోగ్యవంతమైన గ్రామం" అనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ గ్రామపంచాయతీకి సహకరించాలని గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు.







# తల్లిపాల వారోత్సవాలు




**మెదక్ (ప్రజా జ్యోతి)** ఆగస్టు ఒకటో తేదీ నుండి 7వ తేదీ వరకు నిర్వహించే ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు విజయవంతం చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ పిలుపునిచ్చారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు ఉత్సవాల పోస్టర్ను అదనపు కలెక్టర్ నగేష్ తో కలిసి ఆవిష్కరించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి తల్లి తన బిడ్డకు జన్మనిచ్చిన గంట లోపే తల్లిపాలు అందించాలని తెలిపారు. తల్లి పాలు శిశువుకు సురక్షితమైందని స్వచ్ఛమైన దని పోషక నిలువలు కలిగి ఉంటాయని శిశువు ఆరోగ్యంగా ఎదగడానికి తల్లిపాలు బలమైన పునాదులు వెస్తాయని.. ప్రతి తల్లిపాలు బిడ్డ ఇవ్వడం ప్రతి తల్లి హక్కు అని ప్రతి తల్లి తన మాతృత్వ బాధ్యతను గురించి పిల్లలకు తల్లిపాలు అందించాలని కోరుతూ తల్లులు తీసుకునే పోషకాహారం ద్వారానే స్వచ్ఛమైన పాలు బిడ్డకు అందుతాయని దీంతో పిల్లలు ఆరోగ్యంగా ఉండి ఎదుగుతారని తెలిపారు బలమైన బాల్యాన్ని ఆరోగ్యకరమైన సామాజ నిర్మాణానికి తలీ పాలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడి లకు ఉపాధ్యాయులకు ఆశ కార్యకర్తలు, వైద్యులు సిబ్బంది తల్లులకు ప్రోత్సహించిన తల్లిపాలు అదే విధంగా విస్తృతంగా అవగాహన కలిగించండి. ఈ సమావేశానికి అదనపు కలెక్టర్ నగేష్ డీ డబ్లు హేమ భార్గవి డి సి హెచ్ శివ దయాల్ జడ్పి సీఈఓ ఎల్లయ్య డిఆర్డిఓ శ్రీనివాసరావు డిఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్ రాజు జిల్లా వైద అధికారి గజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## యంఎస్ అగర్వాల్ పరిశ్రమపై ప్రజావాణిలో కంప్లైంట్



**మెదక్ (ప్రజా జ్యోతి)** మెదక్ జిల్లా కలెక్టర్లో ఈరోజు ప్రజావాణిలో సీపీఐ పార్టీ మీా అగర్వాల్ పరిశ్రమ మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల్ రంగయ్య పల్లి గ్రామంలో ఉన్న పరిశ్రమ కాలుష్యం ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని ఈ పరిశ్రమ 2006 నుండి పరిశ్రమలు ఉత్పత్తులు జరుగుతున్నాయని అన్నారు ఇప్పటికే మూడుసార్లు పరిశ్రమలు విస్తృత పరిచయం తెలిపారు పరిశ్రమ నుండి వెదజల్లుతున్న కాలుష్యంతో భూగర్భ జలాలు పూర్తిగా కలుషితం అయ్యాయని వాటి వలన గ్రామాలలో ప్రజలకు చర్మవ్యాధులు శరీరంపై దద్దులు వస్తున్నాయని ఆమె అన్నారు పరిశ్రమ వెదజల్లే దుమ్ముదులి వల్ల నల్లటి దుమ్ముతో ప్రజలు తీవ్ర అనారోగ్యం గురవుతున్నారని అన్నారు దీనిపై ఇప్పటికే పలుమార్లు జిల్లా స్థాయిలో కంప్లైంట్ ఇవ్వడం జరిగింది అని ప్రజావాణిలో తెలపడం జరిగింది.

## తల్లి పాలు శిశువు ఆరోగ్యానికి తొలి ఆధారం



**సిద్ధిపేట రూరల్ ,జులై 16,(ప్రజాజ్యోతి):** తల్లి పాలు శిశువు ఆరోగ్యానికి తొలి ఆధారమని గుర్రాలగొంది గ్రామ సర్పంచ్ ఆకుల స్వప్న అన్నారు. నారాయణరావుపేట మండలంలోని గుర్రాలగొంది గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఆకుల స్వప్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన వెంటనే శిశువుకు తల్లి పాలు ఇవ్వడం వల్ల రోగనిరోధక శక్తి పెరిగి, ఆరోగ్యవంతంగా ఎదుగుతారని తెలిపారు. అంగన్‌వాడీ సూపర్వైజర్ దివ్య మాట్లాడుతూ, తల్లి పాలే శిశువుకు తొలి ఔషధమని వివరించారు. తల్లి పాలలో వ్యాధి నిరోధక శక్తి అధికంగా ఉండటంతో పాటు, శిశువుకు సంపూర్ణ పోషకాహారం అందుతుందని తెలిపారు. బిడ్డకు తల్లి పాలు ఇవ్వడం వల్ల తల్లుల్లో రొమ్ము క్యాన్సర్ వచ్చే ప్రమాదం కూడా తగ్గుతుందని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పిట్ల రేణుక, మట్టె చిలుక, బేజుగాం అంజమ్మ, గ్రామ తల్లులు, గర్భిణీలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## డెంగ్యూ కేసులు పెరగకుండా అప్రమత్తంగా ఉండాలి

★ జిల్లా కలెక్టర్ హైమావతి




**సిద్దిపేట, ఆగస్టు 3,(ప్రజాజ్యోతి):** మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులను ముందస్తుగా అరికట్టేందుకు జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల్లో పారిశుధ్య కార్యక్రమాలను పగడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ హైమావతి మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటికే ఐదు డెంగ్యూ కేసులు నమోదయ్యాయని తెలిపారు. మరిన్ని కేసులు పెరగకుండా ప్రతి గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అధికారులతో సమీక్షలు నిర్వహించి పారిశుధ్య కార్యక్రమాల అమలును నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.ప్రతి మంగళవారం, శుక్రవారం తప్పనిసరిగా డ్రై డే కార్యక్రమాలు నిర్వహించి ఎక్కడా వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పంచాయతీ శాఖ సమన్వయంతో ఆగస్టు 4న జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించి నిల్వ నీటిని తొలగించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. డెంగ్యూ కేసులు నమోదైన గ్రామాల్లో వెంటనే ఇంటింటికీ జ్వర సర్వే చేపట్టి, ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, డీఆర్ఓ నాగరాజమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## తల్లిపాలతోనే శిశు సంపూర్ణ ఆరోగ్యం

★ ఐసిడిఎస్ సూపర్వైజర్లు గిరిజ, రేఖ



**దౌల్తాబాద్, ఆగస్టు 03: ( ప్రజా జ్యోతి )** శిశువుల ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో అవసరమని ఐసిడిఎస్ సూపర్వైజర్ గిరిజ, రేఖ పేర్కొన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా దౌల్తాబాద్ మండలంలోని ఇందుప్రియల్, సెక్టర్లో హమ్మద్ నగర్ అంగన్వాడి సెంటర్లో, అలాగే దౌల్తాబాద్ సెక్టర్ లోని షేర్ పల్లి బందారం ఒకటవ అంగన్వాడి లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించమన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు ఇవ్వడం ప్రారంభించాలని, తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే అందించడం వల్ల శిశువుకు సంపూర్ణ పోషకాహారం లభించడంతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు. తల్లిపాలు శిశువుకు సహజ రక్షణ కవచంలా పనిచేస్తాయని, తల్లులు అపోహలను నమ్మకుండా వైద్యుల సూచనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు పెరమండ్ల నర్సింలు, షేక్ అలీ, ముబారస్పూర్ అంగన్వాడి ఇన్చార్జి టీచర్ వసంత, షేర్ పల్లి బందారం ఒకటవ అంగన్వాడి టీచర్ లావణ్య, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు,ఏఎన్ఎం లు, ఆశ వర్కర్లు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

★ అన్ని శాఖల సమన్వయంతో వేడుకలను ఘనంగా నిర్వహిద్దాం ★ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్




**మెదక్ (ప్రజా జ్యోతి)** ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జాతీయ స్ఫూర్తిని ప్రతిబింబించేలా, పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ సంపూర్ణ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులతో సమన్వయ సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ, ఆగస్టు 15న పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే జిల్లా స్థాయి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేయాలని సూచించారు. వేదిక, అతిథుల సీటింగ్, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, తదితర అంశాల్లో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించేలా సమగ్ర జిల్లా ప్రగతి నివేదికను సిద్ధం చేయాలని జిల్లా ప్రణాళికాధికారి కి కలెక్టర్ ఆదేశించారు. ప్రోటోకాల్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ ప్రజాప్రతినిధులు, విశిష్ట అతిథులకు ఆహ్వానాలు పంపాలని సూచించారు. జాతీయ భావనను పెంపొందించేలా విద్యార్థులతో దేశభక్తిని చాటే సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని విద్యాశాఖ, సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రశంసా పత్రాల బహూకరణ కోసం శాఖల వారీగా ఉత్తమ ఉద్యోగుల వివరాలతో కూడిన ప్రతిపాదనలను నిర్ణీత గడువులోగా సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ వేడుకలను విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, డి ఆర్ వో అంబాదాస్ రాజేశ్వర్, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# శ్రీరామ్ నరేందర్‌కు పిఎసిఎస్ చైర్మన్ దక్కేనా..?

★ కరుడుగట్టిన కార్యకర్తలకు పదవులు ఇవ్వాలి

★ ముత్యం రెడ్డి ఆశయాలు నెరవేరాలంటే నిజమైన కార్యకర్తలకు అవకాశం ఇవ్వలి

★ 2009 నుండి నేటి వరకు ఒకే జెండాపై ఉన్న వ్యక్తి శ్రీరామ్ నరేందర్

★ కొత్తగా వచ్చిన వారిని నమ్మకుంటే పార్టీ అధోగతే...?




**దుబ్బాక ప్రతినిధి, ఆగస్టు 03 (ప్రజా జ్యోతి)** నాటి తెలంగాణ ఉద్యమం నుండి మొదలుకొని నేటి వరకు ఒకే జెండా ఒకే గొడుగు పై నిలబడి పార్టీని నమ్ముకుని, పార్టీ కోసం తన ఉద్యోగాన్ని సైతం లెక్కచేయకుండా నిరంతరం కృషి చేసిన గొప్ప వ్యక్తి శ్రీరామ్ నరేందర్, నీతికి నిజాయితీకి మరో పేరు నరేందర్... అలాంటి గొప్ప నాయకుడు 2009 నుండి మొదలుకుంటే నేటి వరకు కాంగ్రెస్ జెండా వదలకుండా ఒకే ఎజెండాపై నిలిచి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి శ్రీరామ్ నరేందర్, కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం నేడు పార్టీ కార్యకర్తలకు 60 శాతం పార్టీకి సేవలందించిన వ్యక్తులకు నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తానన్న విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిందే, కానీ ఇప్పుడు దుబ్బాక పిఏసిఎస్ చైర్మన్ పై ఎక్కడెక్కడినుండో వచ్చిన వ్యక్తులు, అంతేకాకుండా దుబ్బాకలో ఉండకుండా హైదరాబాద్ లో ఉంటూ, పదవి కోసం పైరవీలు చేస్తుండడం జరుగుతుంది. ఏది ఏమైనా కాంగ్రెస్ పార్టీ అధిష్టానం, మరియు దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఇప్పటికైనా ఆలోచించి నాటి నుండి నేటి వరకు తన వెంట ఎవరు నడిచారో ఆలోచించి ఫ్యాక్స్ చైర్మన్ పదవి ఇవ్వాలని ప్రజలు కోరుకుంటున్నారు. నిరంతరం ప్రజాసేవకే అంకితమై ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన వ్యక్తి శ్రీరామ్ నరేందర్, అలాంటి గొప్ప నాయకుడు.. అంతే కాకుండా నాటి నుండి నేటి వరకు ముత్యంరెడ్డి అనుచరుడిగా, శ్రీనివాస్ రెడ్డికి నమ్మిన బంటుగా కాంగ్రెస్ పార్టీలో ఉంటూ పార్టీ సేవ కోసం తన వృత్తిని కూడా త్యాగం చేసిన గొప్ప వ్యక్తి... అలాంటి వ్యక్తికి పిఎసిఎస్ చైర్మన్ పదవి ఇవ్వాలని కార్యకర్తలు ప్రజలు కోరుకుంటున్నారు... ఏది ఏమైనా కాంగ్రెస్ పార్టీ అధిష్టానం, మరియు నియోజకవర్గ ఇన్చార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి పిఎసిఎస్ చైర్మన్ పదవి ఎవరి చేతుల్లో పెడతారా వేచి చూడాల్సిందే.?

# చేవెళ్ల డిక్లరేషన్ హామీని తక్షణమే అమలు చేయాలి

★ దళితులకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైన ప్రభుత్వం

★ ఎస్సీ సబ్ ప్లాన్ పునరుద్ధరించి దళితుల సంక్షేమానికి ఖర్చు చేయాలి - డిఏచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి కనుకుంట్ల శంకర్





**సిద్దిపేటఅర్బన్ ,ఆగస్ట్3 (ప్రజాజ్యోతి):-** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో దళితులకు ఇచ్చిన హామీ చేవెళ్ల డిక్లరేషన్ తక్షణమే అమలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి (డి.హెచ్.పి.ఎస్) జిల్లా కార్యదర్శి కనుకుంట్ల శంకర్,అధ్యక్షుడు బోనగిరి రూపేష్ లు అన్నారు. సోమవారం నాడు దళితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయంల వద్ద డి ఏచ్ పి ఎస్ సిద్దిపేట జిల్లా సమితి ఆధ్వర్యంలో నిరసన తెలిపిన అనంతరం కార్యాలయంలోని పరిపాలన అధికారి పి. రాజ్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దళితుల అభివృద్ధికి ఉద్దేశించిన ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు ఇతర అవసరాలకు మళ్లించడం రాజ్యాంగ స్ఫూర్తికి, సామాజిక న్యాయానికి విరుద్ధమని అన్నారు. దళితుల విద్య, ఉపాధి, గృహనిర్మాణం, ఆరోగ్యం, మౌలిక వసతుల కోసం ఖర్చు చేయాల్సిన నిధులను పూర్తిగా అదే లక్ష్యాలకు వినియోగించాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ముఖ్యమంత్రి దళితులకు చేవెళ్ల సభలో చెప్పిన దళిత డిక్లరేషన్ ను తక్షణమే అమలు చేయాలని కోరారు.సిద్దిపేటజిల్లాలో వేలాది దళిత కుటుంబాలు ఇప్పటికీ సొంత ఇల్లు లేక అద్దె ఇళ్లలో తాత్కాలిక నివాసాల్లో జీవిస్తున్నారని ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక కార్యాచరణ చేపట్టి ప్రతి దళిత కుటుంబానికి గౌరవప్రదమైన శాశ్వత ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను పూర్తిస్థాయిలో పునరుద్ధరించి దళిత సంక్షేమానికే ఖర్చు చేయాలని,దళితులకు పెండింగ్‌లో ఉన్న సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయాలని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తే భవిష్యత్ లో రాష్ట్రవ్యాప్తంగా దళిత ప్రజలను సమీకరించి ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డి ఏచ్ పి ఎస్ నాయకులు చంద్రశేఖర్, మంజుల, రమేష్, సతీష్, లక్ష్మీ, మనీష్, రాకేష్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## కామన్ డైట్ మెనూ పాటిస్తూ రుచికరంగా వండాలి

★ వంటగది పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

★ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి ★ జిల్లా కలెక్టర్ హైమావతి





**సిద్దిపేట అర్బన్, ఆగస్టు3 (ప్రజాజ్యోతి):-** గురుకులాల్లో కామన్ డైట్ మెను పాటిస్తూ, వండిన ప్రతి వంటకం రుచికరంగా వండాలని జిల్లా కలెక్టర్ కె హైమావతి అధికారులను ఆదేశించారు. సోమవారం సిద్దిపేట అర్బన్ మండలం రంగదాంపల్లి శివారులోని తెలంగాణ అల్పసంఖ్యాకుల బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మిక సందర్శించి మధ్యాహ్న భోజన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అన్నం, ఆలుగడ్డ టమాట, పప్పు, రసం, పెరుగు ల నాణ్యత ను పరీక్షిస్తూ పప్పు పలుచగా ఉందని అసహనం వ్యక్తం చేస్తూ మరొక సారి పునరావృతం కాకూడదని చేసిన ప్రతి వంటకం నాణ్యతగా రుచికరంగా ఉండాలని వంట సిబ్బందిని హెచ్చరించారు. కామన్ డైట్ మెనూలో భాగంగా పిల్లలకు గుడ్డు ఎందుకు పెట్టలేదని ఆరా తియ్యగా, రోజు సాయంత్ర భోజనంలో పెడతామని ప్రిన్సిపల్ కలెక్టర్ కి తెలపగా సాయంత్రం మెనులో తప్పనిసరిగా గుడ్డు, నెయ్యి తో భోజనం పెట్టాలని, కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలని అన్నారు. ప్రతి రోజు విద్యార్థుల హాజరు ప్రకారం ఫుడ్ కమిటీ సమక్షంలో సరుకులు అందిస్తూ, చేసిన ప్రతి వంటకం విద్యార్థులకు సరిపోయేలా ఉండాలని ప్రిన్సిపల్ ను ఆదేశించారు. అనంతరం స్టోర్ రూమ్ లో కూరగాయలు, బియ్యం, ఇతర వంట దినుసులను తనికి చేస్తూ అన్ని కూరగాయలు సక్రమంగా ఉన్నాయని చట్నీ సైతం చేసి విద్యార్థులకు పెట్టవచ్చని సూచించారు. వంట గది పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యం

★ బస్వాపూర్ సర్పంచ్ అక్బర్



**ములుగు,ఆగస్టు3(ప్రజాజ్యోతి)** అప్పుడే పుట్టిన శిశువుకు తల్లిపాలే ఆరోగ్యకరమని ఆరు నెలల వరకు ఆ బిడ్డకు తల్లిపాలే రక్షణగా ఉంటూ శక్తిని ఇస్తాయని కాబట్టి ప్రతి తల్లి పిల్లలకు తల్లిపాలు ఇవ్వడమే ఆరోగ్యకరమన్నారు బస్వాపూర్ సర్పంచ్ అక్బర్ తెలిపారు.సోమవారం బస్వాపురం అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బాబు,ఐసిడిఎస్ సూపర్వైజర్ రజిత,అంగన్వాడి టీచర్ పద్మ,గర్భిణీ స్త్రీలు,బాలింతలు పాల్గొన్నారు.

## చేనేత అభివృద్ధికి నూతన కృషి చేయాలి

★ దుద్దెడ పద్మశాలి చేనేత సహకార సంఘం సభ్యులకు ఘన సన్మానం

**కొండపాక, ఆగస్టు 3: (ప్రజాజ్యోతి ):-**చేనేత అనేది కేవలం వస్త్ర తయారీ వృత్తి మాత్రమే కాదని, అది భారతీయ సంస్కృతి, అస్తిత్వం, ప్రాచీన జ్ఞానానికి ప్రతీక అని శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షులు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు అన్నారు. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం దుద్దెడ గ్రామంలో నూతనంగా ఏర్పడిన పద్మశాలి చేనేత సహకార సంఘం కార్యవర్గ సభ్యులను సోమవారం శ్రీరామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ వడ్లకొండ శ్రీనివాస్, వైస్ చైర్మన్ గంగుల గణేష్, జనరల్ సెక్రటరీ లగిశెట్టి ఆంజనేయులు, ట్రెజరర్ బొజ్జ నరేందర్, జాయింట్ సెక్రటరీ పుల్గం కిష్టయ్యతో పాటు డైరెక్టర్లు వైద్యుల లక్ష్మీనారాయణ, రాజగిరి వీరేశం, బొజ్జ లలిత, గడ్డమీది సత్తవ్వలను శాలువాలతో సత్కరించి, సీతారాముల చిత్రపటం, రామకోటి పుస్తకాన్ని జ్ఞాపికలుగా అందజేశారు. ఈ సందర్భంగా రామకోటి రామరాజు మాట్లాడుతూ ప్రపంచానికి వస్త్రాలను పరిచయం చేసిన ఘనత భారతీయ చేనేత రంగానిదేనని, ఈ కళను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. నూతన కార్యవర్గం చేనేత కార్మికుల సంక్షేమం, సహకార సంఘం బలోపేతం, వృత్తి అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, చేనేత సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.



## 12వ వార్డులో ఓపెన్ జిమ్ పార్క్ అభివృద్ధికి శ్రీకారం

- ఐదు లక్షల నిధులతో పనులు ప్రారంభిస్తాం
- భూమి పూజ చేసిన చైర్పర్సన్ నిరజబాల్ రెడ్డి





**తాండూరు ఆగస్టు 3 ప్రజా జ్యోతి :** వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణం 12వ వార్డులోని పార్క్‌లో ఓపెన్ జిమ్‌ను విద్యార్థులు యువకుల సౌకర్యార్థం ఏర్పాటు చేయనున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ళ నీరజ బాల్రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా సోమవారం రోజు 12వ వార్డులోని పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు కావలసిన ఏర్పట్ల కోసం చైర్పర్సన్ భూమి పూజ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సహకారంతో 12వ వార్డులో రూ.5 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న ఓపెన్ జిమ్ పార్క్ అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి ప్రారంభించడం జరిగిందన్నారు. స్థానిక ప్రజల ఆరోగ్య పరిరక్షణ,విద్యార్థులు యువకులు అలాగే అన్ని వయసుల వారు కూడ వ్యాయామం చేసేలా ఓపెన్ జిమ్ పార్క్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. పట్టణ అభివృద్ధితో పాటు ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, తాండూర్ పట్టణ ప్రెసిడెంట్ నాగరాజు, మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మైసమ్మ తల్లి బోనాల్లో భక్తిశ్రద్ధల వెల్లువ

సాంప్రదాయబద్ధంగా బోనం ఎత్తుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కుడుముల రజిత వెంకటేష్





**పరిగి, ఆగష్టు 03 (ప్రజాజ్యోతి):** పరిగి పట్టణంలో ఆషాఢ మాసం సందర్భంగా సోమవారం నిర్వహించిన మైసమ్మ తల్లి బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన బోనాల ఊరేగింపు కార్యక్రమంలో పరిగి మున్సిపల్ చైర్‌పర్సన్ కుడుముల రజిత వెంకటేష్ పాల్గొని ప్రత్యేకంగా నిలిచారు. మైసమ్మ తల్లి పట్ల తన భక్తిని చాటుతూ ఆమె సాంప్రదాయబద్ధంగా బోనం నెత్తిన ఎత్తుకుని ఊరేగింపులో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో పాల్గొని పట్టణ ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాల కోసం ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పార్థసారథి పంతులు, మున్సిపల్ కౌన్సిలర్లు, ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాంప్రదాయ వాద్యాలు, భక్తిగీతాల నడుమ సాగిన బోనాల వేడుకలు ఆధ్యాత్మిక వాతావరణంలో వైభవంగా కొనసాగాయి.

## కొత్తూరుకు కొత్త కళ

- రూ.50 లక్షలతో మున్సిపాలిటీలో 53 ఐమాక్స్ లైట్లు ప్రారంభించిన
- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్





**కొత్తూర్ ఆగష్టు 03 (ప్రజా జ్యోతి) :** కొత్తూరు మున్సిపాలిటీకి కొత్త కళ వచ్చిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం కొత్తూర్ మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగంగా ఆయా వార్డుల పరిధిలోని తిమ్మాపూర్,స్టేషన్ తిమ్మాపూర్ అక్కివేనిగూడ, కుమ్మరిగూడ,కొత్తూరు, కొత్తూరు తండాలలో కొత్తగా ఏర్పాటు చేసిన ఐమాక్స్ లైట్లు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రధాన చౌరస్తాలు,రద్దీ ప్రాంతాలలో హైమాస్ట్ లైట్లు అందుబాటులోకి రావడంతో కాలనీలలో చీకటి సమస్యలు తొలిగిపోతాయని,రాత్రి వేళల్లో రాకపోకలు సాగించే ప్రజలకు మరియు వాహనదారులకు ఎంతో లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే తెలిపారు.కొత్తూర్ మున్సిపాలిటీలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని,ప్రజల అవసరాలకు అనుగుణంగా అన్ని వార్డుల్లోనూ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సాహితి రెడ్డి,సీఐ నాగార్జున రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జాండగూడెం సుదర్శన్ గౌడ్, మాజీ కౌన్సిలర్ కోస్గి శ్రీనివాస్, సర్పంచ్ కొమ్ము కృష్ణ,మాజీ ఎంపిటిసి రాజేందర్ గౌడ్,మాజీ సర్పంచులు ఏనుగు జనార్దన్ రెడ్డి,జగన్, నందిగామ మండల అధ్యక్షుడు కుమారస్వామి గౌడ్,మాజీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కర్రోళ్ల సురేందర్, సీనియర్ నాయకులు కమ్మరి జనార్దన్ చారి,ఇందారి శ్రీనివాస్,పీర్ల గూడెం మహేష్ గౌడ్,గోవిందు నాయక్,భరత్ గౌడ్, తుప్పర రమేష్,చింత సాయి తేజేశ్వర్,కోస్గి మహేష్,కోస్గి కుమార్,కూన శివ కుమార్ గౌడ్,కోస్గి బాలు,కోస్గి దశరథ్,చిలకమర్రి నరసింహ,పాశం కృష్ణ,వెంకటయ్య,జితేందర్ రెడ్డి,శివ, కొండ రెడ్డి సుమన్,తదితరులు పాల్గొన్నారు.

## ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడిగా వడ్ల సత్యనారాయణ



**చేవెళ్ల ఆగస్టు 03(ప్రజా జ్యోతి) :** తుక్కుగూడలో ఈ నెల 2న నిర్వహించిన ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా మహాసభల్లో వడ్ల సత్యనారాయణను జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహాసభలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 250 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వడ్ల సత్యనారాయణ మాట్లాడుతూ... తనపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల హక్కుల పరిరక్షణతో పాటు వలస కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తానని పేర్కొన్నారు. తన ఎన్నికకు సహకరించిన సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, కే. రామస్వామి, రాష్ట్ర నాయకత్వం, జిల్లా నాయకత్వంతో పాటు మహాసభలో పాల్గొన్న ప్రతినిధులందరికీ ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఈ నెల 9 నుంచి శ్రీ కాళిక దేవి మాత బోనాల ఉత్సవాలు





- రెండు రోజులపాటు జరిగే బోనాల ఉత్సవాలకు భక్తులు సహకరించాలి
- వివరాలు వెల్లడించిన దేవాదాయశాఖ అధికారి నరేందర్

**తాండూరు ఆగస్టు 3 ప్రజా జ్యోతి :** తాండూరు పట్టణంలోని శ్రీ కాళికా దేవి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి 10 వరకు బోనాల జాతర ఉత్సవాలు జరగనున్నట్లు దేవాదాయ శాఖ అధికారి నరేందర్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థానం నియమ నిబంధనల ప్రకారం జరపతలపెట్టిన విదంగా మొదటి రోజున నమస్తే లోకజనని నమస్తే శివవల్లబె! పాహిమాం భక్త వరదే కాళికాదేవియై నమః !!బోనాల జాతర మహోత్సవాలు ఈ నెల 9, 10 తేదీలలో జరపతలపెట్టిన మహోత్సవ వేడుకలకు అమ్మవారి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. 09 ఆగస్టు 2026 ఆదివారము రోజున ఉదయం 5 గంటలకు సుప్రభాతం,6 గంటలకు ఘటస్థాపన 7-05 నిముషాల నుండి భజనమండలి వారిచే కాగ్ననది నుండి జలము తెచ్చుట వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. తదుపరి 7-30 నిముషాలకు కాగ్ననది జలముతో అమ్మవారికి అభిషేకము ఉంటుందన్నారు.

అలాగే ఉదయం 11-05 నిముషాలకు అమ్మవారు గంగాపూజకు బయలుదేరుట మధ్యాహ్నం 12 గంటలకు అమ్మవారి బోనాలు ఉంటాయని చెప్పారు. మధ్యాహ్నం 01 గంటలకు ముదిరాజ్ సంఘం వారిచే అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. సాయంత్రం 4 గంటల 30 నిముషాలకు రంగం ఎక్కే కార్యక్రమం, పోతురాజు విన్యాసాలు కథాకాలక్షేపము వంటి కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు.

మరుసటి రోజున 10 ఆగస్టు 2026 సోమవారము ఉదయం 6 గంటలకు పూజాకార్యక్రమము, కుంకుమార్చన జరుగునని చెప్పారు. అలాగే ఉదయం 10 గంటల 05 నిముషాల నుండి శ్రీ లలితా సహస్రనామ పారాయణము ఉంటుందన్నారు. మధ్యాహ్నం 01 గంటలకు దేవస్థాన కిరాయిదారులచే అన్న ప్రసాద వితరణ ఉంటుందన్నారు. తదుపరి శ్రీ కాళిక దేవి అమ్మవారి ఉత్సవసేవ ఊరేగింపు కార్యక్రమం కొనసాగుతుంది అన్నారు. ఇట్టి కార్యక్రమానికి పట్టణ పెద్దలు, స్థానిక ప్రజలు, అర్చకులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

## మాజీ ఎమ్మెల్యే నారాయణరావుతో కంజర్ల విజయలక్ష్మి యాదవ్ భేటీ

- గంటపాటు కొనసాగిన సమావేశం..
- సేవా కార్యక్రమాలపై మాజీ ఎమ్మెల్యే ప్రశంసలు





**బషీరాబాద్, ఆగస్టు 3 (ప్రజా జ్యోతి) :** మాజీ ఎమ్మెల్యే నారాయణరావును కంజర్ల విజయలక్ష్మి యాదవ్ సోమవారం బషీరాబాద్ మండల కేంద్రంలో వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య దాదాపు గంటపాటు సమావేశం కొనసాగింది. సమావేశంలో కంజర్ల విజయలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలపై చర్చించారు. పట్నం నుంచి పల్లె వరకు చేరుకుని నిరుపేదలకు సేవలందించడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే నారాయణరావు ప్రశంసించారు. ముఖ్యంగా నిరుపేద మహిళల సంక్షేమం కోసం మరింత విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆయన సూచించారు. భవిష్యత్తులో విజయలక్ష్మి ఫౌండేషన్ చేపట్టే సేవా కార్యక్రమాలకు తన పూర్తి సహకారం, అండదండలు ఉంటాయని కంజర్ల విజయలక్ష్మి యాదవ్‌కు భరోసా ఇచ్చారు. సమాజ సేవలో ఇదే నిబద్ధతతో ముందుకుసాగాలని ఆకాంక్షించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే నారాయణరావును కంజర్ల విజయలక్ష్మి ఘనంగా శాలువా పూలమాలతో సన్మానించారు. మాజీ ఎమ్మెల్యే కంజర్ల విజవిజయలక్ష్మి నెత్తి మీద చేయి పెట్టి కంచర్ల విజయలక్ష్మి ఫౌండేషన్ ద్వారా ఇదేవిధంగా ముందుకు దూసుకు వెళ్లండని నేనున్నానని ఆశీర్వదించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు రోహిత్ మహారాజ్, అక్బర్ బాబా, బిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ దేవతల కరుణా కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలి







- గూడూరు సర్పంచ్ ఉప్పల దయానంద్ గుప్తా
- ముఖ్య అతిథులుగా హాజరైన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లారం శేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ అంబాటి ప్రభాకర్
- పోతురాజుల విన్యాసాలతో.. కళాకారుల ఆటపాటలతో మారుమోగిన గూడూర్ గ్రామం

**కొత్తూర్ ఆగస్ట్ 03 (ప్రజా జ్యోతి) :** గ్రామ దేవతలైన పోచమ్మ, మైసమ్మ కరుణ కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని గూడూర్ సర్పంచ్ ఉప్పల దయానంద్ గుప్తా అన్నారు. కొత్తూరు మండలంలోని గూడూరు గ్రామంలో సర్పంచ్ దయానంద్ గుప్తా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బోనాల పండుగ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లారం శేఖర్ రెడ్డి,మాజీ సర్పంచ్ అంబాటి ప్రభాకర్ హాజరై అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఈ ఊరేగింపులో పలు వేషధారణలతో కళాకారులు నృత్య ప్రదర్శనలు చేసి పోతురాజుల విన్యాసాలు, డప్పుల మేళంతో యువకులు చిందులు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ఎవరు కూడా మరువకూడాదన్నారు. గ్రామదేవతల ఆశీర్వాదంతోనే గ్రామాలు సుఖసంతోషాలు, పాడి పంటలతో బాగుంటాయని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు సిద్ది గౌడ్, ఉప సర్పంచ్ మీసాల ఆరోగ్యం, వార్డు సభ్యులు గట్టు లక్ష్మి చంద్రయ్య,వడ్ల శివ చారి, అరవింద్ గౌడ్,శ్రీదేవి దయానంద్,జ్ఞానేశ్వర్,మోడీ వినోద దర్శన్,మైలారం దేవేందర్,మీసాల స్వప్న సదానందం,నాయకులు కాసారం రాజు,మోడీ శేఖర్, కసారం దయాకర్,గుండు అనంతయ్య,సంపత్ కుమార్, కావాలి యాదయ్య, మధుసూదన్ రెడ్డి, మల్కాపురం మల్లేష్,వడ్డే హనుమంతు,ఎస్ డి సలీం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలే శిశువుకు తొలి టీకా.. తొలి ఆహారం



- చించోడు పీహెచ్‌సీలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమం

**షాద్ నగర్, ఆగస్టు 3 (ప్రజాజ్యోతి) :** శిశువుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లిపాలే తొలి టీకా, తొలి ఆహారమని చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ స్రవంతి అన్నారు. ఫరూక్ నగర్ మండలపరిధిలోని చొంచోడ్ గ్రామంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 1 నుంచి 7 వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తూ తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నామని తెలిపారు. పుట్టిన వెంటనే వచ్చే ముర్రుపాలు శిశువుకు సహజ రోగనిరోధక శక్తిని అందించే తొలి టీకా వంటివని, పుట్టిన మొదటి గంటలోనే తల్లిపాలు ప్రారంభించాలని సూచించారు. తొలి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ఈ కాలంలో నీరు లేదా ఇతర ఆహారం అవసరం లేదని చెప్పారు.

తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారమని, వాటివల్ల విరేచనాలు, న్యుమోనియా వంటి ఇన్ఫెక్షన్ల ప్రమాదం తగ్గడంతో పాటు మెదడు ఎదుగుదల, శారీరక, మానసిక అభివృద్ధి మెరుగుపడుతుందని వివరించారు. తల్లి--శిశువు మధ్య ప్రేమానుబంధం మరింత బలపడటానికి కూడా తల్లిపాలు దోహదపడతాయని పేర్కొన్నారు. అలాగే ప్రసవానంతరం గర్భాశయం సాధారణ స్థితికి చేరడం, రక్తస్రావం తగ్గడం, రొమ్ము మరియు అండాశయ క్యాన్సర్ల ప్రమాదం తగ్గడం వంటి ప్రయోజనాలు తల్లిపాలు ఇవ్వడం వల్ల కలుగుతాయని తెలిపారు.

ఐసీడీఎస్ సూపర్వైజర్ విజయలక్ష్మి మాట్లాడుతూ గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే బాలామృతం, గుడ్లు, ఇతర పోషకాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.

హెల్త్ సూపర్వైజర్ శ్రీరామ్ మాట్లాడుతూ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించడంతో పాటు చిన్నారులకు అన్ని వ్యాధి నిరోధక టీకాలను సమయానికి వేయించాలని సూచించారు. హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు మాట్లాడుతూ గర్భిణులు సమతుల్య పోషకాహారం తీసుకోవడం ద్వారా తల్లి, గర్భస్థ శిశువు ఆరోగ్యంగా ఉండటంతో పాటు ప్రసవ సమయంలో వచ్చే ఇబ్బందులను నివారించవచ్చని తెలిపారు.

కార్యక్రమంలో డాక్టర్ స్రవంతి, హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు, హెల్త్ సూపర్వైజర్ శ్రీరామ్, ఐసీడీఎస్ సూపర్వైజర్ విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ పుష్ప, ఏఎన్‌ఎంలు మధువాణి, లలిత, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

## కేర్ హాస్పిటల్స్‌లో ఆధునిక ఎంఐసీయూ ప్రారంభం

**హైదరాబాద్, ఆగష్ట్ 03 (ప్రజా జ్యోతి) :** కేర్ హాస్పిటల్స్ మలక్‌పేట్ లో అత్యాధునిక మెడికల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఎంఐసీయూ)ను ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలా చేతుల మీదుగా ప్రారంభించి నట్లు ఆస్టర్ డీఎం క్వాలిటీ కేర్ లిమిటెడ్ సీఈఓ(ఇండియా-2) డా.పవన్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ ఎంఐసీయూ ద్వారా 24 గంటల అత్యవసర క్రిటికల్ కేర్ సేవలను ఆధునిక సాంకేతికతతో అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజినల్ సీఈఓ నిలేష్ గుప్తా, సీఓఓ ప్రవీణ్ కుమార్ ఎడ్ల, కార్పొరేటర్ షేక్ మొహిను ద్దీన్ అబ్రార్, డా.శ్రీధర్, డా.వజ్రపు రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.




## జనగణన విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు హాజరు ధ్రువపత్రాల పంపిణీ

- ఉపాధ్యాయుల పారితోషికం త్వరలో బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని తహసీల్దార్ వెంకటేశ్వరి హామీ



**పరిగి, ఆగష్టు 03 (ప్రజాజ్యోతి):** జనగణన-2027 తొలి దశ గృహ జాబితా విధులను నిర్వహించిన ఉపాధ్యాయులకు పరిగి గ్రామీణ చార్జి అధికారి, మండల తహసీల్దార్ శ్రీమతి వెంకటేశ్వరి హాజరు ధ్రువపత్రాలను అందజేశారు. పిఆర్టియూ ఉపాధ్యాయ సంఘం పరిగి మండల శాఖ ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఆర్టియూ ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడు డి. బుగ్గయ్య, అధ్యక్షుడు ఎం.డి. ఉస్మాన్ అలీ, ప్రధాన కార్యదర్శి వి. రాకేష్‌లు తహసీల్దార్ వెంకటేశ్వరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో క్షేత్ర శిక్షకుడు రాజేష్ రాథోడ్, సంఘ కార్యవర్గ సభ్యులు జైపాల్ రెడ్డి, ఎన్.నర్సింలు, కె.శ్రీనివాస్, భీమయ్య, ఆర్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ వెంకటేశ్వరి మాట్లాడుతూ, జనగణన విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పారితోషికాన్ని త్వరలో వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు.

## వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలి

- సిడి తాండ సర్పంచ్ గబ్రు చౌహాన్
- కళాకారుల ఆటపాటలతో మారుమోగిన సిడితాండ
- అందరూ సంతోషంగా ఉండేలా దీవించమని అమ్మవారిని వేడుకోలు





**కొత్తూర్ ఆగష్టు 03 (ప్రజా జ్యోతి) :** వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని సిడి తాండ సర్పంచ్ గబ్రు చౌహాన్ అన్నారు. నందిగామ మండలం సిడి తాశీడ గ్రామంలో ఆదివారం దుర్గామాతకు (మెరమ్మా యాడి) బోనాల వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగించారు. సిడితండ సర్పంచ్ గబ్రుచౌహాన్ ఆధ్వర్యంలో మహిళల ఆటపాటలతో,డిజె సౌండ్ సిస్టం మధ్య,పోతురాజుల విన్యాసాల మధ్య, టపాకాయలు కాలుస్తూ ఘనంగా జరిగాయి. ఈ బోనాల వేడుకలతో తండాలో ఆధ్యాత్మికత వాతావరణం నెలకొంది. చిన్న, పెద్ద, ముసలి ముతక, వయోభేదం లేకుండా మహిళలు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ గబ్రు చౌహాన్ మాట్లాడుతూ.. ఏలినీవో ఎఫెక్ట్ ప్రభావం పడకుండా ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవాలని, రైతులు, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించేలా దీవించమని అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రవీందర్ నాయక్,వార్డు సభ్యులు బుజ్జి శంకర్ నాయక్,శాంతి శ్రీను,పాత్లావత్ శ్రీనునాయక్, మేఘవత్ నాగేష్, పత్తి శ్రీను, నాయకులు మూడావత్ తులసి రామ్, కిషన్ నాయక్, చందర్ నాయక్, లింబ్య నాయక్, రూపా సింగ్ ,శంకర్ నాయక్, హేమంత్ నాయక్,రాములు నాయక్,గోవింద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## కే.వి. స్కూల్‌లో 'అరైవ్ అలైవ్' ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం ఏసిపి శంకర్ రాజ్

**బోయిన్ పల్లి, ఆగష్టు 03 (ప్రజా జ్యోతి) :** మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి, ఐపీఎస్ ఆదేశాల మేరకు, ట్రాఫిక్-1 డీసీపీ కె.రాహుల్ రెడ్డి, ఐపీఎస్ పర్యవేక్షణలో "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా తిరుమలగిరి ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో కే.వి. స్కూల్, పికెట్ (మారేడ్ పల్లి)లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బందికి ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమలగిరి ట్రాఫిక్ ఏసీపీ జి.శంకర్ రాజు రోడ్డు భద్రత ప్రాముఖ్యత, ట్రాఫిక్ నిబంధనల పాటింపు, బాధ్యతాయుతమైన రహదారి వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, నాలుగు చక్రాల వాహనాల్లో సీటుబెల్ట్ వినియోగించాలని, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించాలని, వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్ ఉపయోగించకూడదని, మైనర్లతో వాహనాలు నడపించరాదని, లేన్ క్రమశిక్షణ పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని వివరించారు. కార్యక్రమంలో తిరుమలగిరి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఐ.వి. రమణయ్య, సబ్ ఇన్‌స్పెక్టర్లు, కే.వి. స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ ముకేష్, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ రోడ్డు భద్రతకు తమ వంతు సహకారం అందిస్తామని ప్రతిజ్ఞ చేశారు.



# ప్రజావాణికి 212 దరఖాస్తులు

## దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచొద్దు అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే

కరీంనగర్ బ్యూరో,ఆగస్టు 3 (ప్రజాజ్యోతి ): ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే



సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి,ఆర్డీవో షర్మిల, డీఆర్‌ఓ స్వామితో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా మొత్తం 212 దరఖాస్తులు అందగా, అత్యధికంగా కరీంనగర్ ఆర్డీవో కార్యాలయానికి 66, గృహ నిర్మాణ శాఖకు 44 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.ప్రజావాణి దరఖాస్తులు, కోర్టు కేసులు అనవసరంగా పెండింగ్‌లో ఉండకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం జరిగేలా ప్రతి శాఖ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

## తల్లిపాలతోనే శిశువుకు సంపూర్ణ ఆరోగ్యం

ఎండపల్లి,ఆగస్టు 3 ప్రజా జ్యోతి: తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహన కల్పించడంతో పాటు తల్లులు, చిన్నారుల్లో ఆనందాన్ని నింపేలా మండలంలోని గుల్లకోట రైతు వేదికలో సోమవారం



తల్లిపాల వారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు సంప్రదాయబద్ధంగా అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించగా.మహిళలకు గోరింటాకు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి హాజరైన పలువురు మాట్లాడుతూ,శిశువు జన్మించిన వెంటనే తల్లిపాలు అందించడం ఎంతో కీలకమని, తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం ద్వారా బిడ్డకు అవసరమైన పోషకాలు, వ్యాధి నిరోధక శక్తి లభిస్తాయని కార్యక్రమంలో అవగాహన కల్పించారు. తల్లిపాలపై అపోహలను వీడి ప్రతి తల్లి బిడ్డ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.గోరింటాకు కార్యక్రమంతో మహిళల్లో సందడి నెలకొంది. తల్లులు, చిన్నారులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు,ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేశం, సీడీపీ ఓ వాణిశ్రీ ఎంపీడీఓ కృపాకర్,సూపర్ వైజర్ ఆండాళ్,వైద్యురాలు రక్షిత ,పంచాయతీ కార్యదర్శి నవీన్ కుమార్, మండలంలోని అంగన్వాడి టీచర్లు,అలాగే ఆశా వర్కర్లు,తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నినోపై అప్రమత్తం.. జలసిరితో నీటి సంరక్షణ

కొడిమ్యాల,ఆగస్ట్ 03,(ప్రజాజ్యోతి): మండలంలోని రామకిష్టాపూర్,చింతలపల్లి గ్రామాల్లో సోమవారం ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు వరికి బదులుగా కంది, పెసర,



మినుము, మొక్కజొన్న వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని, అలాగే భూగర్భ జలాల సంరక్షణకు జలసిరి కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పొలానికి పంటకుంట, ప్రతి గ్రామానికి ఊటకుంట, బోర్‌వెల్ రీఛార్జ్ పనులు చేపట్టాలని ఎంపీడీఓ స్వరూప సూచించారు. సర్పంచులు నెరెళ్ల మహేష్,సుమలత, పంచాయతీ కార్యదర్శులు, వార్డు సభ్యులు, క్షేత్రస్థాయి సిబ్బంది, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మోహన్‌రావుపేటలో ఘనంగా బాల సభ

కోరుట్ల రూరల్, జూలై 3, (ప్రజా జ్యోతి): మోహన్‌రావుపేట గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో సోమవారం ఘనంగా బాల సభ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ సమస్యలు, అవసరాలు,



పాఠశాల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను సభ దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు,బాధ్యతాయుతమైన పౌరసత్వం, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన పెంపొందించడంలో బాల సభ కీలక పాత్ర పోషిస్తుందని వక్తలు పేర్కొన్నారు.అనంతరం గ్రామ సర్పంచ్ సరికెళ్ళ లతిక నరేష్ విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, భోజనం నాణ్యత, పరిశుభ్రతపై ఆరా తీశారు. విద్యార్థులకు ఎల్లప్పుడూ నాణ్యమైన, పౌష్టికాహారం అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ సరికెళ్ళ లతిక నరేష్, ఉప సర్పంచ్ జాన వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి నర్సారెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఆనందరావు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజాప్రతినిధులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నూతన పోలీస్ అసోసియేషన్ కార్యవర్గానికి ఎస్పీ అశోక్ కుమార్ శుభాకాంక్షలు

జగిత్యాల టౌన్, ఆగస్టు 3 (ప్రజా జ్యోతి): జగిత్యాల జిల్లా పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నికల్లో విజయం సాధించిన నూతన కార్యవర్గ సభ్యులు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఐపీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు జీవన్ రాజ్, ఉపాధ్యక్షులు ఆరిఫ్ అలీ ఖాన్, శ్రీకాంత్, కార్యదర్శి కిరణ్ కుమార్, జాయింట్ సెక్రటరీ కేశవేని సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి. మల్లేశం, ట్రెజరర్ మాటి రమేష్‌తో పాటు ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులను ఎస్పీ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ కేవలం ఒక సంఘంగా కాకుండా పోలీసు అధికారుల సంక్షేమం, పరస్పర సహకారం, వృత్తిపరమైన అభివృద్ధి, సేవా నిబద్ధతను మరింత బలోపేతం చేసే వేదికగా నిలవాలని ఆకాంక్షించారు. అధికారులు, సిబ్బంది ఎదుర్కొనే సమస్యలను బాధ్యతాయుతంగా గుర్తించి వాటి పరిష్కారానికి సమన్వయంతో కృషి చేయాలని, జిల్లా పోలీసు శాఖ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేలా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. అసోసియేషన్ ప్రతినిధులు ఎస్పీకి కృతజ్ఞతలు తెలియజేస్తూ, జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తామని, పోలీసు శాఖ గౌరవాన్ని మరింత పెంచేలా తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తామని తెలిపారు. ఈ



కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్, ఐపీఎస్, యూనిట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు అనుగుల మహేష్, ఎ. రాజేశ్వర్, కొలగాని జలపతి, డి. సౌందర్య, కొలుగాని మల్లేశం, గోశెట్టి విద్యానాథ్ మరియు జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

## ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్దపల్లిలో రాస్తారోకో

పెద్దపల్లి, ప్రతినిధి ఆగస్టు 3 ప్రజా జ్యోతి: ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేసి, పేద విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) పెద్దపల్లి శాఖ ఆధ్వర్యంలో



సోమవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు మారం సందీప్, జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 20 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లపై ఆధారపడి ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో రూ.12 వేల కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయని ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రతి ఏడాది లక్షలాది మంది విద్యార్థులు చదువులు మధ్యలోనే మానేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని, వేలాది మంది విద్యార్థులు ఫీజులు చెల్లించలేక విద్యా ధ్రువపత్రాలు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో విద్యావకాశాలు తగ్గిపోవడంతో పలువురు విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నదని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలన్నీ చెల్లించి, గ్రీన్ ఛానల్ ద్వారా ప్రతి నెల ఫీజులు విడుదల చేస్తామని హామీ ఇచ్చిందని, అయితే ఇప్పటి వరకు ఆ హామీ అమలు కాలేదని విమర్శించారు. ఈ అంశం న్యాయస్థానం దృష్టికి కూడా వెళ్లిందని పేర్కొన్నారు. ప్రభుత్వం, ప్రైవేట్ కళాశాలల వైఖరి వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అనేక విద్యాసంస్థలు ఆర్థిక సంక్షోభంలో ఉన్నాయని, ఉపాధి కోసం లెక్చరర్లుగా పనిచేస్తున్న నిరుద్యోగులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విద్యార్థుల హక్కులని, వాటిని ఆలస్యం చేయడం తగదని స్పష్టం చేశారు. విద్యార్థుల సమస్యలపై నిరసన వ్యక్తం చేస్తే లాఠీచార్జీలు, అక్రమ కేసులతో అణచివేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అలాగే పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బాలికల జూనియర్ కళాశాల భవన నిర్మాణాన్ని తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఎస్ రాష్ట్ర కన్వీనర్ ఓమేష్, నగర కార్యదర్శి అరవింద్, నగర ఉపాధ్యక్షుడు విఘ్నేష్, నాయకులు సిద్దార్థ్, శివ, దినేష్, కార్తీక్, శైలజ, మౌనికతో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

# బంధనకల్ గ్రామంలో మహిళా గ్రామసభ నిర్వహణ

ముస్తాబాద్, ఆగస్టు 3 ( ప్రజా జ్యోతి ): రాజన్న సిరిసిల్ల జిల్లా, ముస్తాబాద్ మండలం, బంధనకల్ గ్రామంలో మహిళా గ్రామసభను ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్, ముస్తాబాద్ మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు చిగురు నరేష్ అధ్యక్షతన జరిగిన ఈ గ్రామసభలో గ్రామ కార్యదర్శి నవ్య , వార్డు సభ్యులు వెంకట్‌రెడ్డి, యాదగిరి గౌడ్, సీఏలు, ఏఎన్ఎం ప్రమీల, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళా సంఘాల నాయకులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ చిగురు నరేష్ మాట్లాడుతూ మహిళల అభ్యున్నతే గ్రామాభివృద్ధికి పునాది అని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల గురించి వివరంగా తెలియజేశారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహార పథకాలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లభించే సేవలు, మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, రుణ సౌకర్యాలు మరియు ఇతర సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. అలాగే స్వయం సహాయక సంఘాల ద్వారా అందిస్తున్న సున్నా శాతం వడ్డీ రుణాలను ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆ రుణాలను ఉపాధి, స్వయం ఉపాధి కార్యక్రమాలకు వినియోగించి ఆర్థికంగా బలోపేతం కావాలని, ప్రతి మహిళ తన సొంత కాళ్లపై నిలబడి కుటుంబంతో పాటు గ్రామాభివృద్ధిలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. గ్రామసభలో మహిళలు తమ



సమస్యలు, అవసరాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, సంబంధిత అధికారులు వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మహిళా సాధికారత, ఆరోగ్యం, ఉపాధి, సంక్షేమ పథకాల అమలుపై గ్రామస్థులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తూ సమావేశం విజయవంతంగా ముగిసింది.

# బిఆర్ఎస్ వి ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో

గంభీరావుపేట ఆగస్టు 3 (ప్రజా జ్యోతి); గంభీరావుపేట మండల కేంద్రంలో సోమవారం బి ఆర్ ఎస్ వి



ఆధ్వర్యంలో సోమవారం ధర్నా రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థులకు ఇచ్చిన హామీలను నెరవేర్చతమని రేవంత్ రెడ్డి అన్నారు ఇప్పటివరకు మూడు సంవత్సరాలు గడిచిపోతున్న రాష్ట్రంలో రియంబర్స్మెంట్స్ , స్కాలర్షిప్స్ విడుదల చేయలేకపోవడం సిగ్గుచేటు రాష్ట్రంలో నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని యూత్ డిక్లరేషన్ ప్రకటిస్తామని మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి ఈరోజు రాష్ట్రంలో విద్యార్థి నిరుద్యోగలను పక్కనబెట్టి ఢిల్లీ పాలన తెలంగాణ రాష్ట్రంలో కొనసాగిస్తుండు అని, గంభీరావుపేట మండల కేంద్రంలో కేజీ టు పీజీ ముందర సోమవారం విద్యార్థి నాయకులు ధర్నా రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వి నాయకులు మాట్లాడుతూ, కేంద్రంలో విద్యార్థి జీవితాలతో చెలగాటమాడుతున్న రేవంత్ రెడ్డి వెంటనే విద్యార్థి నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నాము ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రశాంత్, అజ్మత్, అర్జున్, దేవేందర్, శంకర్, ముస్తఫా, తో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

# తల్లిపాలు బిడ్డకు అమూల్యమైన వరం

గంభీరావుపేట ఆగస్టు 3 (ప్రజా జ్యోతి): ప్రతి సంవత్సరం ఆగస్టు నెలలో ఒకటవ తేదీ నుండి 7వ తేదీ వరకు జరిగే ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా



సోమవారం గంభీరావుపేట మండలంలోని నాగంపేట, గోరంటాల గ్రామపంచాయతీలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఇట్టి కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ మద్దుల రాజిరెడ్డి పాల్గొని కార్యక్రమంలో తల్లులను ఉద్దేశించి ఇప్పటి బాలురే రేపటి భావి పౌరులు కావున అధికారులు చెప్పిన సూచనలు పాటించి బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు, 6 నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని అలాగే అంగన్వాడి కేంద్రాలలో ఇచ్చే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలనీ అన్నారు. కార్యక్రమంలో భాగంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ జి కళావతి తల్లిపాల ప్రాముఖ్యత గురించి తల్లిపాల వలన కలిగే లాభాలు తల్లిపాలు ఇవ్వకుండా పోత పాలు పట్టడం వలన కలిగే నష్టాల గురించి తల్లుల ఉద్దేశించి చెప్పడం జరిగింది బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు పట్టాలని పాలు త్రాగడం వలన రాబోయే రోజుల్లో ఎలాంటి వ్యాధి బారిన పడకుండా కాపాడుతుందని బిడ్డ పుట్టిన వెంటనే పాలు పట్టడం రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ జి. కళావతి ఏఎన్ఎంజ్యోతి, ,అంగన్వాడీ టీచర్స్, ఆశాలు మరియు తల్లులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఫీజుల బకాయీలపై బీజేపీ లడాయి

కోరుట్ల, ఆగస్టు 3 (ప్రజా జ్యోతి) రాష్ట్ర శాఖపిలుపు మేరకు భారతీయజనతా పార్టీ యువమోర్చా ఆధ్వర్యంలో ఫీజుల బకాయి–బీజేపీ లడాయి కార్యక్రమాన్ని సోమవారం కోరుట్ల పట్టణంలోని వివిధ కళాశాలల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేవైఎం కోరుట్ల పట్టణ అధ్యక్షుడు దమ్మ సంతోష్ రెడ్డి, కోరుట్ల మండల అధ్యక్షుడు వెంకట్ రెడ్డి రాజు నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో



ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను విడుదల చేయకపోవడంతో లక్షలాది మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ కోరుట్ల పట్టణంలోని వివిధ కళాశాలల్లో విద్యార్థుల నుంచి వినతిపత్రాలు సేకరించారు.సేకరించిన వినతిపత్రాలను మంగళవారం ర్యాలీగా వెళ్లి ఆర్డీవోకు అందజేయనున్నట్లు బీజేవైఎం నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ కోరుట్ల పట్టణ అధ్యక్షుడు కస్తూరి లక్ష్మీనారాయణ, ఎండోమెంట్ జిల్లా కన్వీనర్ మాడవేణి నరేష్, పట్టణ ప్రధాన కార్యదర్శులు చెట్లపల్లి సాగర్, ఎర్ర రాజేందర్, మ్యకల గణేష్, ఉపాధ్యక్షుడు కైరంకొండ రాజ గంగాధర్, కార్యదర్శులు చెట్పల్లి ఓం ప్రకాష్, చిట్యాల రాజేంద్రకుమార్, బాల్క ప్రేమ్ సాగర్, బీజేవైఎం నాయకులు దామ శ్రావణ్, తైడాల ప్రశాంత్, వాసం లోకేష్, కొండ నవీన్, కొక్కుల బలరాం, ఆల్లె రాజేందర్, పందిళ్ల లోకేష్, గుద్దేటి మనోజ్, బైరి రాహుల్, మిట్టపల్లి వెంకట సాయి, ఏలేటి రాజు తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాలలో 6న ఐసీఐసీఐ బ్యాంక్ ఉద్యోగాల మేళా

జగిత్యాల టౌన్, ఆగస్టు 3 (ప్రజా జ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 6న ప్రత్యేక ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో ప్రముఖ ఐసీఐసీఐ బ్యాంక్‌లో ఖాళీగా ఉన్న 'రిలేషన్‌షిప్ మేనేజర్, కాసా,క్రెడిట్ కార్డ్స్, లోన్స్' పోస్టుల భర్తీకి ఈ ప్రక్రియ చేపట్టనున్నారు. ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై, 2024, 2025, 2026 సంవత్సరాల్లో పాసైన పురుష అభ్యర్థులు మాత్రమే ఈ ఉద్యోగాలకు అర్హులు. ఎంపికైన వారికి ఏడాదికి రూ. 3.5 లక్షల నుండి రూ. 3.7 లక్షల వరకు (ఎల్ పి ఏ) జీతం ఉంటుందని, తెలంగాణ వ్యాప్తంగా ఎక్కడైనా విధులు నిర్వహించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 6వ తేదీన గురువారం ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల లోపు తమ రెజ్యూమే, ఎస్ఎస్‌సీ, డిగ్రీ మార్క్స్ మెమోలు, కుల ధ్రువీకరణ పత్రం, బోనఫైడ్స్, ఆధార్ కార్డులతో నేరుగా హాజరుకావాలి. జగిత్యాల జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని రూమ్ నెంబర్ 217 (రెండవ అంతస్తు)లో ఉన్న జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని జిల్లా ఉపాధి కల్పన అధికారి బి. సత్యమ్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## రాచర్ల బొప్పాపూర్ పాఠశాలలో ప్లాంటేషన్ డే..

### పర్యావరణ పరిరక్షణ బాధ్యత విద్యార్థులది

ఎల్లారెడ్డిపేట ఆగస్టు 3( ప్రజా జ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ పీఎంశ్రీ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయుల చే పాఠశాల "ప్లాంటేషన్ డే" చెట్లు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కృష్ణారెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ బాధ్యత విద్యార్థులది, సామాజం ,తల్లిదండ్రులని గుర్తు చేశారు. పాఠశాలల్లో ఆవరణంలో వివిధ రకాల పండ్ల మొక్కలను విద్యార్థులు నాటారు. చెట్లు నాటడం వలన మనకు ప్రాణవాయువును అందిస్తాయని మనము చెట్లపైనే ఆధారపడతాం కాబట్టి చెట్లను పెంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని ప్రధానోపాధ్యాయులకు కృష్ణారెడ్డి పూర్తి చేశారు .ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవసాయ పాఠ్య ఇన్స్పెక్టర్ సంగీత మాట్లాడుతూ పర్యావరణంలో కీలక బాధ్యత విద్యార్థులు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి ,సదానందం ,రామనోహర్, బాలయ్య ,భరత్ ,రమేష్ ,రవీందర్ ,భాస్కర్ రెడ్డి , ,అక్బరుద్దీన్ ,మంజుల, విజయ ,మహేశ్వరి, బాబు ,చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## జావలింగ త్రో పోటీలో బొప్పాపూర్ విద్యార్థులు జిల్లా స్థాయి ప్రతిభ

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 3, ప్రజా జ్యోతి: ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల బొప్పాపూర్ గ్రామ ప్రభుత్వ పియంసి పాఠశాలలో విద్యార్థులు జావలింగ డే సందర్భంగా జిల్లాస్థాయిలో అత్యధిక ప్రతిభ కణ పరిచిన ఎస్కే నిహాల్ అండర్ 14 9th క్లాస్ ఫస్ట్ మెడల్, బి వినయ్



అండర్ 16 నైన్త్ క్లాస్ ప్రశంసా పత్రం మెడల్ మనోహర్ అండర్ 14 నైన్త్ క్లాస్ సెకండ్ ప్రైస్ మెడల్ ,పి హేమంత్ అండర్ 14 200 మీటర్ ఫస్ట్ మెడల్ గెలుపొందారు వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిష్టారెడ్డి, పి ఈ టి అక్బరుద్దీన్, సదానందం ,బాలయ్య, భాస్కర్ రెడ్డి, రా మనోహర్ ,రమేష్ భరత్ , రవీందర్, మంజుల, విజయ, సంధ్యా రాణి, మహేశ్వరి ,రాణి ,చంద్రయ్య ,ఉపేందర్ ,బాబు ,తదితరులు అభినందించారు.

## ఏకలవ్య సంఘం గుడికి భూమి కేటాయించండి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 3 (ప్రజా జ్యోతి ): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో సోమవారం రోజు మండల తాసిల్దార్ కార్యాలయంలో ఎరుకల ఏకలవ్య సంఘం సభ్యులు తమకు కుల దేవత అయిన



తువంటి నాంచారమ్మ గుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించుట కొరకు భూమిని కేటాయించమని స్థానిక తహసిల్దార్ సుజాత కు విజ్ఞప్తి చేశారు .ఈ కార్యక్రమంలో ఎరుకల ఏకలవ్య సంఘం అధ్యక్షుడు, సభ్యులు కోనేటి బిక్షపతి , రవీందర్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ముర్రుపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం: మహాలక్ష్మి

● ఘనంగా తల్లిపాల వారోత్సవాలు సూపర్వైజర్ మహాలక్ష్మి

**సత్తుపల్లి ఆగస్టు03(ప్రజా జ్యోతి)** ముర్రుపాల తోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని అంగన్వాడి సూపర్వైజర్ మహాలక్ష్మి అన్నారు. సోమవారం పట్టణంలోని అయ్యగారి పేట..3 అంగన్వాడి సెంటర్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల వారోత్సవాలపై అవగాహన ర్యాలీ చేసినారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలు తాగించడం వల్ల బిడ్డకు వ్యాధి నిరోధక టీకా లాగా





పనిచేస్తుందని, ఈ ముర్రుపాలు వలన వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, బిడ్డ అభివృద్ధికి దోహదపడుతుందని, 6 నెలల వరకు తల్లిపాలు తాగించాలని తెలియజేశారు. ఆరు నెలల్లోపు వేరే పానీయాలు తాగించితే శ్వాసకోశ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని,తల్లులకు వివరించారు. తల్లి బిడ్డకు పాలు ఇవ్వటం వలన తల్లికి కూడా చాలా లాభాలు చేకూరతాయని, తల్లికి మానసిక ఒత్తిడి తగ్గుతుందని, గర్భాశయ క్యాన్సర్,రొమ్ము క్యాన్సర్ వచ్చే ప్రమాదాలు నివారించవచ్చని తెలిపినారు. అనంతరం అంగన్వాడి సెంటర్లో పిల్లలు వయసుకు తగ్గ బరువు ఉండాలని, చిన్నారులను బరువులు చూసినారు. తల్లిపాలు వలన ఎదుగుదల ఇబ్బంది ఉండదని, ప్రతి ఒక్కరూ తెలుసుకొని బిడ్డకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ వి శారారాణి,అంగన్వాడి టీచర్లు కమల, రహీం తున్నీస, స్వాతి, ఆశలు సుజాత, తల్లులు, చిన్నారులు, ఆయాలు, పిల్లలు పాల్గొన్నారు.

## తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం: సిడిపిఓ సత్యావతి

**సత్తుపల్లి ఆగస్టు03(ప్రజా జ్యోతి)** తల్లిపాలతో బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంచుతాయని, తల్లిపాలు పోషక విలువలు కలిగిన అమృతమని సిడిపిఓ సత్యవతి అన్నారు. సోమవారం మండల పరిధిలోని కిష్టారం గ్రామంలో సూపర్వైజర్ రజిని ఆధ్వర్యంలో నిర్వహించిన, తల్లిపాల వారోత్సవాలలో సిడిపిఓ సత్యవతి హాజరైనారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీగా గుర్తించిన దగ్గర్నుంచి, పోషక విలువలు కలిగిన ఆహారము, వ్యాధి నిరోధక టీకాలు , తప్పనిసరిగా తీసుకోవాలని, పుట్టబోయే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటాడని, సుఖ ప్రసవం అవుతారని అన్నారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా గర్భిణీలు ,బాలింతలు, చిన్నారులకు అంగన్వాడి కేంద్రాల ద్వారా అందించే పోషక విలువలు కలిగిన ఆహారం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలు పట్టించాలని, దీని ద్వారా బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుదల కనిపిస్తుంది, ఆరు నెలల వరకు పాలు పట్టించాలని తల్లులకు వివరించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్





నరకళ్ళ రాజేశ్వరి, ఏఎన్ఎం ఇషరత్ బేగం, ఎం ఎల్ హెచ్ పి, ప్రసన్న, అంగన్వాడి టీచర్లు ,ఆశ వర్కర్లు,తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

## పిసా మొగలైజర్ల అడ్రస్ ఎక్కడ

● వారు ఉన్నట్టా లేనట్టా ● ఏజెన్సీ గ్రామపంచాయతీలో వారే కీలకం
● అయినా వారు కనబడరు ● అధికారులు పట్టించుకోరు

**కామేపల్లి ప్రజాజ్యోతి ఆగస్టు 3** ఏజెన్సీ గ్రామపంచాయతీలో కీలక వీధులు నిర్వహించాల్సిన ఈసా మొగలైజర్లు అడ్రస్ లేకుండా పోయారు వారు కనబడరు అధికారులు పట్టించుకోరు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఏజెన్సీ గ్రామాల్లో నివసిస్తున్న గిరిజనులకు అవగాహన కల్పించడానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలే అందించాలని ఉద్దేశంతో పీసా మొబలైజర్లను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది ఏజెన్సీలోని ప్రతి గ్రామపంచాయతీకి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒక్కొక్కరిని నియమించారు వీరు గ్రామపంచాయతీలో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించి గ్రామసభలకు గిరిజనులను హాజరయ్యేటట్లు చూడాలి గ్రామ సభలను బలోపేతం చేయడానికి సభలు సమావేశాలు ఏర్పాటు చేయడం ఉపాధి హామీ పథకం గిరిజన సంక్షేమ పథకాల గ్రామసభల ద్వారా జరిగేటట్లు చూసి గిరిజనులకు అవగాహన కల్పించడం మొదలైజర్ల బాధ్యత భూమి అటవీ హక్కులు గిరిజనులు ఇతర సమస్యలను గ్రామసభలో చర్చించి అనుమతులు తీసుకోవడం గ్రామాల్లో ఎస్ ఎస్ జి వాటర్ కమిటీలు స్కూల్ కమిటీలను గ్రామసభ ఆధీనంలో తేవడం వీరి ప్రధాన బాధ్యత ఇంతటి తెలిపారు ఈ గ్రామపంచాయతీలో ఉన్న ఈసా మొగలైజర్లు



కనీసం ఆయా గ్రామపంచాయతీలు నిర్వహించే గ్రామ సభలో సర్పంచులు అధికారుల కంటికి కనిపించడం లేదు వారిని గైడ్ చేయాల్సిన అధికారులు మొద్దు నిద్రలో ఉన్నారు ఇళ్ల వద్ద కూర్చొని మొబలైజర్లు జీవితాలు తీసుకున్నట్లుగా తెలుస్తుంది దీనిపై మండల పంచాయతీ అధికారి వివిఎస్ శాస్త్రిని వివరణ కోరగా తన దృష్టికి వచ్చిందని గ్రామపంచాయతీలో ప్రతిరోజు వారు హాజరయ్యేటట్లు చర్యలు తీసుకుంటామని ఉల్లగించిన వారికి షోకేస్ నోటీసులు జారీ చేస్తామని తెలిపారు మీరు మండల పంచాయతీ అధికారిగా బాధ్యతలు తీసుకున్న 5 నెలల తర్వాత వారిపై తీసుకున్న చర్యల గురించి ప్రశ్నించగా ఇప్పుడు చర్యలు తీసుకుంటామని చెప్పడం కోసం మెరుపు.

## గంజాయి రవాణా కేసులో ఇద్దరికి జైలు శిక్ష

● ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష
● రూ.25 వేల చొప్పున జరిమానా విధించిన కొత్తగూడెం కోర్టు

**బూర్గంపహాడ్, ఆగస్టు 3 (ప్రజా జ్యోతి):** బూర్గంపహాడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2020లో నమోదైన గంజాయి అక్రమ రవాణా కేసులో ఇద్దరు నిందితులకు కొత్తగూడెంలోని మొదటి అదనపు జిల్లా ఌ సెషన్స్ కోర్టు ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.25 వేల చొప్పున జరిమానా విధిస్తూ సోమవారం జిల్లా మొదటి అదనపు జిల్లా ఌ సెషన్స్ న్యాయమూర్తి శ్రీమతి ఎస్. సరిత ఈ మేరకు తీర్పును ప్రకటించారు.కేసు వివరాల ప్రకారం, 2020 మార్చి 22న భారత్ బంద్ సందర్భంగా బూర్గంపహాడ్ పోలీస్ స్టేషన్‌కు చెందిన అప్పటి సబ్‌ఇన్‌స్పెక్టర్ బి. బాలకృష్ణ తన సిబ్బందితో కలిసి సారపాక బస్‌స్టాప్ సెంటర్ సమీపంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో హోండా స్కూటీపై అనుమానాస్పదంగా ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఆపి తనిఖీ చేయగా, వారి వద్ద నుంచి సుమారు 20 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.విచారణలో నిందితులు మహబూబాబాద్ జిల్లా మరిపెడ బంగ్లా గ్రామానికి చెందిన బీమనపల్లి శ్రీనివాసులు, రావిరాల లక్ష్మీనారాయణగా గుర్తించారు. అనంతరం బూర్గంపహాడ్ పోలీస్ స్టేషన్‌లో ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేశారు. అప్పటి ఏఎస్‌ఐ కె. సోమేశ్వరరావు కేసు నమోదు చేయగా, అప్పటి సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు పి. నవీన్, టి. సత్యనారాయణ దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు.విచారణ సందర్భంగా ప్రాసిక్యూషన్ సమర్పించిన ఆధారాలు, సాక్ష్యాలను కోర్టు పరిశీలించింది. మొత్తం ఏడుగురు సాక్షులను విచారించిన అనంతరం నిందితులపై నేరం రుజువైనట్లు కోర్టు నిర్ధారించింది. దీంతో ఇద్దరు నిందితులకు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించడంతో పాటు రూ.25 వేల చొప్పున జరిమానా చెల్లించాలని ఆదేశించింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనపు జైలు శిక్ష అనుభవించాలని కోర్టు పేర్కొంది.ఈ కేసులో ప్రభుత్వ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి. ఫణికుమార్ సమర్థవంతంగా వాదనలు వినిపించారు. కేసు విచారణను విజయవంతంగా పూర్తి చేయడంలో కోర్టు నోడల్ అధికారి డి. రాఘవయ్య, కోర్టు లైజాన్ అధికారి ఎస్. వీరభద్రం, కోర్టు డ్యూటీ ఆఫీసర్ పీసీ అక్రమ్ సమన్వయంతో కీలకంగా వ్యవహరించినట్లు పోలీసులు తెలిపారు. గంజాయి వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై పోలీసులు కఠిన చర్యలు కొనసాగిస్తున్న నేపథ్యంలో ఈ తీర్పు నేరస్తులకు హెచ్చరికగా నిలుస్తుందని అధికారులు పేర్కొన్నారు.

### ఖమ్మం జిల్లా బీజేపీ మహిళా మోర్చా

## ఆధ్వర్యంలో ఘనంగా గోరింటాకు సంబరాలు

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** సోమవారం ఖమ్మం జిల్లా బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు మందా సరస్వతి ఆధ్వర్యంలో గోరింటాకు సంబరాలు సాంప్రదాయబద్ధంగా, ఎంతో ఘనంగా నిర్వహించబడ్డాయి. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా భావించే గోరింటాకు ప్రతి శుభకార్యంలో ముఖ్యమైన స్థానాన్ని కలిగి ఉంది. వివాహిత మహిళలు గోరింటాకు ధరిస్తే భర్తకు ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు కలుగుతాయని, అవివాహిత యువతులు గోరింటాకు పెట్టుకుంటే మంచి వరుడు లభిస్తాడనే విశ్వాసం మన భారతీయ సంప్రదాయంలో ఉంది. ఈ విలువలను చాటి చెప్పే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నెల్లూరి శోభారాణి విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అలాగే మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పమ్మి అనిత , మాజీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి విజయ రెడ్డి,మాజీ రాష్ట్ర గిరిజన మోర్చా అధికార ప్రతినిధి



దొడ్డ అరుణ, శ్రీరాంనేని మణి, రజిని రెడ్డి, నీలిమ, నాగమణి, స్వర్ణ ,అంజలి,రాష్ట్ర, జిల్లా, మండల మహిళా మోర్చా నాయకురాళ్లు మరియు పలువురు కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

### అంగన్‌వాడీల్లో

## తల్లిపాల వారోత్సవాలు

**చర్ల, ఆగస్టు 03:(ప్రజా జ్యోతి):** చర్ల ప్రాజెక్టు పరిధిలోని రాళ్లగూడెం, కత్తిగూడెం అంగన్‌వాడీ కేంద్రాలలో సోమవారం ప్రపంచ తల్లిపాల





వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో హాజరైన గర్భిణీలు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యత, ముర్రుపాల ఆవశ్యకత, శిశువు జననం నుంచి తొలి వెయ్యి రోజుల ప్రాముఖ్యతపై సీడీపీఓ రేవతి అవగాహన కల్పించారు.తల్లిపాలు శిశువు ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు ఎంతో కీలకమని పుట్టిన వెంటనే ముర్రుపాలను తప్పనిసరిగా ఇవ్వాలని తొలి వెయ్యి రోజుల్లో సరైన పోషకాహారం సంరక్షణతో పిల్లల శారీరక మానసిక వికాసం మెరుగుపడుతుందని ఆమె వివరించారు.ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్లు ఆదిలక్ష్మి, స్వరూపరాణి, పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ నాగరాజు, అంగన్‌వాడీ టీచర్ అంజమ్మ, పలువురు తల్లులు పాల్గొన్నారు.

## ప్రజావాణి వినతుల పరిష్కారంలో జాప్యానికి తావివ్వొద్దు

● ప్రతి దరఖాస్తును గడువులోగా పరిష్కరించాలి ● జిల్లా కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 3,(ప్రజా జ్యోతి)** సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులు, ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ అంకిత్ అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, డిఆర్ఓ పద్మావతి లతో కలసి స్వీకరించారు. భూ సంబంధిత వివాదాలు, రెవెన్యూ అంశాలు, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి, పెన్షన్లు, గృహాలు, మౌలిక వసతులు, పలు సమస్యలను ప్రజలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమం ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రభుత్వం కల్పించిన కీలక వేదిక అని అన్నారు. ప్రజల నుంచి అందిన ప్రతి దరఖాస్తును పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి ఎలాంటి అవకాశం ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య స్వభావాన్ని బట్టి సంబంధిత శాఖలకు వెంటనే పంపించి, గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తక్షణమే పరిష్కరించగల అంశాలను ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలని, క్లిష్టమైన సమస్యలపై నిరంతర పర్యవేక్షణతో బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

**ప్రజావాణిలో స్వీకరించిన కొన్ని వినతులు**

పాల్వంచ మండలం ఉల్వనూరు గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తూరు గ్రామానికి చెందిన గ్రామస్థులు తమ గ్రామంలోని పాత ప్రాథమిక పాఠశాల భవనం





శిథిలావస్థకు చేరుకుని ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని, దానిని వెంటనే తొలగించి నూతన పాఠశాల భవనానికి ప్రహరీ గోడ మంజూరు చేయాలని కోరారు. అలాగే పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు మొత్తం 52 మంది విద్యార్థులు ఉండగా ఒకే తరగతి గది ఉండటంతో బోధనలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అదనపు తరగతి గదులు మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. దీనిపై జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులతో పరిశీలింపజేసి తగిన చర్యలు చేపట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారికి ఎండార్స్ చేశారు. అన్నపురెడ్డిపల్లి మండలం పెంట్లం గ్రామంలోని కురుమబజార్ కాలనీకి చెందిన ప్రజలు తమ కాలనీలో ఉన్న చేతి పంపు మరమ్మతులకు గురై పనిచేయకపోవడంతో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజలకు తాగునీరు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ వినతిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత ఎంపీడీవోకు ఎండార్స్ చేశారు. అన్నపురెడ్డిపల్లి మండలం అన్నపురెడ్డిపల్లి గ్రామంలోని బాలాజీనగర్ కాలనీవాసులు పెంట్లం సబ్‌స్టేషన్‌కు 132/33 కేవీ విద్యుత్ లైన్ నిర్మాణ పనులు గ్రామ శివారు నుంచి చేపట్టాల్సి ఉండగా కాలనీ మధ్యలో చేపడుతున్నారని, దీనివల్ల ప్రజలకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. విద్యుత్ లైన్ నిర్మాణాన్ని కాలనీ మధ్య నుంచి కాకుండా గ్రామ శివారు నుంచి చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సమర్పించిన వినతిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ తగు చర్యల నిమిత్తం సంబంధిత విద్యుత్ శాఖ ఈఈకు ఎండార్స్ చేశారు. గుండాల మండలం కొడవటంచ గ్రామానికి చెందిన బొమ్మల లాలుప్రసాద్ తనకు వారసత్వంగా వచ్చిన మూడు ఎకరాల ఒడ్డు భూమిపై అధికారులు సర్వే నిర్వహించినప్పటికీ ఇప్పటివరకు పట్టా మంజూరు కాలేదని, సంబంధిత భూమిపై పట్టా మంజూరు చేసి న్యాయం చేయాలని వినతిపత్రం సమర్పించారు. దీనిపై జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

### స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా

## నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

● జిల్లా కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం కలెక్టరేట్ ఆగస్టు 3,(ప్రజా జ్యోతి)** ఆగస్టు 15 స్వతంత్ర దినోత్సవం సందర్భంగా కొత్తగూడెం ప్రగతి మైదానంలో నిర్వహించనున్న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను దేశభక్తి, పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా స్థాయి అన్ని శాఖల అధికారులతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సన్నాహక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జిల్లాకు ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమమని, ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను సమయానికి పూర్తి చేసి వేడుకలను విజయవంతం చేయాలని సూచించారు.ప్రగతి మైదానంలో ప్రధాన వేదికను ఆకర్షణీయంగా రూపొందించడంతో పాటు ప్రోటోకాల్‌కు అనుగుణంగా ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర్య సమరయోధులు, అధికారులు, విశిష్ట అతిథులు, మీడియా ప్రతినిధులు, విద్యార్థులు, ప్రజలకు ప్రత్యేక సీటింగ్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను సక్రమంగా ఏర్పాటు చేసి బ్యారికేడ్లు, పార్కింగ్, సూచిక బోర్డులు, తాగునీటి సదుపాయం, పారిశుద్ధ్యం, మొబైల్ టాయిలెట్లు తదితర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని



వాటర్‌ప్రూఫ్ టెంట్లు ఏర్పాటు చేయడంతో పాటు వేదిక, విద్యుత్ అంతరాయం లేకుండా జనరేటర్లు సిద్ధంగా ఉంచి సౌండ్ సిస్టమ్, మైకులు, లైటింగ్, ఎల్ఈడీ స్క్రీన్లు ముందస్తుగా పరీక్షించాలని సంబంధిత శాఖలకు సూచించారు. వేడుకల ప్రాంగణంలో 108 అంబులెన్స్, వైద్య బృందాలు, ప్రథమ చికిత్స కేంద్రం, అవసరమైన మందులు సిద్ధంగా ఉంచాలని ఆరోగ్య శాఖకు ఆదేశించారు. అగ్నిమాపక శాఖ అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఫైర్ టెండర్లను సిద్ధంగా ఉంచాలని, పోలీసు శాఖ ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమం భారత ప్రభుత్వ ప్రోటోకాల్‌కు అనుగుణంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసేలా జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని తెలిపారు. వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, అటవీ, వైద్యం, విద్య, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమం, ఆర్టీసీ తదితర శాఖలు తమ కార్యక్రమాలను ప్రతిబింబించేలా ఆకర్షణీయమైన ప్రదర్శన స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు.విద్యార్థులతో దేశభక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, నాటికలు నిర్వహించి జాతీయ భావనను పెంపొందించేలా కార్యక్రమాలు రూపొందించాలని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తు చేసే అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రశంసా పత్రాల ప్రదానం కోసం శాఖల వారీగా ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగుల వివరాలను నిర్ణీత గడువులోపు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని శాఖలు తమకు అప్పగించిన బాధ్యతలను నిర్దేశిత గడువులో పూర్తి చేసి సమన్వయంతో పనిచేసి జిల్లా ప్రజల్లో దేశభక్తిని పెంపొందించేలా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, డిఆర్ఓ పద్మావతి, జిల్లా స్థాయి అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సీపీఐ నాయకులపై పెట్టిన కేసు కొట్టివేత

● పోడు సాగుదారులకు అండగా ఉంటాం ● సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం

**కొత్తగూడెం కలెక్టరేట్ ,/పాల్వంచ, ఆగస్టు 3,(ప్రజా జ్యోతి)** పాల్వంచ మండల పరిధిలోని మొండికట్ట గ్రామంలో 2016 సంవత్సరంలో పోడు సాగు చేసుకుంటున్నా రైతులపై ఫారెస్ట్ అధికారులు దాడులు చేస్తుండగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచంద్రరావు తదితర పార్టీ నాయకులు పోడు రైతులకు అండగా నిలిచారు. ఈ నేపథ్యంలో ఆనాటి ఫారెస్ట్ అధికారులు సీపీఐ నాయకులు, పోడు సాగుదారుల చిల్లా కృష్ణ, ముగెతే వెంకటమత్యం, బాద్ చెన్నయ్య, కందుకూరి మల్లేష్, చిట్ల కుమార్ స్వామి, నాగేశ్వరరావు, శంకర్, వనపర్తి శ్రీను, తిప్పన కొండల్, వనపర్తి దేవి, తిప్పన రేణుక, వడ్డే భద్రయ్య, వెంకన్న తో పాటుగా 23మంది పై అక్రమ కేసులు నమోదు చేసి జైలు కు పంపించారు. ఈ కేసు విచారణ కొత్తగూడెం సెకండ్ అడిషనల్ న్యాయమూర్తి ఎదుట సుదీర్ఘ విచారణ అనంతరం సోమవారం కేసును కొట్టేస్తున్నట్లు న్యాయమూర్తి తీర్పునిచ్చారు. సీపీఐ నాయకులు, పోడు



సాగుదారుల తరుపున సీనియర్ న్యాయవాదులు వై ఉదయ భాస్కర్, కోటం రాజు, ఉప్పుశెట్టి సునీల్ కుమార్ వాదించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం మాట్లాడుతూ పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, పోడు సాగుదారులకు అండగా కమ్యూనిస్ట్ పార్టీ ఉంటుందని స్పష్టం చేశారు.

# మీకు నేను అండగా ఉంటా..

## మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య. సీనియర్ జర్నలిస్టును పరామర్శించిన రాజయ్య.

రఘునాథపల్లి(ప్రజాజ్యోతి): సీనియర్ జర్నలిస్టు, బీసీ రాజ్యాధికార సమితి జనగాం జిల్లా ప్రచార కార్యదర్శి , రఘునాథపల్లి మండల కేంద్రం చెందిన సీనియర్ జర్నలిస్ట్ చింతకింది కృష్ణమూర్తి కుటుంబ సభ్యులను మాజీ డిప్యూటీ సీఎం స్టేషన్





ఘన్పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య సోమవారం మధ్యాహ్నం పరామర్శించారు. ఐదు రోజుల క్రితం సీనియర్ జర్నలిస్టు కృష్ణమూర్తి తల్లి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా తాటికొండ రాజయ్య పరామర్శించి చిత్రపటానికి పూలమాలు నిర్వహించారు . రాజయ్య మాట్లాడుతూ.. మూడు దశబ్దల పాటు జర్నలిస్టుగా పనిచేస్తున్న కృష్ణమూర్తి కుటుంబానికి బి ఆర్ ఎస్ పార్టీ అండగా ఉంటదని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల టిఆర్ఎస్ కన్వీనర్ మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ మున్సిపట్ల విజయ్, రఘునాథపల్లి సర్పంచ్ బొల్లం ఉమారాణి రాజీవ్, కవాటి రాజయ్య., కృష్ణమూర్తి రాజేశ్వరి దంపతులతో పాటు వారి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెంపు

**మొదటిపేజీ తరువాయి..**

ఎలాంటి చర్చ లేకుండానే బిల్లు ఆమోదం పొందింది. ఆర్డినెన్స్ జారీని వ్యతిరేకిస్తూ విపక్ష సభ్యులు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని కూడా మూజువాణి ఓటుతో సభ తిరస్కరించింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య సవరణ బిల్లు-2026ను సభలో ప్రవేశపెట్టిన సందర్భంగా కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ దాని గురించి వివరించారు. అనంతరం బిల్లుపై సభ్యులు మాట్లాడాలని సభాపతి ఓం బిర్లా కోరినప్పటికీ, విపక్షాల నినాదాలు కొనసాగడంతో బిల్లును ఓటింగ్‌కు పెట్టారు. దీంతో ఎలాంటి చర్చ లేకుండానే న్యాయమూర్తుల సంఖ్య సవరణ బిల్లు-2026కు సభ ఆమోదం తెలిపింది. ఇటీవల జనన, మరణాల నమోదు చట్ట సవరణ బిల్లు కూడా లోక్‌సభలో చర్చ లేకుండానే ఆమోదం పొందింది. తాజా బిల్లు ఆమోదం అనంతరం లోక్‌సభను స్పీకర్ వాయిదా వేశారు.

# కర్నాటక కాంగ్రెస్‌లో విస్తరణ చిచ్చు

**మొదటిపేజీ తరువాయి..**

అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాను' అని ఆయన పేర్కొన్నారు. అలాగే బేలూరు ఎమ్మెల్యే గోపాలకృష్ణ కూడా రాజీనామా చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు, మైసూర్ నాయకుడు తన్వీర్ సేట్‌కు మంత్రివర్గంలో చోటు నిరాకరించడంతో, ఆయన మద్దతుదారుడొకరు మైసూరులో విషం తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారు. అతన్ని





ప్రస్తుతం ఆసుపత్రికి తరలించగా, తన్వీర్ సేట్ నేరుగా వెళ్లి పరామర్శించారు. ధార్వాడ్‌లో ప్రసాద్ అబ్బయ్య మద్దతుదారులు రహదారిపై టైర్లు కాల్చి, ప్రభుత్వ బస్సుపై రాళ్ళు రువ్వి ఆందోళన చేపట్టారు. అసమ్మతి నేతల రహస్య భేటీ: హెచ్‌కే పాటిల్, దినేష్ గుండూరావుతో సహా పదవులు దక్కని సీనియర్ నాయకులు బెంగళూరులోని పీ.వీ. జయచంద్ర నివాసంలో అత్యవసర రహస్య సమావేశం ఏర్పాటు చేసి తదుపరి కార్యాచరణపై చర్చిస్తున్నారు. మంత్రి మునియప్ప అసంతృప్తి: మరోవైపు సీనియర్ నేత, కేబినెట్ మంత్రి కె.హెచ్. మునియప్ప కూడా తన శాఖ కేటాయింపుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, శాఖను మార్చాలని కోరుతున్నట్లు సమాచారం. ప్రమాణస్వీకారానికి కొన్ని గంటల ముందు కేబినెట్ జాబితాలో నాటకీయ మార్పులు చోటుచేసుకున్నాయి. తొలుత ప్రకటించిన ముసాయిదా నుంచి మంకాల్ వైద్య, గాయత్రి చంద్రశేఖర్‌లను తొలగించి, ఆఖరి నిమిషంలో సీనియర్ నేత ఎస్.ఎస్. మల్లికార్జున్‌కు కేబినెట్‌లో స్థానం కల్పించారు. కర్ణాటక కాంగ్రెస్ విస్తరణపై బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాలవీయా తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ చెబుతున్న సామాజిక న్యాయం, మహిళా సాధికారత మాటలకే పరిమితమని ఎద్దేవా చేశారు. కేబినెట్‌లో ఏకైక మహిళకే చోటు ఇవ్వడం, బ్రాహ్మణ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం లేకపోవడం, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న బి. నాగేంద్ర, జమీర్ అహ్మద్ ఖాన్‌లను తిరిగి కేబినెట్‌లోకి తీసుకోవడం కాంగ్రెస్ డొల్లతనాన్ని బయటపెడుతోందని ఆరోపించారు.

# అక్రెడిటేషన్ కమిటీల్లో టీడబ్ల్యూజేఎఫ్‌కు ప్రాతినిధ్యం ఇవ్వాలి


**రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు**

**జర్నలిస్టుల హక్కులకు మరోసారి న్యాయస్థానం అండ**

**ఇది మా టీడబ్ల్యూ జేఎఫ్ సభ్యుల విజయం**

**రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య**

హైదరాబాద్, ఆగస్టు 03(ప్రజాజ్యోతి): రాష్ట్రంలోని అన్ని జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ (డీఎంఏసీ)ల్లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్)కు ప్రాతినిధ్యం కల్పించాలని తెలంగాణ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. మీడియా అక్రెడిటేషన్ కమిటీల ఏర్పాటు విషయంలో జర్నలిస్టు సంఘాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరాన్ని హైకోర్టు స్పష్టం చేసింది. అన్ని అర్హులున్న టీడబ్ల్యూజేఎఫ్ కు అక్రెడిటేషన్ కమిటీల్లో ప్రాతినిధ్యం ఇవ్వకపోవడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీలను ఏర్పాటు చేసే సమయంలో తెలంగాణ



వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్‌కు ప్రాతినిధ్యం ఇవ్వకుండా వ్యవహరించడాన్ని సవాల్ చేస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు దాఖలైన రిట్ పిటిషన్‌పై గత ఆరు నెలలుగా పలుమార్లు విచారణ జరిగింది. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ కార్యాలయ న్యాయవాదులు, పిటిషనర్ తరఫున న్యాయవాదులు తమ వాదనలు కోర్టు ముందు వినిపించారు.ఇరుపక్షాల వాదనలు, ప్రభుత్వ ఉత్తర్వులు, మీడియా అక్రెడిటేషన్ కమిటీల ఏర్పాటు విధానం, జర్నలిస్టు సంఘాల ప్రాతినిధ్యానికి సంబంధించిన నిబంధనలను పరిశీలించిన అనంతరం తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, జస్టిస్ మొహినుద్దీన్‌ల ధర్మాసనం సోమవారం తీర్పును వెలువరించింది. రాష్ట్రంలోని అన్ని జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీల్లో టీడబ్ల్యూజేఎఫ్‌కు కూడా తగిన ప్రాతినిధ్యం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ తీర్పుతో రాష్ట్రంలోని జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీల్లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్‌కు అధికారిక ప్రాతినిధ్యం లభించే మార్గం సుగమమైంది. జర్నలిస్టు సంఘాల మధ్య సమాన అవకాశాలు, పారదర్శకత, న్యాయబద్ధమైన ప్రాతినిధ్యానికి ఈ తీర్పు దోహదపడుతుందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. హైకోర్టు తీర్పును తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకత్వం హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతించింది. జర్నలిస్టుల హక్కులు, గౌరవం, సంఘాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలన్న తమ పోరాటానికి ఇది న్యాయపరమైన విజయమని పేర్కొంది. ఈ తీర్పును వెంటనే అమలు చేసి, అన్ని జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీల్లో టీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సంఘం నాయకులు కోరారు. ఈ తీర్పు భవిష్యత్తులో మీడియా అక్రెడిటేషన్ కమిటీల ఏర్పాటులో అన్ని గుర్తింపు పొందిన జర్నలిస్టు సంఘాలకు సముచిత ప్రాధాన్యం కల్పించేలా మార్గదర్శకంగా నిలుస్తుందని జర్నలిస్టు వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. న్యాయం, ధర్మం తమవైపు ఉందని, హైకోర్టు ఇచ్చిన తీర్పు తమ సంఘం సభ్యుల విజయం అని రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య పేర్కొన్నారు.

# బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా..

పరకాల ఆగస్టు 3 (ప్రజాజ్యోతి): పరకాల ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలను పరిశీలించిన అనంతరం, కోట్ల రూపాయలతో నిర్మించిన 100 పడకల నూతన ప్రభుత్వ ఆసుపత్రిని అన్ని సౌకర్యాలతో వెంటనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఆసుపత్రి ముందు పరకాల–హనుమకొండ ప్రధాన



రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పరకాల కాంటెస్టెంట్ ఎమ్మెల్యే డా. పగడాల కాళీ ప్రసాద్ రావు, రాష్ట్ర నాయకులు డా. సిరంగి సంతోష్ కుమార్, పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా డా. పగడాల కాళీ ప్రసాద్ రావు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో విఫలమైందని ఆరోపించారు. ఇటీవల పరకాల ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీకి వైద్యులు అందుబాటులో లేకపోవడంతో వరంగల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ప్రసవం జరగడం ప్రభుత్వ వైద్య వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. కోట్ల రూపాయలతో నిర్మించిన 100 పడకల ఆసుపత్రిని ప్రారంభించకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది కొరతతో పాటు కనీస సౌకర్యాలు కూడా లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సాధారణ రక్తపరీక్షల కోసం కూడా వరంగల్‌కు నమూనాలు పంపాల్సిన పరిస్థితి ఉందని



పేర్కొన్నారు. నెల రోజుల్లోగా 100 పడకల ఆసుపత్రిని పూర్తిస్థాయిలో ప్రారంభించి, అన్ని వైద్య పోస్టులను భర్తీ చేసి అవసరమైన పరికరాలు, సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.పీ. జయంత్ లాల్, మున్సిపల్ కౌన్సిలర్లు కుక్కల విజయ్ కుమార్, బెజ్జంకి పూర్ణచారి, ఆకుల లావణ్య శ్రీధర్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పోలీస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై అసంతృప్తి

**మొదటిపేజీ తరువాయి..**

సరిపోదని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న సుమారు 19 వేల పోలీస్ పోస్టుల భర్తీకి మరో సమగ్ర నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నోటిఫికేషన్ విడుదలలో జరిగిన జాప్యం కారణంగా వేలాది మంది అభ్యర్థులు వయోపరిమితి దాటిపోయారని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఉద్యోగాలకు అర్హత కోల్పోయిన అభ్యర్థులకు న్యాయం చేయాలంటే వయోపరిమితిని పెంచాల్సిందేనని ప్రభుత్వాన్ని కోరారు. పోలీస్ నియామక నోటిఫికేషన్‌లో కానిస్టేబుల్ పోస్టులకు గరిష్ఠ వయోపరిమితిని 36 సంవత్సరాలకు, సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) పోస్టులకు 38 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే దరఖాస్తు రుసుము కూడా నిరుద్యోగులపై అదనపు భారం అవుతోందని, దానిని వెంటనే తగ్గించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసిన నిరుద్యోగులు, తమ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పోలీస్ ఉద్యోగాల భర్తీలో పారదర్శకతతో పాటు నిరుద్యోగులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ నేతలు మధుసూదన్ గౌడ్, శ్రీకాంత్, వీరేష్, కరుణాకర్, శ్రీకాంత్ రాథోడ్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

## సహజీవనం కూడా చట్టబద్ధమైన జీవితమే

**మొదటిపేజీ తరువాయి..**

ఉన్న వ్యక్తి వేధింపుల ఆరోపణల నుంచి తప్పించుకోలేరని పేర్కొంది. వివాహం జరగలేదన్న కారణాన్ని చూపి బాధితురాలికి చట్టపరమైన రక్షణ కల్పించకపోవడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు విరుద్ధమని తెలిపింది. ఈ మేరకు జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఈ సందర్భంగా భర్త అనే పదానికి ధర్మాసనం విస్తృత వివరణను ఇచ్చింది. సహజీవన చేస్తున్న వ్యక్తిని భర్తతో సమానంగా పరిగణించవచ్చని తెలిపింది. ఇలాంటి వ్యక్తులు భాగస్వామిని వేధించి తప్పించుకోలేరని ధర్మాసనం పేర్కొంది. అయితే, అన్ని రకాల సహజీవనాలకు ఈ తీర్పు వర్తించదని స్పష్టం చేసింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి సహజీవనం చేస్తూ హింసకు పాల్పడిన వారికే సెక్షన్ 498-ఏ వర్తిస్తుందని వెల్లడించింది. అలాగే, ప్రాథమిక విచారణ నిర్వహించకుండా తక్షణ అరెస్టులు చేయవద్దని పోలీసులకు కఠిన ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా సెక్షన్ 498-ఏ ఉద్దేశాన్ని ధర్మాసనం వివరించింది. ఈ సెక్షన్ మహిళలను భర్త లేదా అతని కుటుంబ సభ్యుల మానసిక, శారీరక వేధింపుల నుంచి రక్షించడానికే అని గుర్తు చేసింది.

## విద్యార్థులపై నమోదైన కేసులు వెనక్కి

**మొదటిపేజీ తరువాయి..**

సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం, ప్రభుత్వం కోర్టుకు ఇచ్చిన హామీ కేవలం మాటల్లోనే కాకుండా ఆచరణలోనూ కనిపించాలని పేర్కొంది. గతంలో ఇచ్చిన హామీలకు విరుద్ధంగా విద్యార్థులపై అనవసరమైన చట్టపరమైన చర్యలు కొనసాగించకూడదని సూచించింది. విద్యార్థులపై బలవంతపు చర్యలు తీసుకోవద్దని ఇప్పటికే సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.ఇప్పటికే నమోదైన ఎఫ్ఐఆర్‌ల దర్యాప్తు అంశంపై వివాదం కొనసాగుతుండటంతో, ప్రభుత్వం తన హామీని ఎలా అమలు చేస్తుందనే అంశంపై కోర్టు దృష్టి సారించింది. ఇక విద్యార్థుల ఆందోళనలకు నాయకత్వం వహిస్తున్న సీజేపీ మాత్రం ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం అన్ని ఎఫ్ఐఆర్‌లను పూర్తిగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తోంది. హామీలు అమలు కాకపోతే దేశవ్యాప్తంగా మళ్లీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించింది.



# అంతర్జాతీయ - అంతర్రాష్ట్ర నేరస్థుల ముఠా అరెస్ట్

**ఇద్దరు బంగ్లాదేశ్ వాసులు, ఒక భారతీయ నిందితుడు అరెస్ట్**

**సుమారు 9 సం"గా దేశ వ్యాప్తంగా ఇళ్లలో, ద్విచక్ర వాహ నాలు చోరీలకు పాల్పడుతు న్న ముఠా**

**మావల లో జరిగిన చోరీ కేసును ఛేదించిన ఆదిలాబా ద్ జిల్లా పోలీసులు**

**రూ.8 లక్షల విలువైన 73.0 5 గ్రాముల బంగారం, 151. 30 గ్రాముల వెండి, ఐఫోన్లు, ఐప్యాడ్, ద్విచక్ర వాహనం స్వాధీనం**

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

ఆదిలాబాద్ బ్యూరో,ఆగష్టు 3, (ప్రజా జ్యోతి): ఆదిలాబాద్ జిల్లా మావల పోలీస్ స్టేషన్ పరిధిలో కైలాష్ నగర్ లో ప్రముఖ రాజకీ య నాయకుడు ఇంట్లో జరి గిన చోరీ కేసును పోలీసులు విజయవంతంగా ఛేదించి, అంతర్జాతీయ – అంతర్రాష్ట్ర స్థాయిలో నేరాలకు పాల్ప డుతున్న ముఠాకు చెందిన ఇద్దరు బంగ్లాదేశ్ వాసుల ను, ఒక భారతీయ నిందితు డిని, మొత్తం ముగ్గురిని అరె స్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ అఖి ల్ మహాజన్, ఐపీఎస్ సో మవారం స్థానిక పోలీస్ హె డ్ క్వార్టర్స్ సమావేశ మం దిరంలో ఏర్పాటు చేసిన మీ డియా సమావేశంలో తెలి పారు.

### నిందితుల వివరాలు :

ఎ1) మొహమ్మద్ జౌనీ అలీ @ జానీ అలీ (30), S/o: మొ హమ్మద్ రహ్మత్ అలీ, వృత్తి: ఎలక్ట్రీషియన్, స్వస్థలం: పర్బతిపూర్, దినాజ్‌పూర్ జిల్లా, బంగ్లాదేశ్, ప్రస్తుతం: సయ్యద్ కాలనీ, ఔట్‌సైడ్ చార్ దర్వాజా, జైపూర్, రాజస్థాన్.

ఎ2) మొహమ్మద్ రుమాన్ అలీ (33), S/o: మొహమ్మ ద్ రహ్మత్ అలీ, వృత్తి: ఎల క్ట్రీషియన్, స్వస్థలం: పర్బ తిపూర్, దినాజ్‌పూర్ జిల్లా, బంగ్లాదేశ్, ప్రస్తుతం: సయ్య ద్ కాలనీ, ఔట్‌సైడ్ చార్ ద ర్వాజా, జైపూర్, రాజస్థాన్.

ఎ3) తరుణ్ సింగ్ (29), S/o: హిమ్మత్ సింగ్, కులం: రాజ్‌పుత్, వృత్తి: పండ్ల వ్యాపారి, నివాసం: మిస్రో త్, భాగ్‌మోలియా, భోపా ల్, మధ్యప్రదేశ్.దర్యాప్తులో ప్రధాన నిందితుడు మొహ మ్మద్ జౌనీ అలీ 2015 సంవత్సరం నుంచి సుమా రు 9 సంవత్సరాలుగా రాజ స్థాన్, ఒడిశా, కర్ణాటక, ఛత్తీ స్గఢ్, మధ్యప్రదేశ్, మహా రాష్ట్ర, తెలంగాణ తదితర రాష్ట్రాల్లో సంచరిస్తూ ఇళ్లకు తాళాలు పగులగొట్టి చోరీ లు,



ద్విచక్ర వాహనాల చోరీ లకు పాల్పడుతున్నట్లు వెల్లడైంది. నిందితుడు అక్రమం గా భారతదేశంలోకి ప్రవేశిం చి నకిలీ ఆధార్ కార్డు పొంది నట్లు కూడా విచారణలో తె లిందని తెలిపారు. ఇటీవల జూలై 11న బంగ్లాదేశ్ నుం చి భారతదేశంలోకి ప్రవేశిం చిన అనంతరం తన సహ చరులతో కలిసి మధ్యప్రదే శ్, మహారాష్ట్ర మీదుగా ఆ దిలాబాద్ చేరుకుని మావల పోలీస్ స్టేషన్ పరిధిలో కైలా ష్ నగర్ నందు చోరీకి పాల్ప డినట్లు గుర్తించడం జరిగిం దని తెలిపారు.నింది తులు పగటిపూట కుక్కర్లు, గ్రైం దర్లు విక్రయిస్తున్నట్లు నటి స్తూ కాలనీల్లో సంచరించి ఇళ్లను రెక్కీ నిర్వహించి, రాత్రి వేళల్లో తాళాలు పగు లగొట్టి చోరీలకు పాల్పడు తున్నట్లు విచారణలో వెల్ల డైందని అన్నారు. ప్రధాన నిందితుడు మొహమ్మద్ జౌ నీ అలీపై దేశంలోని పలు రా ష్ట్రాల్లో 8 కు పైగా నేరాల కే సులు, సహ నిందితుడు త రుణ్ సింగ్‌పై 6కు పైగా కేసు లు నమోదై ఉండగా, ముఠా లోని ఇతర సభ్యులపై కూ డా వివిధ రాష్ట్రాల్లో పలు కేసులు నమోదై ఉన్నట్లు ఎస్పీ తెలిపారు.

### రికవరీ చేసిన ఆస్తి :

పోలీసులు నిందితుల వద్ద నుంచి మొత్తం 73.05 గ్రాముల బంగారం (ఆదిలాబా ద్ కేసుకు సంబంధించిన 50.75 గ్రాములు, నాగ్‌పూర్ కేసుకు సంబంధించిన 22. 30 గ్రాములు), 151.30 గ్రాముల వెండి,రూ.4,270 నగదు, 5 ఐ ఫోన్లు, 2 శాం సంగ్ మొబైల్ ఫోన్లు, ఒక ఆ పిల్ ఐప్యాడ్,నేరాలకు ఉపయోగించిన ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి, ఇతర వస్తువుల మొత్తం విలువ సు మారు రూ. 8 లక్షలు ఉంటుందని తెలిపారు. దర్యా ప్తులో ప్రధాన నిందితుడు మొహమ్మద్ జౌనీ అలీ గత కొన్నేళ్లుగా సుమారు 10 నుండి 12 సార్లు అక్రమంగా బంగ్లాదేశ్ నుండి భారత దే శంలోకి ప్రవేశించి, వివిధ రాష్ట్రాల్లో ఇళ్లలో చోరీలు, ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడి తిరిగి బంగ్లాదేశ్‌కు వెళ్లినట్లు వెల్లడైంది. ఇదే తరహాలో పనిచేసే 12 నుం డి 15 మంది బంగ్లాదేశ్ వా సులతో కూడిన ముఠాతో అతనికి సంబంధాలు ఉన్న ట్లు గుర్తించారు. ముఠాలోని మిగిలిన సభ్యులను గుర్తిం చి అరెస్ట్ చేసేందుకు దర్యా ప్తు కొనసాగుతోంది.జిల్లా పోలీసులు సాంకేతిక ఆధా రాలు, సీసీటీవీ ఫుటేజీలు, నిఘా సమాచారం, వివిధ రాష్ట్రాల పోలీసులతో సమ న్వయం ద్వారా వేగంగా ద ర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్ట్ చేసి కేసును ఛేదించా రు. మరింత లోతైన దర్యా ప్తు కొనసాగుతోంది అని తె లిపారు. ఈ ముఠాకు చెంది న ఇతర సభ్యులు, సహచ రులు, అక్రమంగా భారత దేశంలో నివసించేందుకు సహకరించిన వ్యక్తులు, నకి లీ పత్రాలు సమకూర్చిన వా రి పాత్రపై సంబంధిత రాష్ట్ర పోలీసులతో సమన్వయం చేస్తూ మరింత లోతైన ద ర్యాప్తు కొనసాగుతున్నట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజ న్, ఐపీఎస్ తెలిపారు. దేశ భద్రతకు ముప్పుగా మారే అక్రమ విదేశీయులు, అంత ర్జాతీయ అంతర్రాష్ట్ర నేర ముఠాలపై ప్రత్యేక నిఘా కొ నసాగిస్తూ చట్టపరంగా కఠి న చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.

కేసును చేదించడంలో కీలక పాత్ర పోషించిన మావల సీ ఐ బీడీ ప్రేమ్ కుమార్, సైబ ర్ క్రైమ్ ఎస్ఐ గోపికృష్ణ, సి బ్బంది త్రిశూల్ క్రైమ్ సి బ్బంది శ్రీనివాస్ తదితరు ల ను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కా ర్యక్రమంలో ఆదిలాబాద్ డి ఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, మా వల సీఐ బీడీ ప్రేమ్ కుమా ర్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ చంద్ర శేఖర్, సైబర్ క్రైమ్ ఎస్ఐ గో పికృష్ణ, సిబ్బంది తదిత రు లు పాల్గొన్నారు.

నేర చరిత్ర – మొహమ్మద్ జౌని అలీ @ జోనీ అలీ2017 – ఒడిశా రాష్ట్రం: జువె ల్ షేక్, సబూర్ అలీతో కలి సి ద్విచక్ర వాహన చోరీ, రా త్రి వేళ గృహ భేదన నేరా లకు పాల్పడ్డాడు. ఈ కేసు లో అరెస్టై జైలుకు వెళ్లగా, సబూర్ అలీ పరారీలో ఉ న్నాడు. 2019 – ఛత్తీస్ గఢ్ రాష్ట్రం: మహ్మద్ మ క్సూద్ అలీ @ కల్లు, మ హ్మద్ అబూ బకర్ @ ఆకా ష్ @ శంభు యాదవ్, ఫర్జా న్ ఖాన్, సుమంత్ ఖండో కర్, మహ్మద్ సుమంత్ ఖాన్, షేక్ మసూమ్, మ హ్మద్ బడోల్ @ బాదల్ రా య్‌లతో కలిసి నాలుగు రా త్రి గృహభేదన నేరాలకు పా ల్పడ్డాడు. 2020 – మధ్య ప్రదేశ్ రాష్ట్రం: మొబైల్ చోరీ కేసులో అరెస్టై జైలుశిక్ష అనుభవించాడు.2021 – ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం: మహ్మద్ మక్సూద్ అలీ @ కల్లు, సు మంత్ ఖండోకర్, మహ్మద్ సుమంత్ ఖాన్, మహ్మద్ ఐ జిజుల్ ఇస్మాయిల్ @ బాద ల్ రాయ్, వికాస్ సోని, మ హ్మద్ అబూ బకర్ @ ఆకా ష్ @ శంభు యాదవ్ తది తరులతో కలిసి ద్విచక్ర వా హన చోరీ, రాత్రి గృహభేదన నేరాలకు పాల్పడి అరెస్టయ్యాడు. 2022 – మధ్య ప్రదేశ్ రాష్ట్రం: అష్రఫ్ ఉల్ ఇస్లాం గోబింద్ తో కలిసి మోటార్ సైకిల్ చోరీ, గృహ భేదన నేరాలకు పాల్పడి అరెస్టై జైలుకు వెళ్లాడు.

2023 – మధ్యప్రదేశ్ రా ష్ట్రం: లూత్‌ఫర్‌తో కలిసి గృ హభేదన నేరానికి పాల్పడి మరోసారి అరెస్టయ్యాడు. 2026 – మధ్యప్రదేశ్ – మ హారాష్ట్ర – తెలంగాణ: బం గ్లాదేశ్ నుంచి రషీదుల్ అనే దళారి సహాయంతో అక్ర మంగా భారత్ లోకి ప్రవే శించి, తన బంధువు రుమా న్ అలీ, భారతీయుడు తరు ణ్ సింగ్‌తో కలిసి భోపాల్‌లో ద్విచక్ర వాహన చోరీ, నాగ్ పూర్‌లో, అనంతరం ఆది లాబాద్ జిల్లా మావల పోలీ స్ స్టేషన్ పరిధిలో కైలాష్ న గర్ నందు ఇళ్ల చోరీల నేరా నికి పాల్పడ్డాడు. అని ఎస్పీ వివరించారు.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967